PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

సిటీ◆

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 232 | విజయవాడ, ఆదివారం 26 మార్చి 2023 | 6 + 8 పేజీలు + స్నేహ వెల : 7. 00

Vol No | Vijayawada, Sunday 26 March 2023 | Rs

పెరుగుతోన్న నిరుద్యోగం

- తగ్గించేందుకు ప్రయత్నించని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు
- పోరాటాలతోనే సమాధానం చెప్పాలి
- డివైఎఫ్ఐ జాతీయ అధ్యక్షులు రహీం

• లోపలి పేజీలో.. •

నయా ఛాంపియన్స్ స్వీటీ, నీతు

మహిళల బాక్సింగ్ ప్రపంచకప్

న్యూఢిల్లీ: మహిళల బాక్సింగ్ ప్రపంచ ఛాంపియన్‌గా స్వీటీ బూర, నీతు ఘంగాస్ నిలిచారు. శనివారం జరిగిన 81కిలోల విభాగం, 48కిలోల విభాగం ఫైనల్లో ప్రత్యర్థులపై గెలిచి ప్రపంచ బాక్సింగ్ నయా ఛాంపియన్స్‌గా అవతరించారు.

ఫైనల్లో 22ఏళ్ల నీతు ఘంగాస్ 5-0పాయింట్ల తేడాతో మంగోలియాకు చెందిన లుట్సాయ్‌ఖాన్‌పై విజయం సాధించింది. సెమీస్‌లో నీతు 5-2పాయింట్ల తేడాతో కజకిస్తాన్‌కు చెందిన బెల్కిబెకోను ఓడించి ఫైనల్‌కు చేరింది. ఇక 81కిలోల లైట్ హెవీవెయిట్ విభాగం ఫైనల్లో స్వీటీ బూర 4-3పాయింట్ల తేడాతో చైనాకు చెందిన వాంగ్-లినాపై పోరాడి నెగ్గింది. రెండోరౌండ్ ముగిసే సరికి స్వీటీ 3-2పాయింట్ల ఆధిక్యతలో నిలిచింది. ఇక మూడో రౌండ్‌లో ఇరువురు రక్షణాత్మకంగా ఆడడంతో అంపైర్లు స్వీటీని విజేతగా ప్రకటించారు. 2014 ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో స్వీటీ తొలిసారి రజిత పతకం సాధించింది. గతంలో మేరీకోమ్, సవిత దేవి, జెన్నీ ఆర్ఎల్, లేఖా, నిఖత్ జరీన్ ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో స్వర్ణ పతకాలను సాధించారు.

భారత్‌కు చెందిన మరో ఇద్దరు బాక్సర్లు నిఖత్ జరీన్(50కిలోలు), లౌలీనా బోర్గోహైన్ (75కిలోలు) ఫైనల్లో తలపడాల్సి ఉంది.

ఎనర్జీ ఇంటెన్సివ్ పరిశ్రమలపై

రూ.350 కోట్లు భారం

- మిగిలిన పరిశ్రమలు, గృహ వినియోగదారులకు ఊరట
- సోలార్ రూఫ్ టాప్ నెట్ మీటరింగ్‌కు మార్గదర్శకాలు
- ఎపి ఇఆర్‌సి టారిఫ్ ఆర్డర్ విడుదల

విద్యుత్ ఛార్జీల ఉత్తర్వులను విడుదల చేస్తున్న ఎపిఇఆర్‌సి చైర్మన్ జస్టిస్ సివి నాగార్జున రెడ్డి

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

ఉత్పత్తి వ్యయంలో విద్యుత్తుకు అత్యధికంగా ఖర్చయ్యే ఎనర్జీ ఇంటెన్సివ్ (ఫెర్రో ఎల్లాయిస్) పరిశ్రమలపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్తు నియంత్రణ మండలి (ఎపి ఇఆర్‌సి) భారం మోపింది. కిలోవాట్‌కు రూ.465 డిమాండ్ ఛార్జీని వసూలు చేయాలని నిర్ణయించింది. ఫలితంగా ఈ పరిశ్రమలపై ఏటా రూ.350 కోట్ల భారం పడనుంది. ఈ పరిశ్రమలకు మినహా మిగతా పరిశ్రమలకు, గృహ వినియోగదారులకు, వ్యవసాయదారులకు ఊరట కల్పించింది. రాష్ట్రంలో విద్యుత్తు ఛార్జీలు పెంచలేదని, వచ్చే ఆర్థిక సంవత్సరంలో వినియోగదారులపై ఎలాంటి భారాలూ ఉండవని ఎపిఇఆర్‌సి చైర్మన్ జస్టిస్ సివి.నాగార్జున రెడ్డి తెలిపారు. విశాఖలోని ఎపి ఇపిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో శనివారం ఆయన ఎపిఇఆర్‌సి సభ్యులు ఠాకూర్ రామ్ సింగ్, ఎ.రాజగోపాల్ రెడ్డిలతో కలిసి విద్యుత్తు ఛార్జీల ఉత్తర్వులను విడుదల చేశారు. ఈ సందర్భంగా నాగార్జున రెడ్డి మాట్లాడుతూ 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఎపిఇఆర్‌సి నిర్ణయించిన మొత్తం ఆదాయ అంతరం రూ.10,135 కోట్లను డిస్కములకు సబ్సిడీ రూపంలో ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించడంతో కేవలం ఎనర్జీ ఇంటెన్సివ్ ఇండస్ట్రీస్‌లకు మినహా మిగిలిన ఏ కేటగిరికీ విద్యుత్తు ఛార్జీలు పెంచలేదని తెలిపారు. రైతులకు తొమ్మిది గంటల ఉచిత విద్యుత్తు, ఎస్‌సి, ఎస్‌టి, ఎంబిసి, ఆక్వా రైతులు వంటి వివిధ తరగతుల వినియోగదారులకు ప్రభుత్వం రాయితీ కొనసాగిస్తుందని చెప్పారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి విద్యుత్తు పంపిణీ సంస్థలు రూ.52,590.7 కోట్ల మొత్తంతో ఆదాయ అవసరాల (ఎఆర్ఆర్)ను ఎపి ఇఆర్‌సికి సమర్పించగా, రూ.49,267.36 కోట్ల మొత్తానికి ఆమోదం తెలిపిందని చెప్పారు. విద్యుత్తు అమ్మకాలు, విద్యుత్తు కొనుగోలు అవసరాలు, కొనుగోలు ఖర్చులు తదితరాలు విద్యుత్తు పంపిణీ సంస్థల అంచనాల కంటే తక్కువగా ఉండడంతో ఎపి ఇఆర్‌సి ఈ నిర్ణయం తీసుకుందని తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఎపి ఇఆర్‌సి మొదటిసారిగా విద్యుత్తు కొరత, మిగులును వాస్తవికంగా అంచనా వేసేందుకు వీలుగా టిఒడి వారీగా డిమాండ్, లభ్యతను అంచనా వేసిందని చెప్పారు. సాధారణ పరిస్థితుల ఆధారంగా ఉత్పత్తి, లభ్యతను పరిగణనలోకి తీసుకోవడం వల్ల డిస్కముల మార్కెట్ కొనుగోళ్లకు సంబంధించి వాస్తవికత ఉండడం లేదన్నారు. వాటి స్వల్పకాలిక విద్యుత్తు కొనుగోళ్లను నియంత్రించడంలో ఎపి ఇఆర్‌సి 2022 నిబంధన 1ని కచ్చితంగా అమలు చేస్తోందని తెలిపారు. చేనేత కార్మికులు, పిండి మిల్లుల విద్యుత్తు వినియోగదారుల అభ్యర్థనలకు అనుగుణంగా 10 హెచ్‌పి వరకు కెవిఎహెచ్ బిల్లింగ్‌ను మినహాయిస్తూ మిగతా 5లో

మహిళా సాధికారతే లక్ష్యం

పొదుపు సంఘాలకు రాష్ట్రం రోల్ మోడల్ • దెందులూరు సభలో సిఎం జగన్ • మూడో విడత ఆసరా నిధులు విడుదల

ప్రజాశక్తి- ఏలూరు ప్రతినిధి, ఏలూరు టౌన్

మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి అన్నారు. దేశంలో పొదుపు సంఘాలకు మన రాష్ట్రం రోల్ మోడల్‌గా ఉందని, వివిధ బ్యాంకుల ద్వారా ఈ సంఘాలకు ఏటా రూ.30 వేల కోట్లకుపైగా రుణాలు అందుతున్నాయని, రుణాల చెల్లింపులు 99.55 శాతంగా ఉండడం గర్వకారణమని పేర్కొన్నారు. తమది మహిళా పక్షపాత ప్రభుత్వమన్నారు. శనివారం ఆయన ఏలూరు జిల్లా దెందులూరులో డ్వాక్రా సంఘాలకు మూడో విడత ఆసరా నిధులను బటన్ నొక్కి విడుదల చేశారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో జగన్ మాట్లాడుతూ 21వ శతాబ్దపు ఆధునిక భారతీయ మహిళ రాష్ట్రంలోని ప్రతి గ్రామం, ప్రతి ఇంటి నుంచి రావాలన్న తపన, తాపత్రయంతో ఈ 45 నెలల పాలనలో వివిధ పథకాల ద్వారా అక్కాచెల్లెళ్లకు రూ.2.25 లక్షల కోట్లు ఇచ్చామన్నారు. ఇచ్చిన మాట ప్రకారం 2019 మార్చి 31 వరకు ఉన్న రూ.25,500 కోట్ల రుణాలు నాలుగు విడతల్లో ఇస్తున్నామని తెలిపారు. మూడో విడత ఆసరా నిధుల కింద రూ.6419 కోట్లు మహిళల ఖాతాల్లోకి నేరుగా జమవుతాయన్నారు. వైఎస్ఆర్ ఆసరా సున్నా వడ్డీ ద్వారా మరో రూ.22,793 కోట్లు అక్కాచెల్లెళ్లకు అందించినట్లు వివరించారు. 30 లక్షల మంది మహిళలకు వారి పేరుతో ఇళ్ల పట్టాలిచ్చామని, 22 లక్షల మంది ఇప్పటికే ఇళ్ల నిర్మాణం ప్రారంభించారని తెలిపారు. ఇవి పూర్తయితే ఈ ఒక్క పథకం ద్వారా రూ.రెండు నుంచి రూ.మూడు లక్షల కోట్లు వారి చేతిలో పెట్టినట్లవుతుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో 2014-19 మధ్య పొదుపు సంఘాలకు సగటున బ్యాంకు రుణాలు రూ.14 వేలు ఇస్తే, ఇవాళ సగటున బ్యాంకు రుణాలు ఏటా రూ.30 వేలు అందుతున్నాయని తెలిపారు. సున్నా వడ్డీని మళ్లీ తీసుకొచ్చి దీనికింద రూ.3,036 కోట్లు ఇవాళ వడ్డీ రూపంలో తిరిగి చెల్లించామన్నారు. మహిళల రక్షణకే దిశ యాప్ తీసుకొచ్చామని తెలిపారు. నామినేటెడ్ పదవుల్లో 50 శాతం పోస్టులు, నామినేషన్లపై ఇచ్చే కాంట్రాక్టు పనుల్లో 50 శాతం మహిళలకే ఇవ్వాలని అసెంబ్లీలో చట్టం చేశామని జగన్ గుర్తు చేశారు.

బటన్ నొక్కి ఆసరా నిధులు విడుదల చేస్తున్న ముఖ్యమంత్రి జగన్

ప్రభుత్వ నిరంకుశత్వం : ఎంఎల్‌సి సాబ్జీ

ప్రొటోకాల్‌లో ప్రజాప్రతినిధిగా ఆహ్వానం పలికి ముందస్తు అరెస్టు చేయడం రాష్ట్ర ప్రభుత్వం నిరంకుశ పాలనకు నిదర్శనమని మిగతా 5లో

ఎంఎల్‌సి సాబ్జీ గృహ నిర్బంధం

సిఎం పర్యటన నేపథ్యంలో ప్రభుత్వం అరెస్టులు, గృహనిర్బంధాలకు పాల్పడింది. ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి షేక్ సాబ్జీని సిఎం పర్యటనకు అధికారులు ఆహ్వానం పలికారు. ప్రొటోకాల్ జాబితాలో ఆయన పేరు కూడా ఉంది. అయినా, సిఎం పర్యటనకు వెళ్లనీయకుండా ఇంటి ముందు పోలీసులు పహారా కాసి ఆయనను గృహనిర్బంధంలో ఉంచారు. ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్‌ను కార్యాలయంలోనూ, జిల్లా అధ్యక్షులు నరసింహాను నూజివీడు పోలీస్ స్టేషన్‌లోనూ నిర్బంధించారు. సిఐటియు నేత, ఎపి భవన నిర్మాణ కార్మిక సంఘం నేత రమణను గృహ నిర్బంధం చేశారు.

ప్రజాస్వామ్యంపై దాడి

ప్రధాని డ్రామా అంతా అదానీని కాపాడేందుకే

మద్దతు తెలిపిన ప్రతిపక్షాలకు కృతజ్ఞతలు

మీడియాతో రాహుల్ గాంధీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

'దేశంలో ప్రజాస్వామ్యంపై దాడి జరుగుతోంది. 'అదానీ డొల్ల కంపెనీలకు రూ.20 వేలకోట్ల పెట్టుబడులు ఎలా వచ్చాయి? దాని గురించి ప్రశ్నించినందుకే నాపై అనర్హత వేటు వేశారు. నేను ఎవ్వరికీ భయపడను. జైలుకు పంపినా తగ్గేదేలేదు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాడుతూనే ఉంటా' అని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. శనివారం ఎఐసిసి ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాహుల్ గాంధీ మాట్లాడారు. అదానీపై తన తదుపరి ప్రసంగం ఎలా ఉంటుందోనని ప్రధాన మంత్రికి భయం పట్టుకుందని, ఆ భయం మోడీ కళ్లల్లో తాను చూశానని అన్నారు. అందువల్లే తొలుత తనపై వక్రీకరణలు చేశారని, ఇప్పుడు అనర్హత వేటు వేశారని విమర్శించారు. 'అదానీ వ్యవహారంలో ఆధారాలను నేను పార్లమెంటుకు తెలియజేశాను. లోక్‌సభలో నా ప్రసంగాన్ని కేంద్రం కావాలనే తొలగించింది. స్పీకరుకు అన్ని ఆధారాలు ఇచ్చాను. స్పీకరును కలిసి మాట్లాడేందుకు సమయం ఇవ్వమంటే నవ్వి వదిలేశారు. అదానీ డొల్ల కంపెనీలపై ప్రధాని సమాధానం చెప్పాలి. అదానీ కంపెనీలో పెట్టుబడులు పెట్టిన డొల్ల కంపెనీలు రక్షణ రంగంతో ముడిపడి ఉన్నాయి. ఒక చైనా జాతీయుడికి కూడా ఈ పెట్టుబడులతో సంబంధం ఉంది. అందుకే ఆ పెట్టుబడుల వివరాలేంటో చెప్పాలని అడిగాను. నా గురించి కేంద్ర మంత్రులు పార్లమెంటులో అబద్ధాలు చెప్పారు. లండన్ ప్రసంగంపై మంత్రులు తప్పుడు ప్రచారం చేశారు. గుజరాత్ సిఎంగా మోడీ ఉన్నప్పటి నుంచే, అదానీతో మోడీకి సంబంధాలున్నాయి. ఇది ఒబిసిల వ్యవహారం కాదు. ఇది మోడీ-అదానీల వ్యవహారం. దానినుంచి దృష్టి మళ్లించడం కోసం విదేశాల్లో నా వ్యాఖ్యల గురించి మాట్లాడతారు. అనర్హత అంశాన్ని తీసుకొస్తారు. ఇప్పుడు ఒబిసి అంటారు' అని ధ్వజమెత్తారు.

మోడీ, అదానీ దేశాన్ని ఎలా వంచిస్తున్నారో ప్రజలకు వివరిస్తా..

అదానీ వంటి వ్యక్తులు ప్రధానితో తమకున్న సంబంధాలతో దేశాన్ని ఎలా వంచిస్తున్నారో ప్రజల ముందుకు వెళ్లి వివరిస్తానని అన్నారు. 'భారత్ జోడో యాత్రతో ప్రజల్లోకి వెళ్లాను. నేను దేశ ప్రజాస్వామ్యం కోసం పోరాడాను. పోరాడుతూనే ఉంటాను. ప్రజాస్వామ్యాన్ని కాపాడే వ్యక్తివే అయితే నాకు మాట్లాడే అవకాశం మిగతా 5లో

ఎక్కడి ఉద్యోగికైనా 20 శాతం రాయితీ

- ప్లాట్ల కొనుగోలుపై సిఆర్‌డిఎ ప్రకటన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ (సిఆర్‌డిఎ) పరిధిలోని జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్‌లో ప్లాట్లను రాష్ట్రంలో ఎక్కడ పనిచేస్తున్న ఉద్యోగులైనా కొనుక్కోవచ్చని, వారికి 20 శాతం రాయితీ ఇస్తామని సిఆర్‌డిఎ కమిషనరు వివేక్‌యాదవ్ ప్రకటించారు. సిఆర్‌డిఎ పరిధిలో ఏర్పాటు చేసిన జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్‌లో పదిశాతం ప్లాట్లను 20 శాతం రాయితీకి ఇస్తున్నామని, దీన్ని అందరూ వినియోగించుకోవాలని సూచించారు. ఎంఐజి లేఅవుట్లో 200 గజాల ప్లాట్లు 58, 240 చదరపు గజాల ప్లాట్లు 188 అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ప్లాట్‌లో చదరపు గజం రూ.17,499గా ప్రకటించారు. అలాగే ఒకేసారి చెల్లిస్తే 5 శాతం రాయితీ ఇస్తామని తెలిపారు. 40 శాతం అభివృద్ధి ధరపై రిజిస్ట్రేషన్ మినహాయింపూ ఉంటుందని వివరించారు. టౌన్‌షిప్ ఏర్పాటుచేసి ఏడాది దాటిపోతున్నా స్పందన లేకపోవడంతో సిఆర్‌డిఎ ఈ నిర్ణయం తీసుకుంది.

పోలవరం కాంటూరు

హద్దులు మార్చాలి

- సిపిఎం రాష్ట్ర కమిటీ
- బోయ, వాల్మీకి సమస్యపై భాగస్వామ్య పక్షాల అభిప్రాయాలు అవసరం
- 'ఎస్సీలుగా దళిత క్రిస్టియన్లు' తీర్మానంపై హర్షం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పోలవరంపై అసెంబ్లీలో ముఖ్యమంత్రి ప్రకటన నిర్వాసితులకు నష్టం చేసేదిగా ఉందని సిపిఎం రాష్ట్ర కమిటీ పేర్కొంది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు శనివారం ప్రకటన విడుదల చేశారు. పోలవరం డ్యామ్ నిర్మాణం ఎత్తుకనుగుణంగా మునక ప్రాంతాల్లో నిర్వాసిత గ్రామాలు, ప్రజల లెక్కలు లేవని పేర్కొన్నారు. గత సంవత్సరం గోదావరి వరదల సందర్భంగా 138 అడుగులలోపే వచ్చినప్పటికీ 145 కాంటూరులో లేని గ్రామాలు కూడా మునిగిపోయాయని తెలిపారు. గోదావరి మొదటి ప్రమాద హెచ్చరిక వచ్చేటప్పటికే అనేక గ్రామాలు వరదమయమయ్యాయని, కొత్తగా నిర్మించిన పునరావాస గ్రామాలు కూడా మునిగిపోతున్నాయని పేర్కొన్నారు. పోలవరం రిజర్వాయరు కాంటూరు లెక్కలు తప్పులు తడకగా వున్నాయని ఇది రుజువు చేసిందని వివరించారు. ఉన్నతస్థాయి ఇంజినీర్ల బృందాన్ని నియమించి తిరిగి కాంటూరు లెక్కలు తీసి దానికనుగుణంగా పునరావాసం కల్పించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రకటించిన నిర్వాసితుల సంఖ్య ఆమోదయోగ్యం కాదని, వాస్తవ మునక ప్రాంతాలు ఇంతకు రెండు, మూడు రెట్లు ఉన్నాయని వివరించారు. ఇప్పటికే ఏజెన్సీ గిరిజన ప్రజలు దుర్భర జీవితం గడుపుతున్నారని, వరదల్లో మునిగినా నష్టపరిహారం చెల్లించలేదని పేర్కొన్నారు. అభివృద్ధి కార్యక్రమాలు లేవని, మునిగిన ఇళ్లకు, రోడ్లకు రిపేర్లు లేవని, ఈ స్థితిలో ముఖ్యమంత్రి ఎన్నికల వాగ్దానం ప్రకారం ఎకరాకు రూ.10 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని, తిరిగి సర్వే చేసి కాంటూరు హద్దులను నిర్ణయించి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు. పోలవరం డ్యామ్ మిగతా 2లో

నాసిరకంగా

కోవిడ్ పరీక్షలు

- కేంద్ర ఆరోగ్యశాఖ అసంతృప్తి

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో కోవిడ్ నిర్ధారణ పరీక్షలు నాసిరకంగా సాగుతున్నాయని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ శనివారం నాడు ఆందోళన వ్యక్తం చేసింది. దేశంలో కోవిడ్ కేసులు క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో కేంద్ర ఆరోగ్య శాఖ రాష్ట్రాలకు, కేంద్ర పాలిత ప్రాంతాలకు పలు సూచనలతో ఒక అడ్వయిజరీ పత్రాన్ని జారీ చేసింది. కోవిడ్ పరీక్షల స్థాయి ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఓ) ప్రమాణాలతో పోలిస్తే తగినంతగా లేదని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ హెచ్చరించింది. 10 లక్షల జనాభా వున్న చోట రోజుకు 140 పరీక్షలు జరగాలని డబ్ల్యుహెచ్ఓ ప్రామాణికంగా నిర్దేశించింది. దానితో పోలిస్తే ప్రస్తుత పరీక్షల స్థాయి తగిన రీతిలో లేదని అభిప్రాయపడింది. జిల్లా, బ్లాక్‌ల స్థాయిల్లో జరిగే పరీక్షలు కూడామారుతున్నాయని ఆరోగ్య శాఖ పేర్కొంది. రాపిడ్ యాంటిజెన్ పరీక్షలపై కొన్ని రాష్ట్రాలు మరీ ఎక్కువగా ఆధారపడుతున్నాయని తెలిపింది. కొత్తగా తలెత్తే హాట్‌స్పాట్‌లను గుర్తించడానికి, వైరస్ వ్యాప్తి చెందకుండా నివారించేలా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడానికి గరిష్ట స్థాయిలో కోవిడ్ పరీక్షలు చేయడం కీలకమని అడ్వైజరీ పత్రంలో పేర్కొంది. కోవిడ్ కేసులు పెరుగుతున్న దరిమిలా అందుకు తగినవిధంగా బెడ్‌లు, ఐసియు బెడ్‌లు, వైద్య పరికరాలు, మెడికల్ ఆక్సిజన్, వాక్సినేషన్ కవరేజీ వంటి అంశాల్లో ఆస్పత్రుల సన్నద్ధతను సమీక్షించాల్సిందిగా రాష్ట్రాలను కేంద్రం ఆదేశించింది. ప్రాథమిక కోవిడ్ వ్యాక్సినేషన్‌ను విస్తృతంగా వేసిన తర్వాత ముందస్తు డోస్‌ను 27 శాతం మంది వేసుకున్నారు. ఏప్రిల్ 10, 11 తేదీల్లో దేశవ్యాప్తంగా మాక్ డ్రిల్‌ను నిర్వహించ తలపెట్టారు. ఈ డ్రిల్‌లో అన్ని జిల్లాల నుండి (ప్రభుత్వ, ప్రైవేటు) ఆరోగ్య బృందాలు పాల్గొంటాయని భావిస్తున్నారు.

1500పైగా రోజువారీ కేసులు

దేశవ్యాప్తంగా గడచిన ఒక్కరోజులోనే 1,590 కొత్త కరోనా కేసులు నమోదయ్యాయని, గడచిన 146 రోజుల్లో ఇవే అత్యధికంగా నమోదైన కేసులని కేంద్ర ఆరోగ్యమంత్రిత్వ శాఖ శనివారం వెల్లడించింది. యాక్టివ్ కేసుల సంఖ్య 8,601కు చేరిందని పేర్కొంది. మహారాష్ట్రలో ముగ్గురు, కర్ణాటక, రాజస్థాన్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో ఒక్కొరు చొప్పున మృతి చెందినట్లు తెలిపింది. దీంతో కరోనా ప్రారంభం నుంచి వైరస్‌తో మృతి చెందిన వారి సంఖ్య 5,30,824కు చేరింది. పాజిటివిటి రేటు 1.33 శాతంగా ఉంది. రోజువారీ రికవరీ రేటు 98.79 శాతంగా ఉంది.

ఎస్‌సి సబ్‌ప్లాన్ అమల్లో ఉదాసీనత

- పిఎం ఎజెఎవైకి రెండేళ్లుగా కేంద్రం నిధులు నిలిపివేత
- 2021 నాటి సబ్సిడీ నిధులు ఇప్పుడు కేటాయింపు
- రుణాలు ఇవ్వకుండా సబ్సిడీ ఇస్తామంటున్న వైనం

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

ఎస్‌సిలను ఉద్ధరించడానికే అన్నట్లు పథకాలను ప్రకటిస్తున్న కేంద్ర ప్రభుత్వం వాటికి నిధులు విడుదల చేయడంలో ఉదాసీనంగా వ్యవహరిస్తోంది. ఇందుకు ప్రధాన మంత్రి అనుసూచిత్ జాతి అభ్యుదయ్ యోజన పథకమే ఉదాహరణ. ఈ పథకానికి రెండేళ్లుగా నిధులు నిలిపేసింది. 2021లో నిధులు విడుదల చేసినా వెచ్చించలేదు. ఇప్పుడు ఆ డబ్బులను సబ్సిడీ కింద విడుదల చేసేందుకు లబ్ధిదారుల వివరాలు సేకరించాలంటూ ఎస్‌సి కార్పొరేషన్ అధికారులకు లేఖలు పంపింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో రుణాలు పొందిన వారే అర్హులంటూ నిబంధన విధించింది. బోరు బావులు, డ్రిప్ ఇరిగేషన్, స్ప్రింకర్ల కోసం రుణం తీసుకుని ఉండాలని పేర్కొంది. ట్రాక్టర్, ట్రాలీ, కమర్షియల్ వాహనాలు, తదితర అంశాలకు రుణాలు పొంది స్వయం ఉపాధి పొందుతున్న వారూ అర్హులని తెలిపింది. అటువంటి వారు ఎవరుంటారనే అధికారులు జల్లెడ పడుతున్నారు. డిఆర్‌డిఎ, మెప్మా, వ్యవసాయ శాఖ, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ తదితర ప్రభుత్వ ఏజెన్సీల ద్వారా రుణం పొందిన ఎస్‌సి లబ్ధిదారుల వివరాలను సేకరించే పనిలో అధికారులు ఉన్నారు. ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా రుణాలు పొంది ఉంటే తమ దగ్గర వివరాలు ఉంటాయని, వేరే ప్రభుత్వ ఏజెన్సీల ద్వారా రుణాలు పొందిన వారి వివరాలు తమ వద్ద ఎలా ఉంటాయని వారు తలలు పట్టుకుంటున్నారు. గత ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయ పనిముట్లు, వాహనాలపై రుణాలు ఎవరు పొందారో వివరాలు ఇవ్వాలని ఎస్‌సి కార్పొరేషన్ అధికారులు బ్యాంకర్లకు లేఖలు రాస్తున్నారు. దీనిపై ఇప్పటివరకు ఒక్కరి వివరాలు కూడా రాలేదు

దళితుల్లో పేదరికం తగ్గించడం, ఆర్థికంగా, సామాజికంగా వారు అభివృద్ధి చెందేలా చేయడం, ఆదాయమిచ్చే కార్యక్రమాలు అమలు పరచడం వంటి లక్ష్యాలతో కేంద్ర ప్రభుత్వం 2018-19 ఆర్థిక సంవత్సరంలో పిఎం ఎజెఎవై పథకాన్ని ప్రారంభించింది. అంతకుముందు అమల్లో ఉన్న స్పెషల్ సెంట్రల్ అసిస్టెన్స్ టు షెడ్యూల్ క్యాస్ట్స్ సబ్‌ప్లాన్, ప్రధాన మంత్రి ఆదర్శ్ గ్రామ్ యోజన, బాబూ జగ్జీవన్‌రామ్ ఛత్రవాస్ యోజన పథకాలన్నింటినీ కలిపి పిఎం ఎజెఎవైగా మార్చింది. ఈ పథకానికి 2018 నుంచి 2021 వరకు నిధులు విడుదల చేసిన కేంద్ర ప్రభుత్వం ఆ తర్వాత రెండేళ్లుగా ఇవ్వడం లేదు. 2021లో రాష్ట్రానికి రూ.29.80 కోట్లను కేటాయించినా వాటిని విడుదల చేయలేదు. ప్రస్తుతం అందులో వివిధ రకాల ఖర్చులుపోను రూ.29.07 కోట్లు మిగిలాయి. ఆ డబ్బులనే సబ్సిడీగా ఇవ్వాలని ఇప్పుడు చూస్తోంది. వ్యవసాయ పరికరాలు లేదా స్వయం ఉపాధి పథకాలకు అయ్యే మొత్తం ఖర్చులో 50 శాతం సబ్సిడీ లేదా రూ.50 వేలకు మించకుండా వారి ఖాతాల్లో డబ్బులు వేస్తామని చెప్తోంది

రుణాలు ఇవ్వకుండా సబ్సిడీ!

కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో ఎస్‌సి కార్పొరేషన్ అధికారులు దళితులకు ప్రభుత్వ ఏజెన్సీలు ఏయే అంశాలకు రుణం ఇచ్చాయో, ఎవరికిచ్చారో అనే వివరాల సేకరణలో అధికారులు ఉన్నారు. అటువంటి వారి వివరాలు దొరకడం కష్టమని అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఎస్‌సి కార్పొరేషన్ హామీ ఉన్నా ఎస్‌సిలకు రుణం దొరకని పరిస్థితి ఉంది. వారికి సొంత పూచీకత్తుపై ఎవరు రుణమిస్తారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కనీసం ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా రుణాలు అందించినా వారికి మేలు జరిగేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతం ఇవ్వచూపిన సబ్సిడీ నిధులు ఎందుకూ కొరగాకుండా పోతాయనే చర్చ సాగుతోంది.

అమెరికాలో టోర్నడోల బీభత్సం

- మిస్సిసిపి, అలబామాల్లో 23 మంది మృతి

• లోపలి పేజీలో.. •

జల వనరుల వినియోగంపై కొత్త కార్యాచరణ అవశ్యం

- మానవాళికి యుఎన్ చీఫ్ పిలుపు

• లోపలి పేజీలో.. •

తిరుమలలో గంజాయిపై చంద్రబాబు దిగ్భ్రాంతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

'తిరుమలలో గంజాయి' అంటూ మీడియాలో కథనాలు రావడం తనను దిగ్భ్రాంతికి గురిచేసిందని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. రాష్ట్రంలో గంజాయి బూతం రోజురోజుకూ విస్తరిస్తోందని అనడానికి ఇదో సాక్ష్యమని గంజాయితో పట్టుకున్న వ్యక్తి వీడియోను శనివారం ట్విట్టర్‌లో పొందుపరిచారు. తిరుమలలో ఇలాంటి పరిస్థితి అత్యంత ఆవేదన కలిగిస్తుందని పేర్కొన్నారు. పర్యాటకుల మనోభావాల విషయంలో ప్రభుత్వం బాధ్యతగా స్పందించాలన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

నేడు కాంగ్రెస్ సత్యాగ్రహం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎఐసిసి మాజీ అధ్యక్షులు రాహుల్ గాంధీపై అనర్హత వేటు వేయడమంటే ప్రతిపక్షాల గొంతు నొక్కడమేనని పిసిసి రాష్ట్ర అధ్యక్షులు గిడుగు రుద్రరాజు పేర్కొన్నారు. మోడీ ప్రభుత్వం అనర్హత వేటు వేయడాన్ని నిరసిస్తూ ఈ నెల 26న విజయవాడలోని మహాత్మాగాంధీ విగ్రహం వద్ద సత్యాగ్రహం చేయనున్నట్లు వెల్లడించారు. విజయవాడ ఆంధ్రరత్న భవన్‌లో శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. కేంద్ర బిజెపి హయాంలో కక్ష సాధింపులు, నిరంకుశత్వాలు, అరాచకాలు తప్ప ప్రజాస్వామ్య రాజకీయాలు కనిపించడం లేదన్నారు.రాహుల్ గాంధీ పార్లమెంటు సభ్యత్వాన్ని రద్దు చేయడం వెనుక బిజెపి, ప్రధాని మోడీ కుట్రపూరిత రాజకీయాలు ఉన్నాయన్నారు. అనంతరం రాజీవ్ గాంధీ ఫొటో ఉన్న సత్యమేవ జయతే అనే పోస్టరును ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు సుంకర పద్మశ్రీ, నగర అధ్యక్షులు నరహరశెట్టి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

క్షయ నివారణలో రాష్ట్రానికి 8 జాతీయ అవార్డులు

- ఏలూరు జిల్లాకు స్వర్ణం
- విశాఖ, కోనసీమకు రజతం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

క్షయ వ్యాధి నివారణకు సంబంధించి 8 జాతీయ స్థాయి అవార్డులను సొంతం చేసుకుని ఎపి వైద్యారోగ్యశాఖ మరోసారి తన సత్తాను చాటుకుంది. ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా వారణాసిలో జరిగిన ప్రపంచ క్షయ నివారణ దినోత్సవంలో ఈ అవార్డులను అందజేసినట్లు రాష్ట్ర వైద్యారోగ్యశాఖ పేర్కొంది. ఈ మేరకు ఆ శాఖ శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. దేశ వ్యాప్తంగా 337 జిల్లాల్లో అమలు చేసిన ఈ కార్యక్రమంలో 18 జిల్లాలు స్వర్ణ పతకాలను, 28 జిల్లాలు రజత పతకాలను, 65 జిల్లాలు కాంస్య పతకాలను సొంతం చేసుకున్నాయని తెలిపారు. మన రాష్ట్రం నుంచి ఏలూరు జిల్లా స్వర్ణ పతకం దక్కించుకోగా, విశాఖ, కోనసీమ జిల్లాలు రజత పతకాలను, శ్రీకాకుళం, అనకాపల్లి, కాకినాడ, పశ్చిమగోదావరి, గుంటూరు జిల్లాలు కాంస్య పతకాలను సాధించాయన్నారు. 2015-23 మధ్య కాలంలో క్షయ వ్యాధి నివారణకు ఆయా జిల్లాల అధికార యంత్రాంగం చేసిన పనితీరుకు గుర్తింపుగా ఈ అవార్డులు అందజేశారు.

అచ్చెన్న మృతికి కారకులపై చర్యలు తీసుకోండి

- ఎస్‌సి కమిషన్, డిజిపికి వర్ల లేఖ

ప్రజాశకి-అమరావతి బ్యూరో

దళిత ఉద్యోగి డాక్టర్ అచ్చెన్న మరణానికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య కోరారు. ఈ మేరకు జాతీయ ఎస్‌సి కమిషన్, డిజిపికి శనివారం లేఖ రాశారు. అచ్చెన్న పనిచేస్తున్న కార్యాలయంలోని సహ ఉద్యోగులు హింసించారని తెలిసిందని తెలిపారు. ఇదే అంశంపై జిల్లా కలెక్టరుకు సైతం అచ్చెన్న ఫిర్యాదు చేశారని వివరించారు. ఈ అంశంపై నిష్పక్షపాత విచారణ చేయించాలని కోరారు. సిఎం సొంత జిల్లాలో మరో దళిత వైద్యుడు హత్యకు గురికావడం దారుణమని టిడిపి ఎస్‌సి సెల్ అధ్యక్షులు ఎంఎస్ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. వైసిపి ప్రభుత్వంలో దళితులపై దాడులు పెరిగాయని విమర్శించారు.

పెరుగుతోన్న నిరుద్యోగం

- తగ్గించేందుకు ప్రయత్నించని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు
- పోరాటాలతోనే సమాధానం చెప్పాలి
- డివైఎఫ్ఐ జాతీయ అధ్యక్షులు రహీం

సదస్సులో మాట్లాడుతున్న రహీం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

దేశంలో ఎన్నడూ లేనంతగా నరేంద్ర మోడీ పాలనలో నిరుద్యోగం పెరిగిందని డివైఎఫ్ఐ జాతీయ అధ్యక్షులు, సిపిఎం రాజ్యసభ సభ్యులు ఎఎ రహీం ఆందోళన వ్యక్తం చేశారు. ఎనిమిదేళ్లలో నిరుద్యోగం 14 శాతానికి పెరిగిందని తెలిపారు. డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యాన 'పెరుగుతున్న నిరుద్యోగం-పరిష్కార మార్గాలు' అనే అంశంపై విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో శనివారం సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రహీం హాజరై మాట్లాడారు. ప్రతిఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తానని నరేంద్ర మోడీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని అమలు చేయడం లేదని విమర్శించారు. కరోనా సమయంలో దాదాపు 14 కోట్ల మంది ఉద్యోగాలు పోవడంతో నిరుద్యోగులుగా మారారని తెలిపారు. ఇదే సమయంలో నిరుద్యోగం భారీస్థాయిలో పెరిగిందన్నారు. మోడీ హయాంలో సుమారు 25 వేలమంది నిరుద్యోగులు ఆత్మహత్యకు పాల్పడ్డారని పార్లమెంటు నివేదికలు చెబుతున్నాయని చెప్పారు. దేశంలో నిరుద్యోగ భూతం విజృంభిస్తున్నా.. బిజెపి ప్రభుత్వం గానీ, ఎపి ప్రభుత్వం గానీ తగ్గించే ప్రయత్నాలు చేపట్టడం లేదని విమర్శించారు. కార్పొరేట్ శక్తుల ఆస్తులు పెంచుకునేందుకు, వారి వ్యాపారాల విస్తరణ కోసమే ప్రభుత్వాలు పనిచేస్తున్నాయే తప్ప నిరుద్యోగ సమస్య తీర్చేందుకు చర్యలు తీసుకోవడం లేదన్నారు. దేశంలో ప్రైవేటీకరణ పెరుగుతున్నంతకాలం నిరుద్యోగ సమస్య తీరదన్నారు. ప్రైవేటీకరించిన ప్రభుత్వ రంగ సంస్థలను ప్రభుత్వం తన ఆధీనంలోకి తీసుకోవాలని, కొత్తగా సంస్థలను నెలకొల్పాలని డిమాండ్ చేశారు. పట్టణ ప్రాంతాల్లో కూడా ఉపాధి హామీ పథకాన్ని దేశవ్యాప్తంగా తీసుకురావాలని, గ్రామీణ ప్రాంతాల్లో ఈ పథకాన్ని మరింత పటిష్ట పరచాలని డివైఎఫ్ఐ పోరాటం చేస్తోందన్నారు. నిరుద్యోగ సమస్య పరిష్కారం కోసం యువత పోరాటం చేయాలని, అప్పుడే భవిష్యత్తు ఉంటుందన్నారు. కుల, మతం, ప్రాంతాలకు అతీతంగా ఈ పోరాటాలు ఉండాలని చెప్పారు. డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి రామన్న మాట్లాడుతూ.. ప్రతియేటా జాబ్ కేలండరు విడుదల చేస్తానని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నిరుద్యోగులకు హామీనిచ్చి మోసం చేశారని విమర్శించారు. ప్రతియేటా మెగా డిఎస్‌సి అని హామీ ఇచ్చి ఇప్పుడు దాని ఊసే ఎత్తడం లేదన్నారు. ఉపాధ్యాయ ఖాళీ పోస్టులపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. నామమాత్రంగానే ఎస్ఐ, కానిస్టేబుల్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేశారని తెలిపారు. నిరుద్యోగుల కోసం జాబ్ కేలండరు విడుదల చేయాలని, లక్షలాది ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే నిరుద్యోగులంతా ఐక్యంగా పోరాడేందుకు సిద్ధమని హెచ్చరించారు. డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు వై రాము అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్ నాగేశ్వరరావు, జయచంద్ర, యు రాజు, సహాయ కార్యదర్శులు నాగేష్, శివకుమార్, సూర్యకిరణ్, రాష్ట్ర కమిటీ సభ్యులు పి కృష్ణ, కృష్ణకాంత్ తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు ఛానల్‌కు నిధులివ్వాల్సిందే

- పెదనందిపాడులో సామూహిక నిరాహార దీక్ష

ప్రజాశక్తి - పెదనందిపాడు (గుంటూరు జిల్లా)

గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకు పొడిగించడానికి నిధులు కేటాయించాలని కోరుతూ నల్లమడ రైతు సంఘం ఆధ్వర్యంలో శనివారం సామూహిక నిరాహార దీక్ష చేపట్టారు. గుంటూరు జిల్లా పెదనందిపాడు పాత బస్టాండ్ సెంటర్‌లో చేపట్టిన దీక్షను సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు వడ్డే శోభనాద్రీశ్వరరావు ప్రారంభించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ రైతాంగ వ్యతిరేక విధానాల వల్ల రైతుల జీవన ప్రమాణాలు పడిపోతున్నాయని, తలసరి ఆదాయం అంతకంతకు తగ్గిపోతోందని తెలిపారు. రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, స్వామినాథన్ కమిషన్ సిఫారసులు అమలు చేయాలని, సంక్షోభంలో ఉన్న రైతులకు రుణమాఫీ అమలు చేయాలని కోరారు. కేరళ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోన్న రైతు సంక్షేమ విధానాలను అన్ని రాష్ట్రాల్లోనూ అమలు చేయాలని కోరారు. గుంటూరు ఛానల్ పొడిగింపునకు భూసేకరణ నిమిత్తం నిధులను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నల్లమడ రైతు సంఘం అధ్యక్షులు డాక్టర్ కొల్లా రాజమోహన్‌రావు మాట్లాడుతూ గుంటూరు ఛానల్ పొడిగింపు కోసం నల్లమడ రైతు సంఘం సుదీర్ఘకాలంగా చేసిన అనేక పోరాటాల ఫలితంగానే భూ సేకరణకు ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చిందని తెలిపారు. కానీ ఇంతవరకు భూసేకరణ నిమిత్తం నిధులు విడుదల చేయలేదన్నారు. గుంటూరు ఛానల్‌ను పొడిగించడం ద్వారా 50 వేల ఎకరాలకు సాగు, 50 గ్రామాలకు తాగు నీరు సమకూరుతుందని తెలిపారు. ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేయకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అనంతరం దీక్షల్లో పాల్గొన్న వారికి మహిళా నాయకురాలు ఈదర భ్రమరాంబ నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. అనంతరం దీక్షా శిబిరం నుండి తహాశీల్దార్ కార్యాలయం వరకు ప్రదర్శనగా వెళ్లి తహాశీల్దార్ షేక్ మహబూబ్ సుబానికు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం, జనసేన, రాజధాని దళిత బహుజన జెఎసి నాయకులు పాల్గొన్నారు.

దళిత ఉద్యోగి అచ్చెన్న మరణంపై 'సిట్' వేయాలి

- కెవిపిఎస్ డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కడప జిల్లా పశుసంవర్ధకశాఖ సంచాలకులు, దళిత ఉద్యోగి డాక్టర్ అచ్చెన్నను అధికారులే హత్య చేసి ఉంటారనే అనుమానాలు ఉన్నాయని, సిట్‌తో నిష్పాక్షక విచారణ చేయించి ఇందుకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఓ నల్లప్ప, అండ్ర మాల్యాద్రి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. వైసిపి ప్రభుత్వం ఏర్పడ్డాక దళితులపై దాడులు పెరిగిపోయాయని తెలిపారు. వైసిపి ఎమ్మెల్సీ అనంతబాబు, తన డ్రైవరైన దళితుడు సుబ్రమణ్యాన్ని హత్య చేయడం, తొండంగి దళిత యువకుడు రాము హత్య, కడప పశు సంవర్ధకశాఖలో వెటర్నరీ డాక్టరుగా పనిచేస్తున్న అచ్చెన్న మరణించడం బాధాకరమన్నారు. అన్నమయ్య జిల్లా రామాపురం మండలంలోని 40వ జాతీయ రహదారిపై అచ్చెన్న భౌతికకాయం కుళ్లిన స్థితిలో పడి ఉండటం దయనీయమని, ఆయన పనిచేస్తున్న ఆఫీసులోని కొందరి సహ ఉద్యోగులపై అనుమానాలు ఉన్నాయని మాల్యాద్రి తెలిపారు.

చల్లపల్లి జమిందారీ వ్యతిరేక చారిత్రక పోరాటంలో

గుంటూరు బాపనయ్యది కీలకపాత్ర

- కార్పొరేట్లకు పేదల భూములు
- సంపదేమో పేదలది.. ఆదాయమేమో అదానీకి
- కౌలురైతుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వి శ్రీనివాసరావు

సెమినార్‌లో మాట్లాడుతున్న వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వ్యవసాయ కార్మిక ఉద్యమాలు, సామాజిక ఉద్యమాలు అని అంటేనే గుంటూరు బాపనయ్య పేరును స్మరించకుండా ఉండలేమని, చల్లపల్లి జమిందారీ పోరాటంలో చండ్ర రాజేశ్వరావు ప్రత్యక్ష పోరాటంలో నడిచిన చారిత్రక ఉద్యమంలో గుంటూరు బాపనయ్య, చల్లపల్లి నారాయణరావు కీలకమని కౌలు రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వి శ్రీనివాసరావు కొనియాడారు. విజయవాడ బందరు రోడ్డులోని బాలోత్సవ భవన్‌లో ఎపి వ్యవసాయకార్మిక సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యాన గుంటూరు బాపనయ్య 45వ వర్ధంతి సభ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సందర్భంగా ' వ్యవసాయ కార్మికులు - సామాజిక న్యాయం' అంశంపై నిర్వహించిన సభకు వి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాపనయ్య ప్రజా ప్రతినిధిగా, ఆదర్శవంతమైన నాయకునిగా ఉంటూ నిత్యం వ్యవసాయ కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాడటంతోపాటు ప్రజలతో నిత్యం మమేకమై ఉండేవారన్నారు. వ్యవసాయ కార్మికుల విముక్తి, కార్మికులు వేతన బానిసలుగా ఉండకూడదని, స్వేచ్ఛాయుతంగా ఉండాలనే దాని కోసం బాపనయ్య పోరాటం చేశారన్నారు. అలకూరపాడులో 1934లో పుచ్చలపల్లి సుందరయ్య నాయకత్వంలో వ్యవసాయ కార్మిక సంఘం రిజిస్టర్ చేశారన్నారు. వర్గపోరాటంతోపాటు సామాజిక ఉద్యమం, సాంస్కృతిక ఉద్యమం, సేవా కార్యక్రమాలు మిళితం చేసి వ్యవసాయ కార్మిక సంఘాన్ని రాష్ట్ర వ్యాప్తంగా బలోపేతం చేశారన్నారు. పేదల భూములు చివరికి అసైన్డ్ భూములను సైతం పరిశ్రమల పేరుతో కార్పొరేట్ల పేరుతో ప్రభుత్వాలు దోచి పెడుతున్నాయన్నారు. సత్యసాయి జిల్లాలో లేపాక్షి హబ్ పేరుతో 8 వేల ఎకరాలు తీసుకున్న సంస్థ 4 వేల ఎకరాలు బ్యాంకుల్లో పెట్టి రుణాలు తీసుకుని, చెల్లించలేమని చేతులెత్తేసిందన్నారు. పైసా పెట్టుబడి లేకుండా పరిశ్రమల పేరుతో ప్రభుత్వం కేటాయించిన భూములను బ్యాంకుల్లో పెట్టి అదానీ రుణాలు తీసుకుని 90 శాతం వ్యాపారాలు చేస్తున్నారని విమర్శించారు. ఆదాయం అదానీకి, సంపదేమో ప్రజలదన్నారు. దళితులకు భూములు లేనిది ఆత్మగౌరవం రాదన్నారు. కులవివక్ష ప్రస్తుతం రూపాలు మార్చుకుందన్నారు.

బోయ, వాల్మీకిలు ఏజెన్సీ ప్రాంతాల్లోని వారు ఇప్పటికే ఎస్‌టిలు కింద ఉన్నారని, మైదాన ప్రాంతాల్లోని వాల్మీకిలకు తేడాలున్నాయని, వీరంతా బిసిలు అని, తమను ఎస్‌టిలుగా చేర్చాలనే డిమాండ్ చేస్తున్నారన్నారు. ఈ అంశంపై ప్రభుత్వం వేసిన కమిషన్ రిపోర్టు రాకుండానే జగన్ ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం పెట్టిందన్నారు. ఇదంతా రాజకీయ జిమ్మిక్కు అని పేర్కొన్నారు. దళిత క్రిస్టియన్లు ఎస్‌సిలుగా గుర్తించాలని డిమాండ్ ఎప్పటి నుంచో ఉందని, ఈ అంశాన్ని బిజెపి వ్యతిరేకిస్తోందని, ఈ నేపథ్యంలో ఎలాగూ కేంద్రం ఆమోదించదని తెలిసే ఈ తీర్మానాన్ని కేంద్రానికి పంపారన్నారు.

దడాల సుబ్బారావు మాట్లాడుతూ.. గుంటూరు బాపనయ్య స్ఫూర్తితో గ్రామీణ ప్రాంతాల్లో శ్రామిక వర్గాన్ని బలోపేతం చేయాలన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మనువాద భావజాలాన్ని ప్రజలపై బలవంతంగా రుద్దేందుకు ప్రయత్నిస్తోందన్నారు. బాపనయ్య ఆశయాలను సాధించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు, ఎంబివికె కోశాధికారి మురళీకృష్ణ, శ్రామిక మహిళా రాష్ట్ర కన్వీనరు కె ధనలక్ష్మి, కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాల్యాద్రి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి, శివనాగరాణి పాల్గొన్నారు. సభ ప్రారంభంలో అతిథులను వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కళ్యాణ్ వేదికపైకి ఆహ్వానించారు.

నీట్ 17 ఏళ్ల రూల్‌లో జోక్యం చేసుకోలేం

- మైనర్ బాలిక తండ్రి పిటిషన్ కొట్టివేసిన హైకోర్టు



ప్రజాశక్తి - అమరావతి

జాతీయ అర్హత ప్రవేశ (నీట్) పరీక్ష రాసే వారి కనీస వయసు 17 ఏళ్ల నిర్ణయంలో తాము జోక్యం చేసుకోలేమని హైకోర్టు స్పష్టం చేసింది. పరీక్షకు హాజరు కావాలంటే కనీస వయో పరిమితి 17 ఏళ్ల నిర్ణయించడాన్ని సవాల్ చేస్తూ మైనర్ అభ్యర్థిని తండ్రి దాఖలు చేసిన పిటిషన్‌ను డిస్మిస్ చేసింది. ఆ నిబంధన సమానత్వపు హక్కును హరించినట్లు కాబోదని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్ రావుతో కూడిన ధర్మాసనం తీర్పు చెప్పింది.

నీట్ పరీక్షకు హాజరయ్యే వారి వయసు డిసెంబరు 31 నాటికి 17 ఏళ్లు ఉండాలన్న నిబంధనను కొట్టేయాలని కోరుతూ కడప జిల్లాకు చెందిన ఓ మైనర్ విద్యార్థిని తండ్రి నాగ మునుస్వామి హైకోర్టును ఆశ్రయించారు. సమానత్వ, వ్యక్తిగత స్వేచ్ఛను హరించేలా రాజ్యాంగ స్ఫూర్తిని నీరుగార్చే విధంగా ఆ నిబంధన ఉందని పిటిషనర్ న్యాయవాది చేసిన వాదనను హైకోర్టు తోసిపుచ్చింది. ఒక్కరోజు విషయంలో కూడా తమ జోక్యం చేసుకోలేమని తీర్పు చెప్పింది. ఆ నిబంధన హక్కులను హరించినట్లు కాదని స్పష్టం చేసింది. ఇదే అంశంపై గతంలో ఉమ్మడి హైకోర్టు తీర్పు ఇచ్చిందని, దానికి విరుద్ధంగా తాము స్పందించలేమంది.

జగన్‌పై ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలి

- మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎమ్మెల్యేలు ఎవరికి ఓటేశారో కనిపెట్టడానికి కోడింగ్ అమలు చేశామన్న వైసిపి ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి వ్యాఖ్యల్ని సుమోటాగా స్వీకరించి వైసిపి, ఆ పార్టీ అధ్యక్షులు జగన్‌పై కేంద్ర ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు నక్కా ఆనంద్‌బాబు డిమాండ్ చేశారు. టిడిపి కార్యాలయం ఎన్‌టిఆర్ భవన్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తమ పార్టీ అధ్యక్షులు వైసిపి ఎమ్మెల్యేలను రూ.15 కోట్లకు కొన్నారని సిగ్గులేకుండా మాట్లాడారని విమర్శించారు. ఎమ్మెల్యేలను కొనడానికి టిడిపి వద్ద జగన్‌కు ఉన్నట్లు రూ.వేలకోట్ల అవినీతి సొమ్ము లేదన్నారు. నలుగురు టిడిపి ఎమ్మెల్యేలను జగన్ ఎన్ని రూ.కోట్లకు కొన్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో టిడిపి బలమెంతో, వైసిపి బలమెంతో సజ్జలకు తెలియదా? అని ప్రశ్నించారు. టిడిపి బలం 23 అని అసెంబ్లీలో స్పీకరు ఎందుకు చెప్పారో చెప్పాలని ప్రశ్నించారు. గ్రాడ్యుయేట్, ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో చావుదెబ్బ తగలబట్టే జగన్‌కు దళిత క్రైస్తవులు గుర్తొచ్చారని అన్నారు. దళిత క్రైస్తవులను ఎస్‌సిల్లోకి చేర్చాలని అసెంబ్లీలో పెట్టిన బిల్లు చెత్తబుట్ట బిల్లు అని పేర్కొన్నారు. రాష్ట్రమంతా వాల్మీకులు, బోయలుంటే కేవలం నాలుగు జిల్లాల్లోని వారినే ఎస్‌టిల్లో చేరుస్తూ తీర్మానం చేయడం ఏమిటని టిడిపి ఎమ్మెల్సీ బిటి నాయుడు ప్రశ్నించారు. వాల్మీకులు, బోయలకు జగన్ చాలా అన్యాయం చేస్తున్నారని పేర్కొన్నారు. దీనికి వ్యతిరేకంగా జగన్ ఇంటిని ముట్టడించాలని, రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు, ధర్నాలు చేయాలని పిలుపునిచ్చారు.

సమిష్టి కృషితో ఉక్కును కాపాడుకుందాం

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

సమిష్టి కృషితో వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుందామని స్టీల్ సిఐటియు గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్ తెలిపారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శనివారానికి 771వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో స్టీల్ ఎస్ఎంఎస్ - 2 విభాగానికి చెందిన ఉద్యోగులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌పై పన్నుతున్న కుట్రలను తిప్పికొట్టేందుకు ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ శత విధాలా ప్రయత్నిస్తోందన్నారు.

విశాఖ ఉక్కును రక్షించుకునే క్రమంలో ఎంతటి త్యాగాలకైనా సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కార్మికుల సమిష్టి కృషితోనే ప్లాంట్ ప్రగతి పథంలో నడిచిందన్నారు. ప్రజలు, ప్రజా సంఘాల నేతలు, ఉక్కు నిర్వాసితులు, ఉద్యోగులు, వారి కుటుంబాలు ఐక్యంగా నిలబడి విశాఖ ఉక్కును రక్షించుకోవడానికి మరింత కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నేతలు ఉరిటి మరిడయ్య, విళ్లా రామ్మోహన్ కుమార్, వరసాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తప్పుడు కేసులు ఎత్తేయాలి

- ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని, సిఎం హామీలు అమలు చేయాలని శాంతియుతంగా ధర్నాకు వెళుతున్న వారిని అరెస్టు చేసి, వారిపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) కోరింది. ఈ మేరకు యూనియన్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బేబీరాణి, కె సుబ్బరావమ్మ శనివారం ప్రకటన విడుదల చేశారు. అంగన్‌వాడీల వేతనం పెంచుతామని ఎన్నికల ముందు సిఎం హామీ ఇచ్చారని, దాన్ని అమలు చేయాలని కోరినట్లు తెలిపారు. దీనిపై ఈ నెల 20న విజయవాడలో శాంతియుతంగా ధర్నా చేయాలనుకున్నామని, వెళుతున్న వారిని పోలీసులు ఎక్కడికక్కడ అరెస్టు చేసి కేసులు నమోదు చేశారని పేర్కొన్నారు. మార్చి 7న పోలీస్ అనుమతి కోసం దరఖాస్తు చేశామని, అనేకసార్లు అధికారుల చుట్టూ తిరిగామని పేర్కొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని, తీవ్ర నిర్బంధం ప్రయోగిస్తోందని తెలిపారు. మహిళలను బస్సులు, రైళ్లలోంచి దింపేశారని పేర్కొన్నారు. వేలమందిని స్టేషన్లలో నిర్బంధించారని తెలిపారు. మద్దతుగా నిలిచిన సిపిఎం, సిఐటియు రాష్ట్ర నాయకత్వంపై తప్పుడు కేసులు బనాయించడం దుర్మార్గమని పేర్కొన్నారు. వెంటనే కేసులు ఎత్తివేయడంతోపాటు అంగన్‌వాడీలకు న్యాయం చేయాలని వారు కోరారు.

ఎస్‌సి గురుకులాల్లో ప్రవేశాలకు గడువు పొడిగింపు

- మంత్రి మేరుగ నాగార్జున

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 2023-24 విద్యా సంవత్సరానికి 5వ తరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ప్రవేశానికి సంబంధించిన దరఖాస్తును పొడిగించినట్లు సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగ నాగార్జున వెల్లడించారు. ఈ నెల 31 వరకూ పొడిగించినట్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 189 ఎస్‌సి గురకులాల్లో ప్రవేశాల కోసం గతంలో ఇచ్చిన నోటిఫికేషన్ ఈ నెల 24తో ముగిసిందని, గడువు పొడిగించడంతో ఆన్‌లైన్ ద్వారా అభ్యర్థులు ప్రవేశాలకు దరఖాస్తులు సమర్పించాలని వెల్లడించారు. ప్రస్తుతం 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు 5వ తరగతిలోకి, 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలోకి ప్రవేశాలకు అర్హులని తెలిపారు. 5వ తరగతిలో ప్రవేశం కోరే విద్యార్థులు apgpcet.apcfss.in ద్వారా, ఇంటర్ ప్రవేశానికి apgpcet.apcfss.in/inter ద్వారా దరఖాస్తు చేసుకోవాలని వెల్లడించారు. సీట్ల కేటాయింపులో ఎస్‌సిలకు 75 శాతం, దళిత క్రిస్టియన్లు బిసి-సికి 12 శాతం, ఎస్‌టిలకు 7 శాతం, బిసిలకు 6 శాతం, ఒసిలకు 2 శాతం రిజర్వేషన్ల ప్రకారం కేటాయించినట్లు వివరించారు.

ప్రభుత్వ లెక్కలన్నీ అసత్యాలే

- సంక్షేమంపై పెరగని ఖర్చు
- మండలి ప్రతిపక్షనేత యనమల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వ ఆదాయ, వ్యయాలు, అప్పులు, అభివృద్ధిపై చెబుతున్న లెక్కలన్నీ అసత్యాలు, అర్ధసత్యాలే అని శాసనమండలి ప్రతిపక్షనేత యనమల రామకృష్ణుడు విమర్శించారు. ఈ విషయం కాగ్ నివేదిక ద్వారా స్పష్టమైందని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మూలధన వ్యయం దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో సగటున 14.41 శాతం ఉందని, రాష్ట్రంలో మాత్రం 9.21 శాతానికి పడిపోవడం జగన్ విధ్వంసకర విధానాలకు నిదర్శనమని విమర్శించారు. జిఎస్‌డిపిలో రాష్ట్ర అప్పులు 20 శాతానికి మించకూడదని కేంద్ర ఎఫ్ఆర్‌బిఎం చెబుతుంటే... 40 శాతానికి మించాయని తెలిపారు. ఏ ప్రాతిపదికన రాష్ట్ర ప్రభుత్వం అప్పులు చేస్తోందని ప్రశ్నించారు.

రాష్ట్రానికి ఉన్న పరిమితి ఎంత? నాలుగేళ్లలో చేసిన అప్పులు ఎంత? తీసుకున్న అప్పుల్లో తిరిగి రుణ వాయిదాలకు, వడ్డీలకు చెల్లిస్తున్న మొత్తం ఎంత? వంటి అంశాలపై ప్రభుత్వం వాస్తవాలను దాచిపెడుతోందని విమర్శించారు. రెవెన్యూ లోటు భారీగా పెరిగిందని తెలిపారు. రూ.1,23,948 కోట్లు ఆఫ్ బడ్జెట్ బారోయింగ్స్ ఉండడం క్లాసిక్ డెబ్ ట్రాప్‌కు సంకేతమని అన్నారు. కొత్త అప్పుల్లో 80 శాతం మొత్తాన్ని పాత అప్పులు తీర్చేందుకే ఉపయోగిస్తున్న విషయం కాగ్ లెక్కల ద్వారా స్పష్టమైందని పేర్కొన్నారు. రాష్ట్ర ఆదాయం రూ.1.6 లక్షల కోట్లయితే అప్పులు, వడ్డీలు, జీతాలు, పెన్షన్‌లు కలిపి రూ.97 వేలకోట్లుగా ఉందని తెలిపారు. అప్పు చేసిన దానిలో మూలధన వ్యయం కోసం ఖర్చు చేసింది కేవలం రూ.16 వేల కోట్లు అని విమర్శించారు. మూడేళ్లలో అసెంబ్లీకి చెప్పకుండా, బడ్జెట్ పుస్తకాల్లో చూపకుండా అప్పులు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెవెన్యూ రాబడులు 28.53 శాతం మేర పెరిగాయని, అయినా సంక్షేమంపై ఖర్చు చేసింది అంతంత మాత్రమేనని యనమల తెలిపారు.

పోలవరం కాంటూరు హద్దులు మార్చాలి

(మొదటిపేజీ తరువాయి)

నిర్మాణం త్వరితగతిన పూర్తికావాలన్నా పునరావాసమే ప్రధానమైందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం దానిపై బాధ్యతారాహిత్యంగా, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, కేంద్రంతో పోరాడి నిర్వాసితులకు పునరావాసంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టిపెట్టాలని డిమాండ్ చేశారు. దీనిపై బిజెపి రెండు నాల్కల ధోరణిని ఖండించారు. ఏజెన్సీ మునక ప్రాంత ప్రజల ఆందోళనకు సిపిఎం సంఘీభావం ప్రకటించింది.

బోయ, వాల్మీకి సమస్యపై గిరిజన సంఘాలు, ప్రజా ప్రతినిధుల అభిప్రాయాలు తీసుకోవాలి

బోయ, వాల్మీకి సమస్యపై నియమించిన కమిటీ నివేదిక వెల్లడించకముందే శాసనసభ తీర్మానం చేసి కేంద్రానికి పంపడం వంచన తప్ప మరొకటి కాదని శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఏజెన్సీ ప్రాంత గిరిజనుల్లో దీనిపై తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోందని, జిఓ నెంబరు మూడు ప్రకారం గిరిజన ప్రాంతాల్లో 100 శాతం ఉద్యోగాలు గిరిజనులకే ఇవ్వాలని ఉందని, దాన్ని సుప్రీం కోర్టు రద్దు చేస్తే ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకోకుండా నిర్లక్ష్యం చేసి గిరిజనులకు అన్యాయం చేసిందని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం తన సంకుచిత రాజకీయ ప్రయోజనాల కోసం వివిధ తెగల, ప్రాంతాల మధ్య చిచ్చు రాజేయడం సరైందికాదని సూచించారు. రాజ్యాంగంలో 5వ షెడ్యూల్డ్ స్ఫూర్తికి ఇది విరుద్ధమని పేర్కొన్నారు. తక్షణమే ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన సంఘాలు, ప్రజా ప్రతినిధులు, రాజకీయ పార్టీల అభిప్రాయం తీసుకుని ఈ సమస్యపై ఏకాభిప్రాయం సాధించాలని కోరారు.

అసెంబ్లీ తీర్మానం పట్ల హర్షం

దళిత క్రిస్టియన్లను ఎస్‌సిలుగా గుర్తించాలని కోరుతూ రాష్ట్ర అసెంబ్లీ తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపడం పట్ల సిపిఎం రాష్ట్ర కమిటీ హర్షం వ్యక్తం చేసింది. మతంతో నిమిత్తం లేకుండా దళితులందరినీ ఎస్‌సిలో చేర్చాలని కోరారు. అందుకనుగుణంగా రాజ్యాంగ సవరణ చేయాలని, బిజెపి ఈ డిమాండ్‌ను వ్యతిరేకించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. మత ప్రాతిపదికపై దేశాన్ని చీల్చే ఏ చర్య అయినా దేశాన్ని బలహీనపరుస్తుందని, అన్ని మతాల్లోనూ కులవివక్ష, అంటరానితనం కొనసాగుతున్నదని పేర్కొన్నారు. సహేతుకమైన ఈ డిమాండ్‌ను సాధించడానికి ఢిల్లీకి అఖిలపక్ష ప్రతినిధి వర్గాన్ని తీసుకుపోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సిపిఎం కోరింది.

ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలో నెల్లూరు విద్యార్థిని ప్రతిభ

- రాష్ట్రంలో ప్రథమ స్థానం

ప్రజాశక్తి-నెల్లూరు

కేంద్ర ప్రభుత్వం పాఠశాల స్థాయిలో నిర్వహించే నేషనల్ మీన్స్ కమ్-మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) పరీక్షల్లో నెల్లూరు జిల్లా కెవిఆర్ నగరపాలక ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎస్ చరణి సత్తాచాటారు. ఎన్‌ఎంఎంఎస్ ఫలితాల్లో 155/180 మార్కులతో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించినట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.విజయప్రకాష్ తెలిపారు. భక్తవత్సలనగర్ ప్రాంతంలోని కెవిఆర్ నగర పాలక ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని ఎన్‌ఎంఎంఎస్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించడంతో పాఠశాల అధ్యాపకులు, విద్యార్థులు పెద్దఎత్తున బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. రాష్ట్ర స్థాయిలో అత్యధిక మార్కులు సాధించి జిల్లాకు గుర్తింపు తీసుకొచ్చిన విద్యార్థిని ఎస్.చరిణిని జిల్లా విద్యాశాఖ అధికారిణి ఆర్ఎస్ గంగా భవాని, అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ సిహెచ్ ఉషారాణి అభినందించారు. ఎన్‌ఎంఎంఎస్ పరీక్షల్లో ఎక్కువ మార్కులు సాధించే విధంగా శిక్షణ ఇచ్చి ప్రోత్సహించిన ప్రధానోపాధ్యాయుడు ఎం.విజయప్రకాష్‌ను, అధ్యాపక బృందానికి విద్యార్థిని తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

చింతకాయల విజయ్‌కు సిఐడి నోటీసులు

ప్రజాశక్తి - నర్సీపట్నం టౌన్ (అనకాపల్లి జిల్లా)

కొద్ది రోజుల క్రితం సోషల్ మీడియాలో టిడిపి మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు తనయుడు విజయ్ అభ్యంతరకర పోస్టులు పెట్టారని, ఈ నెల 28న విచారణకు హాజరు కావాలని పేర్కొంటూ సిఐడి అధికారులు శనివారం నోటీసులు జారీ చేశారు. మంగళగిరి నుంచి అధికారులు నేరుగా అయ్యన్నపాత్రుడు ఇంటికి చేరుకోవడంతో నర్సీపట్నంలో అలజడి మొదలైంది. విజయ్ అందుబాటులో లేకపోవడంతో ఆయన తండ్రికి నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా అయ్యన్న విలేకరులతో మాట్లాడుతూ.. వైసిపి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఎన్నో అక్రమ కేసులు పెట్టి తమ కుటుంబాన్ని ఇబ్బందులు పెడుతోందని విమర్శించారు. తాటాకు చప్పుళ్లకు బెదిరేదే లేదని అన్నారు.

15న సామూహిక గృహ ప్రవేశాలు?

- తొలుత ఐదు లక్షల మందితో చేయించాలని నిర్ణయం
- లక్ష్యం పూర్తి కాకపోవడంతో 3.70 లక్షలకు కుదింపు

జి.సిగడాం మండలం దేవరవలసలో నిర్మాణంలో ఉన్న ఇళ్లు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

సామూహిక గృహ ప్రవేశాలకు ప్రభుత్వం తాజాగా మరో తేదీని నిర్ణయించినట్లు తెలిసింది. వచ్చే నెల 15న రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమం నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. ఇందుకు సంబంధించి ఇప్పటికే అధికారులకు మౌఖిక ఆదేశాలు వచ్చాయి. ఆ తేదీ నాటికి ఇళ్లను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించినట్లు తెలుస్తోంది. గతంలో మాదిరిగా ఐదు లక్షల మందితో కాకుండా 3.70 లక్షల మందితోనే కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించినట్లుగా సమాచారం.

నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు (ఎన్‌పిఐ) పథకంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం 16,60,171 ఇళ్లను మంజూరు చేసింది. వీటిని పలు దశల్లో చేపడుతూ 2024 జూన్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. తొలుత ఐదు లక్షల ఇళ్లను పూర్తి చేసి ఈనెల 22న ఉగాది సందర్భంగా అందరితో ఒకేసారి గృహ ప్రవేశాలను చేయించాలని నిర్ణయించింది. ఇందుకోసం జిల్లాల వారీగా లక్ష్యాలనూ నిర్దేశించింది. ఆ రోజుకు ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా చూడాలని కలెక్టర్లను ఆదేశించింది. ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరగనుండటంతో ఈనెల 25వ తేదీ వరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉంది. పైగా అనుకున్న మేర ఇళ్లు కూడా సిద్ధం కాలేదు. దీంతో ప్రభుత్వం సామూహిక గృహ ప్రవేశాల కార్యక్రమాన్ని వాయిదా వేసింది. తాజాగా వచ్చే నెల 15న చేపట్టాలని నిర్ణయించినట్లు సమాచారం. లక్ష్యం పూర్తి కాక పలుమార్లు వాయిదా పడుతుండడంతో కొంతమేర దాన్ని కుదించింది. గతంలో ఐదు లక్షల మందితో చేయించాలని నిర్ణయించిన ప్రభుత్వం ఇప్పుడు 3,70,141 మందితో ప్రవేశాలు చేపట్టేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. ఇప్పటి వరకు 3,20,977 ఇళ్లు (87 శాతం) పూర్తయ్యాయి.

అధికారుల ఉరుకులు పరుగులు

సామూహిక గృహ ప్రవేశాలపై అధికారులకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావడంతో క్షేత్రస్థాయి సిబ్బందితో వీడియో, టెలీకాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తూ లక్ష్యం చేరుకునేలా చూడాలంటూ సూచిస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన లక్ష్యానికి చేరుకోవాలంటే ఇంకా 49,164 ఇళ్లు పూర్తి కావాల్సి ఉంది. ఇప్పటికి ఒకటెండు జిల్లాలు బాగా వెనుకబడ్డాయి. ఎస్‌పిఎస్ నెల్లూరు జిల్లా 70 శాతంతో అట్టడుగున ఉంది. చిత్తూరు జిల్లాలో 73 శాతం ఇళ్లు పూర్తయ్యాయి. అనంతపురం జిల్లాలో 78 శాతం ఇళ్లు నిర్మాణమయ్యాయి. సత్యసాయి, అన్నమయ్య, పల్నాడు జిల్లాలు చెరో 79 శాతం మేర ఇళ్లు పూర్తయ్యాయి.

ఈ సారైనా ప్రవేశాలు జరిగేనా?

సామూహిక గృహ ప్రవేశాల కార్యక్రమం ఇప్పటివరకు ఐదు పర్యాయాలు వాయిదా పడ్డాయి. 2022లో విజయదశమి రోజున నిర్వహిస్తామని ప్రభుత్వం తొలుత ప్రకటించింది. ఆ తర్వాత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పుట్టిన రోజైన డిసెంబర్ 21 చేపడతామని నిర్ణయించింది. గృహ నిర్మాణాల లక్ష్యం కనీసం సగం కూడా పూర్తి కాకపోవడంతో వాయిదా వేసింది. ఈ ఏడాది మార్చి 22న ఉగాది సందర్భంగా అందరితో గృహ ప్రవేశాలు జరుపుతాయమని తెలిపింది. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్, అనుకున్న లక్ష్యం పూర్తి కాకపోవడంతో మళ్లీ వాయిదా వేసింది. తాజాగా వచ్చే నెల 15న నిర్వహిస్తామని ప్రభుత్వం చెప్తోంది.

మహిళా సాధికారతతోనే దేశాభివృద్ధి

- జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

మహిళా సాధికారతతోనే దేశాభివృద్ధి సాధ్యమని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ అధ్యక్షులు ఆకుల వెంకట శేషసాయి పేర్కొన్నారు. అనంతపురం జిల్లా రాయదుర్గం మండలం 74-ఉడేగోళం గ్రామంలో మహిళ సాధికారత సదస్సు శనివారం జరిగింది. ఈ సదస్సును జస్టిస్ డి.రమేష్, జస్టిస్ శ్యాంసుందర్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జస్టిస్ వెంకట శేషసాయి మాట్లాడుతూ.. మెజార్టీ మహిళలకు వారి హక్కుల గురించి తెలియవన్నారు. మహిళలకు ఆస్తి హక్కు, గృహహింస, లైంగిక వేధింపులు వంటి చట్టాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ చట్టాల గురించి పూర్తిగా తెలుసుకోవాలని సూచించారు. సమాజంలో విలువల పతనానికి ప్రేమానురాగాలు కనుమరుగవ్వడం, ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నమవ్వడమే కారణమని పేర్కొన్నారు. రాయదుర్గం ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డి.రమేష్ మాట్లాడుతూ.. బాలలపై అత్యాచార నిరోధక చట్టం వచ్చినప్పటికీ జరిగిన సంఘటనల్లో 20 శాతం కేసులు కూడా నమోదు కావడం లేదన్నారు. 80 శాతం ఘటనలు పోలీసుల దష్టికి రావడం లేదని తెలిపారు. ఎస్‌పి ఫక్కీరప్ప మాట్లాడుతూ జిల్లాలో వేలాది మంది బసివినులు, జోగినులు దిక్కులేని స్థితిలో ఉన్నట్లు వెల్లడైందన్నారు. వారికోసం స్పందన, వైద్య శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. ప్రస్తుతం ఆర్‌డిటి సంస్థ సహకారంతో 39 మంది బసివినులకు రూ.1.17 కోట్లతో పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వనున్నట్లు తెలిపారు.

బసివినుల గృహ నిర్మాణాలకు సంబంధించి రూ.1.17 కోట్ల మెగా చెక్కును అందిస్తున్న జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి

50 మంది అసంతృప్తిలో ఉన్నారు..!

- ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి

ప్రజాశక్తి- నెల్లూరు ప్రతినిధి

వైసిపిలో సుమారు 50 మంది ఎమ్మెల్యేలు అసంతృప్తితో ఉన్నారని, ఎప్పుడైనా వారు బయటకు వచ్చే అవకాశాలున్నాయని ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్ చేశారనే ఆరోపణతో వైసిపి అధిష్టానం ఆయనను పార్టీ నుంచి సస్పెండ్ చేసింది. ఎన్నికలు ముగిసిన తరువాత ఆయన బెంగళూరుకు వెళ్లారు. బెంగళూరులో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వైసిపిని తమ కుటుంబం ఎంతో నమ్మిందని, 18 మంది ఎమ్మెల్యేలు రాజీనామా చేసి, పోటీ చేసి గెలిచిన వారిలో తాను ఒకడినన్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డితో ఎంతో సఖ్యతతో ఉన్నానని, జగన్మోహన్‌రెడ్డి వచ్చిన తరువాత ఆ పార్టీలో పెద్దలంటే గౌరవం, మర్యాద కూడా లేదని తెలిపారు. నమస్కారం పెడితే కనీసం ప్రతి నమస్కారం పెట్టరని, పార్టీలో చాలా మంది అసంతృప్తిలో ఉన్నారని చెప్పారు. విజయవాడలో ఉండే కొందరు వ్యక్తులు అన్ని నియోజకవర్గాల్లో జోక్యం చేసుకొని ఇబ్బందులు పెడుతున్నారని విమర్శించారు. మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డికి వ్యతిరేకంగా నెల్లూరు జిల్లా వింజమూరు, ఉదయగిరి తదితర ప్రాంతాల్లో వైసిపి నాయకులు ఆయన దిష్టిబొమ్మలు దగ్ధం చేశారు.

ప్రతిపక్షాలు లేకుండా చేసే కుట్ర

- ప్రతిపక్షాలన్నీ ఏకతాటిపైకొచ్చి బిజెపిని ఓడించాలి
- మీడియాతో సీతారాం ఏచూరి
- ప్రారంభమైన సిపిఎం పొలిట్‌బ్యూరో భేటీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

2024లోపు ప్రతిపక్షాలు లేకుండా చేసేందుకు బిజెపి కుట్ర పన్నుతోందని, ప్రతిపక్షాలన్నీ ఏకతాటిపైకొచ్చి బిజెపిని ఓడించాలని సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి పిలుపునిచ్చారు. రెండు రోజులపాటు జరిగే సిపిఎం పొలిట్‌బ్యూరో సమావేశం శనివారం నాడు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం (ఎకెజి భవన్)లో ప్రారంభమైంది. ఈ సందర్భంగా సీతారాం ఏచూరి మీడియాతో మాట్లాడుతూ.. దేశంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులు, దర్యాప్తు సంస్థలను ఉపయోగించి ప్రతిపక్ష పార్టీలపై వేటు వేయడంపై సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు. రాజ్యాంగ సంస్థల దుర్వినియోగానికి మోడీ ప్రభుత్వం పాల్పడుతోందని విమర్శించారు. ఓవైపు కేంద్ర ఏజెన్సీలతో, మరోవైపు బిజెపి యేతర రాష్ట్రాలపై గవర్నర్ల ప్రయోగం అన్నారు. దీంతో దేశంలో సమాఖ్య వ్యవస్థ తీవ్ర దాడికి గురవుతుందని పేర్కొన్నారు. త్రిపుర సహా రాష్ట్రాల ఎన్నికల ఫలితాలపై సమీక్ష జరగనుందన్నారు. ప్రతిపక్ష నేతలను లక్ష్యంగా అనర్హత వేటు వేస్తున్నారని, ఇడి, సిబిఐ వేధింపులకు పరాకాష్ట అనర్హత మార్గమని స్పష్టం చేశారు. 2024 ఎన్నికలకు ముందు ప్రతిపక్షాలు లేకుండా చేసేందుకు బిజెపి ప్రయత్నిస్తుందని, సార్వత్రిక ఎన్నికల్లో ప్రతిపక్షాలు లేకుండా ముందుకు వెళ్లాలని యోచిస్తోందని ధ్వజమెత్తారు. ఇది పూర్తిగా ప్రజాస్వామ్యాన్ని విధ్వంసం చేసే చర్య అని పేర్కొన్నారు. దీనిని తాము ఖండిస్తున్నామని, అలాగే ప్రజాస్వామ్యం, రాజ్యాంగ విలువల పరిరక్షణ కోసం ప్రతిపక్ష పార్టీలన్నీ ఏకతాటిపైకి రావాలని, వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో బిజెపిని ఓడించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీపై అనర్హత వేటు చర్యను సీతారాం ఏచూరి ఖండించారు. సిపిఎం పొలిట్‌బ్యూరో సమావేశంలో ప్రకాష్ కరత్, మానిక్ సర్కార్, బివి రాఘవులు, పినరయి విజయన్, బృందాకరత్, సుభాషిణీ అలీ, ఎండి సలీం, సూర్యకాంత్ మిశ్రా, జి రామకృష్ణన్, ఎంవి గోవిందన్, తపన్ సేన్, నిలోత్పల్ బసు, ఎంఎ బేబి, అశోక్ ధావలే, రామచంద్ర డోమ్, ఎ విజయరాఘవన్ తదితరులు పాల్గొన్నారు.

124 మందితో కాంగ్రెస్ తొలి జాబితా

బెంగళూరు : కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా నోటిఫికేషన్ వెలువడనప్పటికీ రాజకీయ పార్టీలు సమరానికి సన్నద్ధమవుతున్నాయి. ఇప్పటికే ఎన్నికల ప్రచారం ప్రారంభించాయి. ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీ 124 మంది అభ్యర్థులతో తొలి జాబితాను విడుదల చేసింది. 'రాబోయే కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలకు ఎన్నికల కమిటీ ఖరారు చేసిన కాంగ్రెస్ అభ్యర్థుల మొదటి జాబితా ఇదే' అంటూ పార్టీ అభ్యర్థుల జాబితాను ట్విటర్‌లో షేర్ చేసింది. ఇందులో మాజీ ముఖ్యమంత్రి సిద్ధ రామయ్య, పీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ కూడా ఉన్నారు. సిద్ధ రామయ్య.. వరుణ నియోజకవర్గం నుంచి బరిలోకి దిగుతుండగా, శివకుమార్ కనకపుర నియోజకవర్గం నుంచి పోటీచేస్తున్నారు. కర్ణాటకలో మొత్తం 224 అసెంబ్లీ సీట్లున్నాయి. ప్రస్తుత అసెంబ్లీ పదవీకాలం మే 24న ముగియనుంది. ఈ నేపథ్యంలో గడువుకన్నా ముందే ఎన్నికల ప్రక్రియను ముగించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం సన్నాహాలు చేస్తోంది.

సిబిఐ విచారణకు తేజస్వియాదవ్

న్యూఢిల్లీ : 'లాండ్ ఫర్ జాబ్స్' కుంభకోణం దర్యాప్తులో భాగంగా సిబిఐ విచారణకు ఆర్‌జెడి నేత తేజస్వి యాదవ్ శనివారం హాజరయ్యారు. ఢిల్లీలోని సిబిఐ ప్రధాన కార్యాలయంలో ఉదయం 10.30 గంటల సమయంలో తేజస్వియాదవ్ విచారణకు హాజరైనట్లు సిబిఐ అధికారులు వెల్లడించారు. ఈ స్కామ్ దర్యాప్తులో భాగంగా ఆర్‌జెడి అధినేత లాలూ కుటుంబ సభ్యులను పలుమార్లు సిబిఐ విచారించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ నెలలో బీహార్ ఉపముఖ్యమంత్రి తేజస్వియాదవ్‌ను అరెస్టు చేయబోమని ఢిల్లీ హైకోర్టుకు గతవారమే సిబిఐ హామీ ఇచ్చింది. లాండ్ ఫర్ జాబ్స్ కుంభకోణంలో మార్చి 15 వ తేదీ లాలూ ప్రసాద్ యాదవ్, ఆయన భార్య రబ్రీ దేవి, సోదరి మిసా భారతిలకు సిబిఐ ప్రత్యేక కోర్టు బెయిల్ మంజూరు చేసింది.

వైసిపి వ్యతిరేక పవనాలు

- 2024లో జగన్ ఇంటికే
- యువగళం పాదయాత్రలో లోకేష్

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

రాష్ట్రంలో వైసిపికి వ్యతిరేక పవనాలు వీస్తున్నాయని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆ పార్టీ ఓటమే ఇందుకు నిదర్శనమని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. యువగళం పేరుతో లోకేష్ చేపట్టిన పాదయాత్ర శనివారం సత్యసాయి జిల్లా ఓబుళదేవరచెరువు మండలం వణుకువారిపల్లి గ్రామం నుంచి మొదలైంది. గాజుకుంట్లపల్లి, వైఎస్ఆర్ సర్కిల్, ఓబుళదేవచెరువు మీదుగా వేమారెడ్డిపల్లి గ్రామం వరకు యాత్ర సాగింది. పంట చేతికందక తీవ్రంగా నష్టపోయామని పలువురు రైతులు తమ సమస్యలను లోకేష్ దృష్టికి తీసుకువచ్చారు. వేమారెడ్డి గ్రామం వద్ద జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ...ఎపిలో వైసిపికి వ్యతిరేక పవనాలు వీస్తున్నాయని జగన్ పాలనపై జనం విసిగిపోయారన్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్ ఇంటికి వెళ్లడం తప్పదని జోస్యం చెప్పారు. సైకో పోవాలి.. సైకిల్ రావాలని ప్రజలందరూ కోరుకుంటున్నారని పేర్కొన్నారు. యువగళం పాదయాత్రకు తరలివస్తున్న జనాన్ని చూసి వైసిపి నేతల్లో వణుకు మొదలైందన్నారు. తాము అధికారంలోకి రాగానే అన్ని తరగతుల ప్రజల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. లోకేష్ పాదయాత్రకు హీరో నారా రోహిత్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో వైసిపి డిఫెన్స్‌లో పడిందని.. అందుకే టిడిపిపై బురదజల్లుతున్నారని విమర్శించారు. యువత రాజకీయాల్లోకి రావాల్సిన సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. మూడు రోజులు అనంతరం చేపట్టిన పాదయాత్ర శనివారంతో 50వ రోజుకు చేరుకుంది. ఆదివారం రామయ్యపేట విడిది కేంద్రం నుంచి యాత్ర కొనసాగనుంది.

కార్పొరేట్ల పన్ను బకాయిలు

- ఉమ్మడి గుంటూరు జిల్లాలో రూ.20 కోట్లు పెండింగ్
- వసూలుకు అధికారులు నానా తంటాలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గ్రామ పంచాయతీలకు పన్నులు చెల్లించకుండా కార్పొరేట్ రంగంలోని విద్యా, వైద్య, భారీ పరిశ్రమలు ఏళ్ల తరబడి జాప్యం చేస్తున్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో దాదాపు 40 సంస్థలు రూ.20 కోట్ల వరకు బకాయిలు ఉన్నాయి. వీటి వసూలుకు అధికారులు నానా తంటాలు పడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో 1025 గ్రామ పంచాయతీల నుంచి గత రెండేళ్లుగా ఇంటి పన్ను బకాయిలు పేరుకుపోతున్నాయి. వివిధ పన్నుల రూపంలో మొత్తం రూ.70 కోట్ల వరకు వసూలు కావాల్సి ఉండగా వీటిల్లో రూ.20 కోట్ల వరకు కార్పొరేట్ సంస్థలు చెల్లించాల్సినవి ఉన్నాయి. రాజధాని ప్రాంతంలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీ, విట్ యూనివర్సిటీలు గత కొనేళ్లుగా పన్నులు చెల్లించడం లేదు. దాదాపు రూ.నాలుగు కోట్ల వరకు బకాయిలు ఉన్నాయి. గుంటూరులోని కాటూరి మెడికల్ కళాశాల దాదాపు రూ.50 లక్షల వరకు బకాయి ఉండగా వారు హైకోర్టును ఆశ్రయించారు. అధికారులు కౌంటర్ దాఖలు చేశారు. కోర్టు ఆదేశాల మేరకు మూడు విడతలుగా రూ.30 లక్షలు చెల్లించారు. చేబ్రోలులోని కొన్ని స్పిన్నింగ్ మిల్లులు, భారీ పరిశ్రమల నిర్వహాకులు రూ.60 లక్షల వరకు బకాయిలు ఉన్నాయి. వీరు పన్నులు చెల్లించమంటే ముందు మౌలిక సదుపాయాలు కల్పించండి అంటూ ఎదురుదాడి చేస్తున్నారని అధికారులు తెలిపారు. వీరికి నోటీసులు జారీ చేశారు. ఇంజినీరింగ్, మెడికల్, డిగ్రీ కళాశాలలకు సంబంధించి పల్నాడు జిల్లాలో దాదాపు రూ.10 కోట్ల వరకు బకాయిలు ఉండగా బాపట్ల జిల్లాలో రూ.మూడు కోట్ల వరకు బకాయిలు ఉన్నాయి. గుంటూరు జిల్లాలో రూ.ఏడు కోట్ల వరకు బకాయిలు ఉన్నాయి. కొన్ని సంస్థల నిర్వహాకులు ప్రధాన రాజకీయ పార్టీలకు చెందిన వారు కావడంతో వీరి నుంచి వసూలు చేయడానికి అధికారులు నానా తంటాలు పడుతున్నారు. మరికొన్ని సంస్థల వారు పంచాయతీల సిబ్బందిని మ్యానేజ్‌చేసుకుని వేర్వేరు కారణాలతో జాప్యం చేస్తున్నాయి. ఇటీవల స్పందనలో జిల్లా కలెక్టర్‌కు పలువురు ఫిర్యాదు చేయడంతో కార్పొరేట్ సంస్థలకు నోటీసులు జారీ చేశారు.

అక్రమంగా టోల్ వసూలు

- సిపిఎం నిరసన

ప్రజాశక్తి-ముమ్మిడివరం

పోలీసులు, ఆందోళనకారుల తోపులాట

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం అన్నంపల్లిలో టోల్ ప్లాజా వద్ద అక్రమంగా పన్నులు వసూలు నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో శనివారం నిరసన చేపట్టారు. ఈ ఆందోళనలో ఆ పార్టీ జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ... భట్నవిల్లి నుంచి పేరూరు వరకు ఇంకా రోడ్డు నిర్మాణ పనులు పూర్తి కాలేదని, కామనగరువులో వంతెన నిర్మాణ దశలో ఉందని తెలిపారు. చించినాడు వరకు రోడ్డు విస్తరణ పనులు నామమాత్రంగానే సాగుతున్నాయన్నారు. నిర్మాణ పనులు పూర్తి కాకుండా టోల్ వసూలు చేయడమేమిటని ప్రశ్నించారు. టోల్‌ప్లాజా వద్ద పన్నులు వసూలు చేస్తున్నారన్న పేరుతో ఆర్‌టిసి ఛార్జీలు పెంచడం అన్యాయమన్నారు. రోజూ వందల మంది కాకినాడ ప్రాంతానికి విద్య, వైద్యం, ఇతర పనుల నిమిత్తం రాకపోకలు సాగిస్తున్నారని తెలిపారు. టోల్ వసూలుతో పేద ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. టోల్ వసూలును నిలిపివేయాలని గతంలో కలెక్టర్, హైవే అథారిటీకి వినతిపత్రం ఇచ్చామని, కానీ ఏ విధమైన చర్యలు తీసుకోలేదని తెలిపారు. నిరసన తెలుపుతున్న సిపిఎం కార్యకర్తలను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు, సిపిఎం నేతలకు మధ్య తోపులాట చోటు చేసుకుంది. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జి.దుర్గాప్రసాద్, పి.వసంత్ కుమార్, సకిలే సూర్యనారాయణ, కుడుపూడి రాఘవమ్మ, పాము బాలయ్య, దొమ్మేటి వీరరాఘవులు, తదితరులు పాల్గొన్నారు.

'వివేకా ' పిఎ స్టేట్‌మెంట్ రికార్డ్

ప్రజాశక్తి-పులివెందుల టౌన్

మాజీ మంత్రి వైఎస్.వివేకానందరెడ్డి హత్య కేసులో ఆయన పిఎ కృష్ణారెడ్డి స్టేట్‌మెంట్‌ను పులివెందుల కోర్టు శనివారం రికార్డు చేసింది. వివేకా హత్య కేసులో ఐదో నిందితుడిగా అరెస్టు అయిన దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి భార్య తులశమ్మ కడప జిల్లా పులివెందుల కోర్టులో ఫిబ్రవరి 21 ప్రయివేట్ కేసు వేసిన విషయం తెలిసిందే. ఈ కేసు శనివారం విచారణకు వచ్చింది. తన భర్తకు సంబంధం లేకున్నా కేసులో ఇరికించారని, వివేకా అల్లుడు రాజశేఖర్‌రెడ్డి, బావమరిది నర్రెడ్డి శివప్రకాశ్‌రెడ్డితో పాటు మరో నలుగురిని విచారించాలని ఆమె పిటిషన్‌లో కోరారు. ఈ నేపథ్యంలో వివేకానందరెడ్డి పిఎ కృష్ణారెడ్డి స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేశారు. తదుపరి విచారణను ఏప్రిల్ 15కి వాయిదా వేశారు.

కాలువలో పడి ఉపాధి కూలీ మృతి

ప్రజాశక్తి-ఆలమూరు

ప్రమాదవశాత్తూ పంటకాలువలో పడి ఉపాధి కూలీ మరణించిన సంఘటన డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలంలోని మోతుకూరు మార్గంలో శనివారం చోటు చేసుకుంది. ఫీల్డ్ అసిస్టెంట్ నల్లి రాజు తెలిపిన వివరాలు ప్రకారం.. మోతుకూరుకు చెందిన నేతల ఏసురత్నం (54) శనివారం ఉదయం యథావిధిగా ఉపాధి పనులకు హాజరయ్యారు. పంట కాలువలో పూడికతీత తీస్తుండగా ప్రమాదవశాత్తూ కాలువలో పడి మృతి చెందారు. స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. ప్రభుత్వం నుంచి అన్నివిధాలా సాయం చేస్తామని హామీ ఇచ్చారు. మట్టి ఖర్చుల నిమిత్తం తక్షణ సాయంగా రూ.20 వేలను కుటుంబ సభ్యులకు అందజేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎస్.శివప్రసాద్ తెలిపారు.

ఫలించిన సిపిఎం పోరాటం

- 40 మంది రైతులకు ఇళ్లస్థలాలు

ప్రజాశక్తి - లక్కవరపుకోట (విజయనగరం)

పేదల ఇళ్ల స్థలాల కోసం సిపిఎం ఆధ్వర్యాన చేపట్టిన సుదీర్ఘ పోరాటం విజయం సాధించింది. విజయనగరం జిల్లా లక్కవరపుకోట మండలం కొట్యాడ పంచాయతీ నాయుడుపేట గ్రామానికి చెందిన రైతుల నుంచి సర్వేనెంబర్ 40 లో 30 ,31 ,32 ,33 ,34 ,35 ,39 సబ్ నంబర్లలో ఎకరా 20సెంట్ల భూమిని 2001లో తక్కువ ధరకు ప్రభుత్వ స్వాధీనం చేసుకుంది. 2002లో 40మంది రైతులకు రెండేసి సెంట్లు చొప్పున ఇళ్ల పట్టాలు ఇచ్చి స్థలం చూపించకుండా 20ఏళ్లు కాలయాపన చేసింది. సిపిఎం ఆధ్వర్యంలో రైతులంతా వివిధ పోరాటాలు చేశారు. ఫలితంగా తాహశీల్దార్ తామరాపల్లి రామకృష్ణ స్పందించి రైతులకు భూమి కేటాయించడంతో పాటు ఆ భూములలో గృహ నిర్మాణాలు చేపట్టుకోవచ్చని తెలిపారు. ఈ నేపథంలో శనివారం ఏర్పాటు చేసిన విజయోత్సవ సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ మాట్లాడారు. సిపిఎం పోరాటాల ఫలితంగా విజయం సాధించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు పోరాట కమిటీ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

అదాని సంక్షోభంపై ప్రధాని జోక్యం చేసుకోలేదు

- ఆర్థిక సలహా కౌన్సిల్ సభ్యుడి వెల్లడి

న్యూయార్క్ : అదాని గ్రూపు సంక్షోభంపై పిఎం మోడి, కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోలేదని ప్రధాన మంత్రి ఆర్థిక సలహా కౌన్సిల్ సభ్యులు సంజీవ్ సన్యాల్ తెలిపారు. అదాని గ్రూపు తీవ్ర ఆర్థిక అవకతవకలు, మోసాలకు పాల్పడుతున్నాయని అమెరికన్ షార్ట్ సెల్లర్ హిండెన్‌బర్గ్ ఇచ్చిన రిపోర్ట్‌తో అదాని కంపెనీలు భారీ నష్టాలు చవి చూసిన విషయం తెలిసిందే. న్యూయార్క్‌లో ఓ ఇంటర్వ్యూలో సన్యాల్ మాట్లాడుతూ.. అదాని అంశంలో ప్రభుత్వం ఎక్కడా జోక్యం చేసుకోలేదన్నారు. భారత విధానంలో ఎవరూ ఎవరినీ రక్షించాల్సిన అవసరం లేదన్నారు. "దేశంలోనే అతిపెద్ద విత్త సంస్థ ఎస్‌బిఐ, అతిపెద్ద జీవిత బీమా సంస్థ ఎల్‌ఐసి నుండి అదాని గ్రూపునకు తక్కువ రుణాలే అందాయి. ఏ కంపెనీ కూడా ఎలాంటి ఆర్థిక ఒత్తిడికి గురికాలేదు. " అని సన్యాల్ పేర్కొన్నారు. అదాని గ్రూపు మోసాలపై జనవరి 24న హిండెన్‌బర్గ్ రీసెర్చ్ కీలక రిపోర్టును వెల్లడించిన విషయం తెలిసిందే. ఈ రిపోర్ట్ దెబ్బకు అదాని కంపెనీల మార్కెట్ కాపిటలైజేషన్ 60 శాతం వరకు పతనమయ్యింది. దాదాపు రూ.8 లక్షల కోట్ల పైగా సంపద ఆవిరయ్యింది. అనేక మంది రిటైల్ ఇన్వెస్టర్లు భారీ నష్టాలు చవి చూశారు. అదానికి అప్పులిచ్చిన బ్యాంక్‌ల షేర్లు అమాంతం పడిపోయాయి. ప్రపంచ కుబేరుల్లో మూడో స్థానంలో ఉన్న అదాని ఓ దశలో 30వ స్థానానికి దిగజారారు."మార్కెట్లు పారదర్శకంగా పని చేసేలా వాటి పనితీరును నిర్ధారించుకోవడం మా పని, మేము జోక్యం చేసుకోవడం కోసం కాదు. పారదర్శకత, క్రమబద్ధంగా పని చేసేలా మాత్రమే మేము శ్రద్ధ వహిస్తాము. ఈ ప్రక్రియలో ధరలు కొన్నిసార్లు పెరుగుతాయి, కొన్నిసార్లు అవి తగ్గుతాయి." అని సన్యాల్ పేర్కొన్నారు.

వైసిపికి భవిష్యత్తు లేదు : కోటంరెడ్డి

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

2024 ఎన్నికల్లో ప్రజలు వైసిపికి రాజకీయ భవిష్యత్తు లేకుండా చేస్తారని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. షోకాజ్ నోటీసులు ఇవ్వకుండా తనను డిస్మిస్ చేశారని, వచ్చే ఎన్నికల్లో వైసిపిని పజలు శాశ్వతంగా రాజకీయాల్లో లేకుండా చేస్తారని అన్నారు. నెల్లూరు అభివృద్ధికి సంబంధించి సిఎం స్వయంగా సంతకాలు పెట్టినా ఒక్క ఫైల్ కూడా ముందుకు కదలలేదని తెలిపారు. అందుకే తాను నిరసన గళం విప్పానని, ఇప్పుడు పార్టీ నుంచి సస్పెండ్ చేశారన్నారు. త్వరలో తన రాజకీయ భవిష్యత్తు గురించి ప్రకటన చేస్తానని తెలిపారు. రాష్ట్రంలో అనేక మంది ఎమ్మెల్యేలు వైసిపిపై తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారని పేర్కొన్నారు.

'ఆటోమేటిక్ అనర్హత'పై సుప్రీంలో వ్యాజ్యం

న్యూఢిల్లీ : కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ అనర్హత వేటును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో తాజాగా 'ఆటోమేటిక్ అనర్హత'పై పిటిషన్ దాఖలైంది. కేరళకు చెందిన సామాజిక కార్యకర్త అభా మురళీధరన్ సుప్రీంకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 8(3) ప్రకారం చట్టసభ్యుల 'ఆటోమేటిక్ అనర్హత', రెండు సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువకాలం జైలు శిక్ష విధించడాన్ని సవాల్ చేస్తూ మురళీధరన్ ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. సభ్యుని నేర స్వభావం, తీవ్రతతో సంబంధం లేకుండా ఆయనపై అనర్హతను అమలు చేయడం రాజ్యాంగంలోని 14వ అధికరణను ఉల్లంఘించడమేనని ఆయన పేర్కొన్నారు.

పోఖ్రాన్‌లో క్షిపణుల మిస్ ఫైర్

జైసల్మేర్: రాజస్థాన్ రాష్ట్రంలోని జైసల్మేర్‌లోని పోఖరన్ శ్రేణుల వద్ద ఆర్మీ యూనిట్ ఫీల్డ్ ఫైరింగ్ ప్రాక్టీస్ చేస్తుండగా మూడు క్షిపణులు మిస్ ఫైర్ అయ్యాయి. ఇవి నిర్దేశిత పరిధి దాటి వెళ్లి వేర్వేరు గ్రామాల్లోని పొలాల్లోకి దూసుకెళ్లడంతో భారీ పేలుళ్లు సంభవించాయి. అయితే ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదు. సైనిక విన్యాసాల సందర్భంగా మిస్సైల్‌లు మిస్ ఫైర్ అయ్యాయని రక్షణ ప్రతినిధి లెఫ్టినెంట్ కల్నల్ అమితాబ్ శర్మ తెలిపారు. విచారణ ప్రారంభించామని, తదనుగుణంగా తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

జల వనరుల వినియోగంపై కొత్త కార్యాచరణ అవశ్యం : యుఎన్ చీఫ్

న్యూయార్క్ : భవిష్యత్ తరాల వారు ఎలాంటి ఇబ్బందులు పడకుండా వుండాలంటే జల వనరులను పరిరక్షించుకోవడానికి అత్యవసర ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటానియో గుటెరస్ శుక్రవారం హెచ్చరించారు. "మానవాళి అందరికీ అత్యంత విలువైన వనరంటే నీరే, అంతర్జాతీయ రాజకీయ ఎజెండాలో ఈ జల వనరుల సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం వుంది." అని గుటెరస్ పేర్కొన్నారు. మూడు రోజుల పాటు జరిగిన ఐక్యరాజ్య సమితి సదస్సు ముగింపులో ఆయన మాట్లాడారు. మానవాళి ఆశలన్నీ భవిష్యత్ కోసం ఏదో ఒక రకంగా జల వనరుల కార్యాచరణ ఎజెండాకు జీవమిచ్చేందుకు నూతన సైన్స్ ఆధారిత ప్రణాళికను రూపొందించడంపై ఆధారపడి వుంటాయని గుటెరస్ కోరారు. "ఇక ఇప్పుడు ఆచరణలోకి దిగాల్సిన సమయం ఆసన్నమైంది." అన్నారు. అందరికీ సురక్షితమైన తాగునీరు, అందరికీ పారిశుధ్యం - 2030 జల వనరుల లక్ష్యాలను ఎదుర్కొనేందుకు ప్రపంచం సిద్ధంగా లేదని అన్నారు. నీరు మానవాళి జీవనాధారం అని ఈ వారంలో సదస్సు ప్రారంభంలో గుటెరస్ వ్యాఖ్యానించారు. విచ్చల విడిగా జల వనరులను ఉపయోగించడం వల్ల జల చక్రం దెబ్బతింటోందని, ఇది మరిన్ని ప్రకృతి విపత్తులకు దారి తీస్తోందని హెచ్చరించారు. ఈమూడు రోజుల సదస్సు సందర్భంగా ఎన్‌జిఓలు, ప్రభుత్వాలు, ప్రైవేట్ రంగం మొత్తంగా దాదాపు 700 హామీలిచ్చాయి. 10వేల మంది ప్రతినిధులు పాల్గొన్నారు. టాయిలెట్ల నిర్మాణం నుండి క్షీణించిన మూడు లక్షల కిలోమీటర్ల నదీ పరీవాహక ప్రాంతాల పునరుద్ధరణ వరకు అనేక రకాల హామీలు వచ్చాయి.

సంపాదకీయం

పర్పుల్ డే!

'మనిషి మెదడు కూడా కంప్యూటర్ వంటిదే. విడిభాగాలు పాడైన తర్వాత కంప్యూటర్ పని చేయటం ఆగిపోయినట్టే మెదడు కూడా ఆగిపోతుంది. ఒక్కసారి మెదడు ఆగిపోయిన తర్వాత ఏమీ ఉండదు. కన్నుమూసేలోపే మనకున్న శక్తిసామర్థ్యాలను పూర్తిస్థాయిలో వినియోగిస్తూ మంచి జీవితం గడపాలి. మనం చేసే పనులు అత్యున్నతంగా ఉండటానికి కృషి చెయ్యాలి. మరణం నాకు అత్యంత సమీపంలోనే ఉంటోంది. అయినప్పటికీ నేను మృత్యువుకు భయపడటం లేదు. త్వరగా మరణించాలనీ భావించటం లేదు. నేను కన్నుమూసేలోపు చేయాల్సిన పనులు ఎన్నెన్నో ఉన్నాయి' అంటారు ప్రముఖ శాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్. అంతేకాదు... 'నా శరీరం నిస్సత్తువగా కుర్చీలో కూలబడిపోవచ్చు. కానీ, నా మెదడు విశ్వాంతరాళాల్ని శోధిస్తుంది' అంటారాయన. మనిషికి ఆత్మవిశ్వాసం... తనపై తనకు నమ్మకం వుండటం అవసరం. నేను చేయగలను... సాధించగలను అన్న బలమైన నమ్మిక వుండాలి. ఆత్మవిశ్వాసం మనిషికి దివ్యౌషధం. జీవితం పూలపాన్పు కాదు. నల్లేరు బండి మీద నడక అంతకన్నా కాదు. 'కెరటం నాకు ఆదర్శం... లేచి పడుతున్నందుకు కాదు, పడినా లేస్తున్నందుకు' అంటారు స్వామి వివేకానంద. ఆత్మవిశ్వాసం... మానసిక స్థైర్యంతో అనారోగ్యాన్ని సైతం జయించొచ్చని హాకింగ్ నిరూపించాడు. కెనడాకు చెందిన కాసిడీ మేగాన్ అనే యువతి మూర్ఛ వ్యాధితో తాను ఎదుర్కొన్న పోరాటాల ద్వారా పొందిన ప్రేరణతో 'పర్పుల్ డే' అనే ఒక రోజును సృష్టించింది.

చూడటానికి ఎంతో ఆరోగ్యంగా కనిపిస్తూ... దారిలో నడుచుకుంటూ వెళ్తూ-ఉన్నట్లుండి కింద పడి గిలగిలా కొట్టుకుంటూ ఉండటం, నోటివెంట నురగలు రావడం వంటి సంఘటనలు చాలాసార్లు గమనించి ఉంటాం. ఇలా కింద పడి ఉన్న వ్యక్తులు చాలామంది కాసేపటికి తేరుకుని మళ్లీ ఏమీ జరగనట్లు వెళ్లిపోతూ ఉంటారు. దీనినే వాడుకభాషలో వాయి అని, వ్యవహారిక భాషలో మూర్ఛ అని, వైద్యపరిభాషలో ఫిట్స్ లేదా ఎపిలెప్సీగా చెబుతారు. దెయ్యాలు, భూతాల వలన ఇలా జరుగుతుందని ఒక అపోహ కూడా వుంది. అయితే, ఇనుప తాళాలకు, ఈ వ్యాధికి ఎలాంటి సంబంధం లేదంటున్నారు న్యూరాలజిస్టులు. ఏం చేసినా చేయకపోయినా ఈ మూర్ఛ లక్షణం రెండు మూడు నిమిషాలకంటే ఎక్కువ వుండదు. అంతకంటే ఎక్కువ సమయం కొనసాగితే వైద్యపరమైన అత్యవసర పరిస్థితిగా గుర్తించాలి, తగిన చికిత్స అందించాలి. వాస్తవానికి ఇది నాడీకణ సంబంధిత సమస్య. తాజా అధ్యయనం ప్రకారం భారత్‌లో 1.3 కోట్ల మంది ఎపిలెప్సీతో బాధపడుతుండగా, కేవలం 29 లక్షల మందికి మాత్రమే ఒకింత చికిత్స అందింది. ప్రపంచ వ్యాప్తంగా 65 మిలియన్ల మంది ఈ వ్యాధితో బాధ పడుతున్నారు. ప్రతి వంద మందిలో ఒకరికి ఈ వ్యాధి వున్నట్లు ఒక అంచనా. అయితే, ఈ వ్యాధి గురించి ప్రజలలో సరైన అవగాహన లేకపోవడం, అనేక అపోహలు చెలామణీలో వుండటంతో సమయానికి మందులు కూడా అందడంలేదు. ఇది ఎవరినైనా, ఎప్పుడైనా, ఎక్కడైనా ప్రభావితం చేయవచ్చు. ఒక్క క్షణంలో జీవితాలను మార్చనూగలదు.

'పుట్టినప్పటి నుండి పరిమళాలే లేని/ పూలెన్ని లేవు?/ గగనాన మూగి వర్షించగాలేని మే/ ఘాలెన్ని లేవు?' అంటాడు ఖలీల్ జిబ్రాన్. ఎలాంటి గుర్తింపూలేని ఒక యువతి చొరవతో చిన్నగా ప్రారంభమైన 'పర్పుల్ డే' ఆలోచనకు అనూహ్య మద్దతు లభించింది. పర్పుల్ (ఊదారంగు)డే అనేది మూర్ఛ క్యాలెండర్‌లో అతిపెద్ద అంతర్జాతీయ నిధుల సేకరణ మరియు అవగాహన దినం. 'పర్పుల్ డే' ప్రపంచవ్యాప్తంగా మూర్ఛవ్యాధి గురించి అవగాహన పెంచడానికి చేసే ఒక ప్రయత్నం. ఏటా మార్చి 26న ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాల్లోని ప్రజలు ఊదారంగు దుస్తులు ధరించి, మూర్ఛపై సాధారణ ప్రజల్లో అవగాహన పెంచడం, ఈ పరిస్థితికి నెట్టబడిన వ్యక్తులు ఎదుర్కొంటున్న సామాజిక కళంకాన్ని తొలగించడం, మానసికంగా వారిని శక్తివంతం చేయడం వంటి కార్యక్రమాలు జరుగుతుంటాయి. దీని కోసం జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వేర్వేరు రోజులు వున్నప్పటికీ...మూర్ఛ వ్యాధిగ్రస్తులకు చేయూతనిచ్చి, సరైన చికిత్స తీసుకొని ఆరోగ్యవంతులు కావడానికి అవసరమైన మానసిక స్థైర్యాన్ని నింపడమే 'పర్పుల్ డే' లక్ష్యం. 'మాట చేతగా మారి/ మనిషి మనిషితో చేరి/ స్వప్నం సత్యం ఐతేనే/ స్వర్గం' అంటాడు మహాకవి శ్రీశ్రీ. ఆ లక్ష్య చేతనలో చేయూతనందించడం మన వంతు బాధ్యత.

మహనీయుల మాట

దురాగతాలను బహిర్గతం చేస్తూ, ఉన్నత నైతిక భావాలను వ్యాప్తి చేయడం కంటే మిన్న అయిన లక్ష్యమూ ప్రయోజనమూ సాహిత్యానికి మరొకటి లేదు.

- గురజాడ అప్పారావు

అనర్హత వేటులో అదానీ కోణం!

ప్రస్తుతం

తెలకపల్లి రవి

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని లోక్‌సభ సభ్యత్వానికి అనర్హుడుగా ప్రకటిస్తూ సెక్రటరీ జనరల్ నోటిఫికేషన్ జారీ చేయడం ప్రధాని మోడీ హయాంలో ప్రజాస్వామ్యం దుర్దశకు తాజా తార్కాణం. కేంద్ర న్యాయ శాఖామంత్రి కిరణ్ రిజిజు నిత్యం సుప్రీం కోర్టుపైనే దాడి చేస్తూ ఒత్తిడి పెంచుతుంటే లేదుగానీ గుజరాత్ లోని సూరత్‌లో ఒక జిల్లా మెజిస్ట్రేట్ ఇచ్చిన తీర్పును ఆగమేఘాల మీద అమలు చేయాలని హడావుడి పడటం విపరీతమే. అదేమంటే రాజ్యాంగం 102వ అధికరణం, ప్రజాప్రాతినిధ్య చట్టం 8వ సెక్షన్ ప్రకారం ఇది తప్పనిసరి చర్యని సమర్థనకు దిగుతున్నారు. ప్రజా ప్రతినిధులకు రెండేళ్లు ఆపైన జైలు శిక్ష విధించబడితే, ఆ తీర్పును పైకోర్టులు నిలుపు చేయకపోతే (స్టే) వెంటనే వారి సభ్యత్వం రద్దవుతుందని వాదిస్తున్నారు. లోక్‌సభ ఆ స్థానాన్ని ఖాళీగా ప్రకటించడం, ఎన్నికల సంఘం ఎన్నికలు మొదలెట్టడం తర్వాతి దశలు. ఈ లోగా సుప్రీం కోర్టు లేదా హైకోర్టు గనక మేజిస్ట్రేట్ తీర్పుపై స్టే విధిస్తే అప్పుడు ఈ నోటిఫికేషన్ కూడా నిలిచిపోతుంది. పై కోర్టులో నేర నిర్ధారణ, శిక్ష అని రెండు భాగాలుంటాయి. ఈ రెండు భాగాలనూ నిలిపేస్తేనే రాహుల్‌కు ఉపశమనం లభిస్తుంది. అలాగాక కేవలం శిక్షను మాత్రమే నిలుపు చేస్తే ప్రయోజనం వుండదని ఒక వాదన. శిక్షా కాలమే అనర్హతకు కొలబద్ద గనక రెండో భాగంతో సంబంధం లేదని మరో వాదన. పై కోర్టుకు వెళ్లడానికి సూరత్ కోర్టు నెల రోజుల వ్యవధినిస్తూ కేవలం శిక్ష అమలును మాత్రమే నిలిపేసింది. నేర నిర్ధారణ (కన్విక్షన్) ను అలాగే వుంచింది. అయినా పైకోర్టు రెండింటిపై స్టే ఇవ్వవచ్చు. ఈ అవకాశం వున్నా ఆగమేఘాల మీద అనర్హుడుగా ప్రకటించడంలో రాజకీయ కుత్సితం స్పష్టమే. అదానీ మోడీ బంధాలపైన సాగుతున్న చర్చను దారి మళ్లించాలి. వీటినే డైవర్షన్ పాలిటిక్స్ అంటున్నారు. ఈ విషయమై తొలిసారి వివరంగా స్పందించిన రాహుల్ గాంధీ కూడా అనర్హత వేటు గురించి కన్నా కూడా అదానీని కప్పిపుచ్చి కాపాడే



పన్నాగాలపైనే మాట్లాడారు.

అదే కారణమా?

మోడీ ప్రభుత్వ ఆశీస్సులు, అనుబంధంతో హఠాత్తుగా ఆకాశానికి పడగలెత్తిన అదానీ వ్యాపార సామ్రాజ్యం హిండెన్‌బర్గ్ నివేదిక తర్వాత ఒక్కసారిగా కుదేలైంది. ఒక దశలో కొందరు భారతీయ బడా వ్యాపారులు పెట్టుబడులు పెట్టి ఆదుకున్నా అది చాలలేదు. మరింత దిగజారుతున్న సమయంలో అమెరికా లోని జిక్యుజి అనే ఫైనాన్స్ సలహా కంపెనీ అధినేత రాజీవ్ జైన్ 15000 కోట్లకు పైగా పెట్టుబడి పెట్టి ఆదుకున్నారు. ఈయన కంపెనీ పెట్టింది 2016 లోనే కావడం గమనార్హం. తన లావాదేవీలతో మూడు రోజుల్లో వేల కోట్లు ఆర్జించిన వ్యాపార మాయాజాలం ఈయన స్వంతం. మరి ఈయన పతనమవుతున్న అదానీ కంపెనీలో ఎందుకు ఇంత భారీగా నిధులు సమకూర్చారు? డొల్ల కంపెనీల నుంచి ఇంత భారీ సహాయం అందడం వెనక ఎవరున్నారు? అనేది రాహుల్ గాంధీ ప్రశ్న. ఈ ప్రశ్న తాను లోక్‌సభలో వేయడానికి ప్రయత్నిస్తే అవకాశం రాలేదని రాహుల్ చెబుతున్నారు. తర్వాత స్వయంగా స్పీకర్ ఓం బిర్లాను కలిసి అభ్యర్థించినా తాను అనుమతించలేనని ఆయన జవాబిచ్చారట. అదానీ మోడీ బంధం గురించి మాట్లాడుతున్నాను కనుకనే, తన దగ్గర ఆ ఇరవై వేల కోట్ల వెనక ఎవరున్నారో చెబుతాను గనకనే వరుసగా అనేక అస్త్రాలు ప్రయోగించారని రాహుల్ విమర్శ. లండన్‌లో ఏదో మాట్లాడాననీ, మోడీ పేరిట బిసిలను అవమానించానని, సభను అగౌరవ పరిచానని రకరకాల ఆరోపణలు అందుకే చేస్తున్నారని స్పష్టం చేశారు. లండన్‌లో భారత ప్రజాస్వామ్య సవాళ్లలో విదేశీ జోక్యాన్ని తాను కోరలేదని తొలిసారి సూటిగా స్పష్టం చేశారు. ఆ ప్రసంగం చూసిన వారెవరికైనా ఇది తెలుస్తుంది. 'ఇది మా అంతర్గత సమస్య, మేము చూసుకోవాల్సింది' అని మాత్రమే ఆయనన్నారు. బిజెపి మోడీని వెనకేసుకు రావచ్చు గాని భ్రష్టుడైన వ్యాపారవేత్త అదానీ కొమ్ము కాయడమెందుకని ఆయన ప్రశ్న. దేశంలో ప్రజాస్వామ్యం ఎంతటి ప్రమాదం ఎదర్కొంటున్నదో చెప్పడానికి ఈ అనర్హత ప్రహసనం చాలని ఆయన వ్యాఖ్యానించారు. ఈ సందర్భంలో తనకు అండగా

> **ఏదేమైనా ఇక్కడ సమస్య రాజకీయ నిరంకుశత్వం తప్ప నిబంధనలు కాదు. గతంలో కొంతమంది నాయకులు అవినీతి కేసుల్లో హత్య, అత్యాచారం వంటి వాటిలో అనర్హత పాలై వుండొచ్చు. కాని ఇక్కడ రాజకీయ విమర్శపై పరువు నష్టం తీసుకొచ్చి శిక్ష పడ్డాక పై కోర్టుకు వెళ్లేందుకు కూడా వ్యవధి లేకుండా నోటిఫికేషన్ ఇవ్వడం నిస్సందేహంగా రాజకీయ కక్ష సాధింపే. దేశంలోని ప్రతిపక్షాలన్నీ ఈ చర్యను తీవ్రంగా ఖండించాయంటే కారణం అదే.**

నిలిచి మోడీ ప్రభుత్వ కక్షపూరిత వైఖరిని ఖండించిన ప్రతిపక్షాలకు కృతజ్ఞతలు తెలిపారు. తనను ఎనిమిదేళ్లు కాదు జీవితమంతా అనర్హుడిగా ప్రకటించినా ఎంతకాలం జైలులో పెట్టినా లొంగి పోకుండా పోరాడుతుంటానని దృఢంగా సవాల్ చేశారు. ఒక విలేకరి వేసిన ప్రశ్నకు స్పందిస్తూ మీరు కావాలంటే బిజెపి బ్యాడ్జి తగిలించుకుని మాట్లాడండి గాని మీడియా ముసుగులో వారి తరపున మాట్లాడొద్దని ఆగ్రహించారు. గతంలో వలె మీడియా ప్రజాస్వామ్యం కోసం పోరాటంలో తోడుగా వుండేవనీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు గనక నేరుగా ప్రజల దగ్గరకు వెళ్లటమే మిగిలిన మార్గమని అన్నారు.

అర్జంటు ప్రకటన అనివార్యమా?

ఈ మొత్తం మీడియా గోష్టిలో కోర్టు తీర్పు, తదుపరి చర్యల గురించి మాత్రం రాహుల్ సూటిగా ప్రస్తావించకపోవడం యాదృచ్ఛికం కాదు. అందులో మళ్లీ ఏదైనా నెరుసు పట్టుకోవడానికి అవకాశమివ్వకుండా జాగ్రత్త పడివుండొచ్చు. అనర్హత అంశానికి వస్తే ఈ రోజున సుప్రీంకోర్టులో ఒక పిటిషన్ దాఖలైంది. రెండేళ్లు ఆపైన శిక్ష పడితే ప్రజాప్రతినిధులకు అనర్హత ప్రాప్తిస్తుందనే గత తీర్పును సవరించుకోవాలని ఇందులో కోరారు. ఎందుకంటే వాస్తవంగా రాజ్యాంగం 102వ అధికరణం గానీ, ప్రజాప్రాతినిధ్య చట్టం 8 గాని తీర్పు రాగానే అనర్హత సంక్రమిస్తుందని సూటిగా చెప్పడం లేదు. 'షల్ బి డిస్క్వాలిఫైడ్' అంటే 'అనర్హులను చేయాలి' అని మాత్రమే వుంది. ప్రజాప్రాతినిధ్య చట్టం సెక్షన్ 8(4) కింద అనర్హత పాలైన ఎంఎల్ఎలు, ఎంపిలు పై కోర్టులో అప్పీలు చేసేందుకు మూడు మాసాల వ్యవధి వుండేది. ఈ లొసుగును అడ్డు పెట్టుకుని గతంలో ప్రభుత్వాలు ఆ చర్యను చాలా కాలం సాగదీస్తూ వచ్చేవి. ఈ పరిస్థితి లాలూ ప్రసాద్ వర్సెస్ లిల్లీ థామస్ కేసులో సుప్రీంకోర్టు విచారించింది. క్రిమినల్ కేసుల్లో శిక్ష పడిన వారికి వెంటనే అనర్హత రావాలని సుప్రీం న్యాయమూర్తి జస్టిస్ ఖాన్‌విల్కర్ తీర్పునిచ్చి 8(4) సెక్షన్‌ను కొట్టివేశారు. ఇందులో చిక్కులు వున్నాయనే భావనతో నాటి మన్మోహన్ సింగ్ యుపిఎ ప్రభుత్వం ఒక సవరణ ఆర్డినెన్సు తీసుకొచ్చింది. ఉన్నఫళాన అనర్హత అనే అంశాన్ని అందులో మార్చే ప్రయత్నం చేసింది. ఆ తరుణంలో లాలూ ప్రసాద్ యాదవ్, జయలలితతో సహా పలువురు ప్రముఖులు అనర్హత పాలైన పరిస్థితి. వారిని కాపాడటానికే ఈ ఆర్డినెన్సు తెచ్చారని వ్యాఖ్యలు, విమర్శలు వచ్చాయి. యుపిఎ సర్కారులో చేరకపోయినా బయట నుంచే ఆధిపత్యం చలాయిస్తున్న రాహుల్ గాంధీ మీడియా ముందే ఆ ఆర్డినెన్సును చించి ముక్కలు చేయడం ఒక సంచలనమైంది. ఆ ఆర్డినెన్సుపై అప్పటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ కూడా అసంతృప్తిగా వున్నారని కథనాలున్నాయి. అందుకే

> **ఇక్కడ సమస్య రాహుల్ గాంధీదో అనర్హత వేటుదో మాత్రమే కాదు, ఈ సమయంలోనే ఇ.డి దుర్వినియోగంపై కూడా 14 పార్టీలు సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం ముందు కేసు వేశాయి. తాము 11 రాష్ట్రాలలో పాలన చేస్తున్నామనీ, 42 శాతం ఓట్లకు ప్రాతినిధ్యం వహిస్తున్నామని ఈ పార్టీల నేతలు పేర్కొన్నారు. మరోవైపున దేశమంతటా ప్రజాస్వామ్య రక్షణ పోరాటానికి సిద్ధం కావాలని ప్రతిపక్షాలు నిర్ణయించుకున్నాయి.**

ప్రధాని మన్మోహన్ కూడా రాహుల్ చర్యకు హతాశుడైనా మళ్లీ ఆ ప్రస్తావన తేలేదు. ఆ చర్య వల్లనే ఇప్పుడు రాహుల్ గాంధీ చిక్కుల్లో పడ్డారనిపించినా వాస్తవంలో కీలక సమస్య మోడీ సర్కారు కక్ష సాధింపు, ప్రజాస్వామ్య విలువలను ప్రతిపక్షాల స్థానాన్ని దెబ్బతీస్తున్న తీరు. లలిత్ మోడీ, నీరవ్ మోడీ వేల కోట్ల కుంభకోణాలను ప్రస్తావిస్తూ దొంగలందరికీ ఇదే ఇంటి పేరు వుందేమిటని రాహుల్ గాంధీ అనడం రాజకీయ విమర్శ ప్రధాని మోడీపై ఎక్కుపెట్టింది. దాన్ని వెనక్కు తీసుకోవడానికి గానీ, క్షమాపణలు చెప్పడానికి గాని సిద్ధపడలేదు. 2019లో కర్ణాటక లోని కోలార్‌లో ఎన్నికల సభలో చేసిన ఆ ప్రసంగాన్ని గుజరాత్ లోని సూరత్ కోర్టులో సవాలు చేయడం, బిజెపి మాజీ మంత్రి పూర్ణేంద్రు మోడీ పరువు నష్టం దావా వేయడంలోని రాజకీయం సుస్పష్టం. మోడీలు బిసిలనేది దానికి జోడించి బిజెపి నేతలు విమర్శలు గుప్పించారు. ఈ కేసు విచారణ సాగుతూండగా సూరత్ జిల్లా మెజిస్ట్రేట్ కోర్టులో పలువురు మారిపోయారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఆరోపిస్తున్నారు. ప్రస్తుత జిల్లా మెజిస్ట్రేట్ వర్మ ఈ తీర్పు వెలువరించారు.

న్యాయ, రాజకీయ పోరాటం

రెండేళ్లు అంతకు మించి శిక్ష పడితే అన్నారు గనక సమస్య శిక్షా కాలమని కొందరు వాదిస్తున్నారు. పై కోర్టు ఆ శిక్షను తగ్గిస్తే అప్పుడు అనర్హత వుండదు. అదే కారణం చూపుతూ మెజిస్ట్రేట్ వర్మ తగినంత కాలం వుంటే గాని శిక్షకు విలువ లేదని వ్యాఖ్యానించి రెండేళ్ల శిక్ష వేశారు. సుప్రీం కోర్టు దీన్ని తగ్గిస్తే అప్పుడు అనర్హత ప్రసక్తే వుండదు. అంతేగాక రాజ్యాంగం 103వ అధికరణం ఇలాంటి ప్రజాప్రతినిధులు రాష్ట్రపతిని మినహాయింపు కోరే అవకాశం వుంది. అవన్నీ లెక్క లోకి తీసుకోకుండా క్షణాల మీద అనర్హత ప్రకటిస్తే ఎలాగని కొందరు ప్రశ్నిస్తున్నారు. 102వ అధికరణం లాగే 103ను కూడా కలిపి చూడాలని వారి వాదనగా వుంది. కనకు తీర్పు వచ్చీ రాగానే అనర్హత ప్రకటించడం చట్టరీత్యా అవసరమనే బిజెపి వాదన ఇందుకు పూర్తి విరుద్ధంగా వుంది.

★

అమృత కాలం సరే...ఉద్యోగాలేవీ?

సమస్య

ఎం. కోటేశ్వరరావు

దేశం వృద్ధి చెందటం లేదని ఎవరూ చెప్పరు. దాని ఫలాలు ఎవరికి దక్కుతున్నాయన్నదే చర్చ. వృద్ధి రేటు ఎక్కువగా ఉన్నప్పటికీ ఉద్యోగాలు పెరుగుతున్నది కొన్నే. పోనీ పెట్టుబడిదారీ ఆర్థికవేత్తలు చెబుతున్న ఊట సిద్ధాంతం ప్రకారం పెరిగిన సంపదలు దిగువ వారికి చేరుతున్నాయా అంటే చివరికి అచ్చే దిన్, తాజాగా అమృత కాలం అని చెప్పిన నరేంద్ర మోడీ తొమ్మిదేళ్ల పాలన తరువాత మన్‌కీ బాత్‌లో కూడా చెప్పే ధైర్యం చేయలేదు.

గత ఏడాది సెప్టెంబరు చివరి వారంలో ఐఐఎఫ్ఎల్ వెల్త్ హరూన్ ఇండియా రిచ్ జాబితా వెల్లడించిన సమాచారం ప్రకారం 2021లో అదానీ కుటుంబం రోజుకు రూ.1,612 కోట్లు, ముకేష్ అంబానీ రూ.210 కోట్లు సంపాదించినట్లు పేర్కొన్నది. ఒక దశలో అదానీ కంటే అంబానీ సంపద రూ. రెండు లక్షల కోట్లు ఎక్కువ, అలాంటిది ఏడాది కాలంలోనే అంబానీని వెనక్కు నెట్టి అదానీ మూడు లక్షల కోట్లు ఎక్కువ. అంటే ఏడాదిలో ఐదు లక్షల కోట్లు సంపాదించాడు. అబ్రకదబ్ర, మాయలు మంత్రాలు చేసే గంధర్వులకు, మిత్రమా ఏమి నీ కోరిక, తథాస్తు అనే పైవారు ఉంటే తప్ప మానవ మాత్రులకు సాధ్యమా? 2012లో అంబానీ సంపదతో పోలిస్తే అదానీ దగ్గర ఆరో వంతు మాత్రమే ఉంది. 2014లో కేవలం ఎనిమిది బిలియన్ డాలర్ల సంపద ఉన్న అదానీ 2022 నాటికి 137 బి.డాలర్లకు ఎదిగారు. వందల సంవత్సరాలుగా ఆ రంగంలో ఉన్నవారికి సాధ్యం కానిది ఇంత స్వల్పకాలంలో అదానీకి ఎలా వచ్చింది, ఇతరులకు ఎందుకు రాలేదు అన్నది ప్రశ్న. బ్లూమ్‌బెర్గ్ తాజా బిలియనీర్ల జాబితా ప్రకారం ఈ ఏడాది జనవరి 24న 119 బి.డాలర్ల సంపద ఉన్న అదానీ ఇప్పుడు 57.2 బి.డాలర్లకు దిగజారారు. హరూన్ సంస్థ అంచనా 53 బి.డాలర్లుగా ఉంది. ముకేష్ అంబానీ 82 బి.డాలర్లతో అగ్రస్థానంలో ఉన్నారు.

దేశంలో జనవరిలో 7.14 శాతంగా ఉన్న

> **కార్పొరేట్లకు అమృతకాలం, అచ్చే దిన్. దేశ యువత భవిష్యత్‌కు ముప్పు. ఇది నేటి పరిస్థితి. పోతే, కాంగ్రెస్ 50 సంవత్సరాల్లో చేయలేని వాటిని తాను ఐదు సంవత్సరాల్లోనే చేసినట్లు 2019 ఎన్నికల్లో నరేంద్ర మోడీ చెప్పుకున్నారు. దిశ, దశ తెలుసుకొనేందుకు తొమ్మిదేళ్లు తక్కువ కాదు. దేశాన్ని ఎటు తీసుకుపోతున్నారో, ఏం జరుగుతుందో కూడా తెలియని స్థితిలోకి నెట్టారు.**



నిరుద్యోగం ఫిబ్రవరిలో 7.45 శాతానికి పెరిగిందన్న సిఎంఐఇ సమాచారాన్ని ఫైనాన్సియల్ టైమ్స్ ఉటంకించింది. నైపుణ్య శిక్షణ పథకాన్ని మన్మోహన్ సింగ్ కాలంలోనే ప్రారంభించారు. దానికి ఒక మంత్రిని ఏర్పాటు చేసి, కేటాయింపులను పెంచి అసలు దానికి ఆద్యుణ్ణి తానే అన్నట్లుగా నరేంద్ర మోడీ ప్రచారం చేసుకున్నారు. నిజం ఏమిటి ? "మనది ప్రధానంగా కార్పొరేట్ వృద్ధి మాత్రమే. ఒక యూనిట్ ఉత్పాదనకు భారత కార్పొరేట్లు ఎక్కువ మంది జనాలను నియమించటం లేదు. ఒకవైపు యువతకు ఉద్యోగాలు రావటం లేదు. మరోవైపు తమకు నిపుణులైన జనాలు దొరకటం లేదని కంపెనీలు ఫిర్యాదు చేస్తున్నాయి. జీవితకాల ఉపాధికి ప్రభుత్వ ఉద్యోగం అవసరమని ఆకాంక్షిస్తున్నారు. నూట నలభై కోట్ల మంది జనాభాతో పోలిస్తే అవి చాలా తక్కువ." అని ప్రణాళికా సంఘ మాజీ ప్రధాన సలహాదారు ప్రణబ్ సేన్ చెప్పినట్లు కూడా ఆ పత్రిక పేర్కొన్నది. "నైపుణ్యాలు దొరకటం మరొక సమస్య. అనేక కంపెనీలు ఇప్పటికే డిమాండ్ ఉన్న నైపుణ్యాలను వృద్ధి చేసుకున్న వారిని తీసుకుంటున్నాయి. భారత్‌లో ఫైనాన్స్, బీమా, రియల్ ఎస్టేట్, పొరుగు సేవలు, టెలికాం, ఐ.టి రంగాలలో ఎక్కువ వృద్ధి ఉంది. కానీ ఇవి ఉపాధిని సృష్టించేవి కాదు" అని అజీమ్ ప్రేమ్‌జీ విశ్వవిద్యాలయ అర్థశాస్త్ర ప్రొఫెసర్ అమిత్ భోసలే చెప్పినట్లు కూడా ఆ పత్రిక పేర్కొన్నది.

భారత్‌లో ఉపాధి సమస్య పరిష్కారం కావాలంటే ఇరవై సంవత్సరాల పాటు వార్షిక వృద్ధి రేటు పద్దెనిమిది శాతం ఉండాలని ఐదేళ్ల క్రితం ప్రపంచబాంకు అంచనా వేసింది. చిత్రం ఏమిటంటే తన విధానాలతో ప్రపంచంలో ఏ దేశంలో లేని విధంగా జిడిపి వృద్ధి రేటును తమ ప్రభుత్వం సాధిస్తున్నట్లు మోడీ సర్కార్ చెప్పుకుంటున్నది. మోడీ అధికారానికి వచ్చిన తొలి సంవత్సరాల్లో ఐదు శాతానికి అటూ ఇటూగా ఉన్న నిరుద్యోగ రేటు ప్రస్తుతం 7-8 శాతం మధ్య ఉంటున్నది. శ్రామిక శక్తి భాగస్వామ్య అంశంలో రెండు వందల దేశాల సమాచారాన్ని గ్లోబల్ ఎకానమీ డాట్ కామ్ విశ్లేషించింది. దాని ప్రకారం 2021లో 87.3 శాతంతో కతార్ ఒకటవ స్థానంలో ఉంది. మన దేశంతో సమంగా జనాభా ఉన్న చైనా 68.6 శాతంతో 42వది కాగా మన దేశం 45.57 శాతంతో 159వ స్థానంలో ఉంది. కరోనా కాలంలో 40 శాతం లోపుకు పడిపోయింది. ఇరవై-ఇరవై నాలుగు సంవత్సరాల వయస్సు వారిలో 2022 అక్టోబరులో పట్టణ నిరుద్యోగం 42 శాతం ఉండగా అదే చైనాలో 16-24 తరగతిలో 18శాతమే ఉంది. ప్రస్తుతం దేశంలో 30 ఏళ్ల లోపు వారు సగం మంది ఉన్నారు. అంటే ఉపాధి అవసరం ఎంత ఉందో దీన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు. ఇప్పుడున్న ధోరణుల ప్రకారం 2040 నాటికి 59 ఏళ్లు పైబడిన వారు దేశంలో ఎక్కువ మంది ఉంటారని అంచనా. 2024లో జరగనున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఈ ఏడాది చివరి నాటికి పది లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను ఇస్తామని కేంద్రం ప్రకటించింది. ఇవన్నీ సంవత్సరాల తరబడి నింపకుండా ఉంచిన ఖాళీలు. మెకెన్సీ సంస్థ అంచనా ప్రకారం 2030 నాటికి దేశంలో తొమ్మిది కోట్ల మేరకు వ్యవసాయేతర రంగాల్లో ఉపాధి కల్పించాల్సిన అవసరం ఉంది.

దేశంలో ఉపాధి రహిత వృద్ధి ఆందోళన కలిగిస్తోందని, వృద్ధికి అనుగుణంగా ఉపాధి పెరగటం లేదని ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రా కూడా చెప్పారు. అమెరికాలో కార్మిక శక్తి భాగస్వామ్యం 62 శాతం కాగా మన దేశంలో 40 శాతమని (2022) చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 2020 ఆర్థిక సర్వేలో 2025 నాటికి మంచి వేతనాలు ఉండే ఉద్యోగాలను నాలుగు కోట్లు, 2030 నాటికి ఎనిమిది కోట్లు కల్పించ గలమని, చైనా తరహా వృద్ధి విధానాన్ని అనుసరించాలని కూడా దానిలో పేర్కొన్నారు. దేశంలోని పెద్ద పట్టణాల్లో స్విగ్గి, జొమాటో వంటి కాలక్షేప ఉద్యోగాలు చేసే వారి సంఖ్య పెరుగుతోంది. గ్రామాల్లో అలాంటి అవకాశాలు కూడా ఉండటం లేదు. వృద్ధికి అనుగుణంగా ఉపాధి లేదు. ఉన్న ఉపాధికి పొందుతున్న వేతనం కూడా నామ మాత్రంగా ఉంది. తగినంత వేతనం లేకుండా కొనుగోలు శక్తి పెరగదు. స్థానిక కొనుగోలు శక్తి పెరుగుతున్న కారణంగానే ఎగుమతి మార్కెట్లో తేడాలు వచ్చినా చైనా తట్టుకోగలుగుతోంది. మన దేశంలో ఆ పరిస్థితి ఉందా?

కార్పొరేట్లకు అమృతకాలం, అచ్చే దిన్, దేశ యువత భవిష్యత్‌కు ముప్పు. ఇది నేటి పరిస్థితి. పోతే, కాంగ్రెస్ 50 సంవత్సరాల్లో చేయలేని వాటిని తాను ఐదు సంవత్సరాల్లోనే చేసినట్లు 2019 ఎన్నికల్లో నరేంద్ర మోడీ చెప్పుకున్నారు. దిశ, దశ తెలుసుకొనేందుకు తొమ్మిదేళ్లు తక్కువ కాదు. దేశాన్ని ఎటు తీసుకుపోతున్నారో, ఏం జరుగుతుందో కూడా తెలియని స్థితిలోకి నెట్టారు. ఎన్నికల వాతావరణం ఏర్పడింది కనుక దీని గురించి మోడీ భక్తులు ఎలా స్పందిస్తారో చెప్పనవసరం లేదు. నిజానికి ఇది నరేంద్రమోడీ వ్యక్తిగత సమస్య కాదు. తమది కాంగ్రెస్‌కు భిన్నమైన పార్టీ అని జనాన్ని నమ్మించేందుకు చేసిన ప్రచారం తప్ప వాజ్‌పేయి ఏలుబడిలో గానీ ఇప్పుడు నరేంద్ర మోడీ పాలనలో అనుసరిస్తున్న దివాళాకోరు విధానాలు గానీ గతంలో కాంగ్రెస్ ప్రవేశపెట్టినవే. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్) మన దేశం మీద రుద్దిన విధానాలకు భారతీయ ముద్ర వేసి మరీ అమలు జరుపుతున్న ఫలితమే. అయితే కాంగ్రెస్‌కు బిజెపికి తేడా లేదా అంటే ఉంది. ఆర్థిక విధానాల వైఫల్యాలకు తోడు గోబెల్స్ సమాచారాన్ని జనాలకు అందించే వాట్సాప్ విశ్వ విద్యాలయం, మత విద్వేషాన్ని బిజెపి బోనస్‌గా ఇచ్చింది కదా!

★

జనవాక్యం

రైతాంగాన్ని ఆదుకోరా!

రాష్ట్రవ్యాప్తంగా కురిసిన అకాల వర్షాలు, వడగండ్ల వానలకు రైతులు పూర్తిగా నష్టపోయారు. పెట్టుబడులు పెరిగి, గిట్టుబాటు ధరలు లేక రుణాల ఊబిలో కూరుకుపోయిన రైతులకు తాజా వర్షాలు కోలుకోలేని దెబ్బతీశాయి. ప్రభుత్వం రైతులను తక్షణమే ఆదుకోవాలి. నిబంధనలు పక్కనపెట్టి ప్రభుత్వం నష్టపోయిన రైతులకు పూర్తి నష్టపరిహారం ఇవ్వాలి.

- గరిమెళ్ల రామకృష్ణ,
ముస్తాబాద, కృష్ణా జిల్లా.

కవిత్వం

అయ్యేదెప్పుడు....

కాళ్లను నేలకు ఆనించి..
కళ్ళను నింగి వైపు చూసే
రైతన్న
రారాజు అయ్యేదెప్పుడు....
బురద పూసుకొని....
బక్క చిక్కిన రైతు...
బలం పొందే దెప్పుడు.....
పంట చేతికి రాక పోయినా...
మనసంతా మారాం చేసినా..
నేల తల్లిన నమ్మిన రైతు
నవ్వేదెప్పుడు....
ఎత్తుకు పై ఎత్తులు వేసే...
రుతుపవనాలతో...
చిత్తు అయ్యే రైతన్న...
రాజు అయ్యేదెప్పుడు...
రారాజు అయ్యేదెప్పుడు....?

- పాణ్యం అనిల్ కుమార్
సెల్ : 9959032693

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps @ gmail.com

అమెరికాలో టోర్నడోల బీభత్సం

మిస్సిసిపి, అలబామాల్లో 23 మంది మృతి

రోలింగ్ ఫోర్క్ (యుఎస్) : అమెరికా రాష్ట్రాలైన మిస్సిసిపి, అలబామా గ్రామీణ ప్రాంతాల్లో శుక్రవారం రాత్రి సుడిగాలులతో కూడిన పెను తుపాను (టోర్నడో) అల్లకల్లోలం సృష్టించింది. శక్తివంతమైన ఈ తుపాను ధాటికి 23 మంది మరణించారు. తుపాను బాధిత ప్రాంతాల్లో సహాయక చర్యలు కొనసాగుతుండడంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశం వుందని భావిస్తున్నారు. కాగా ప్రచండ గాలుల ధాటికి భవనాలు, వృక్షాలు సైతం నేలకూలాయి. విద్యుత్ తీగలు తెగిపడడంతో ఆ ప్రాంతాలన్నీ చీకటిలో మగ్గుతున్నాయి. గోల్ఫ్ బంతుల సైజులో వడగళ్ళు పడుతుండడంతో ప్రాణాపాయ పరిస్థితులు నెలకొన్నాయంటూ అధికారులు హెచ్చరించారు. అమెరికా దక్షిణాది రాష్ట్రమైన మిస్సిసిపిలో ఈ తరహా తుపాను రావడం ఇదే మొదటిసారి. ఈశాన్య జాక్సన్, మిస్సిసిపి ప్రాంతాల్లో గంటకు 96కిలోమీటర్ల వేగంతో సుడిగాలులు వీస్తుండడంతో పరిస్థితి బీభత్సంగా వుందని జాతీయ వాతావరణ సర్వీసు కార్యాలయం తెలిపింది. "ప్రాణాలు కాపాడుకోవాలంటే ముందు జాగ్రత్తలు తప్పనిసరి, మనం ఇప్పుడు ప్రాణాపాయ పరిస్థితుల్లో వున్నాం." అని హెచ్చరికలు జారీ చేసింది. "గాలుల ధాటికి చెత్తా చెదారం అంతా గాల్లోకి ఎగురుతుండడంతో గాయాలయ్యే ప్రమాదం వుందని అధికారులు పేర్కొన్నారు. సంచార గృహాలు ధ్వంసమవుతాయని, ఇళ్లకు, వ్యాపారాలకు, వాహనాలకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం వుందని, మొత్తమ్మీద నష్టం గణనీయంగా వుండగలదని అధికారులు తెలిపారు. ఏ మాత్రం బలహీనపడకుండా సుడిగాలులు అంతే ఉధృతంగా వీస్తుండడంతో సిల్వర్ సిటీ, రోలింగ్ ఫోర్క్ గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో తీవ్ర విధ్వంసం నెలకొంది. తుపాను నెమ్మదిగా అలబామా వైపునకు పయనించిందని అధికారులు తెలిపారు. రోలింగ్ ఫోర్క్ మేయర్ ఎల్డ్రిడ్జ్ వాకర్ మీడియాతో మాట్లాడుతూ, విద్యుత్ లైన్లు ఎక్కడికక్కడ తెగిపడి వుండడంతో ఇంటి నుండి బయటకు రావడం కూడా కష్టంగా వుందన్నారు. రోలింగ్ ఫోర్క్, ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లో పత్తి, జొన్న, సోయాబీన్ పంటలు, చేపల చెరువులు ఎక్కువగా వున్నాయి. తుపాను గాలుల ధాటికి పంట చాలాచోట్ల నష్టపోయింది. షార్కీ, హంఫ్రీ కౌంటీల్లో గాలింపు, సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. వైద్య బృందాలను కూడా అప్రమత్తం చేశామని గవర్నర్ టాటే రీవ్స్ ట్విట్టర్లో తెలిపారు. మిస్సిసిపి డెల్టా ప్రాంతంలో అపార నష్టం సంభవించింది.

మూడు నెలల్లోగా ఆన్‌లైన్ ఆర్‌టిఐ పోర్టల్స్

• సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ : పౌరులకు పారదర్శకత కోసం ఆన్‌లైన్ సమాచార హక్కు (ఆర్‌టిఐ) పోర్టల్స్‌ను మూడు నెలల్లోగా ఏర్పాటు చేసి అమల్లోకి తీసుకురావాలని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను సుప్రీం కోర్టు ఆదేశించింది. హైకోర్టుల్లో, జిల్లా కోర్టుల్లో ఏర్పాటు చేసేందుకు కూడా హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్స్‌కు ఇదే గడువును విధించింది. న్యాయవాది జోస్ అబ్రహాం ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రవాసీ లీగల్ సెల్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారించిన బెంచ్ ఈ ఆదేశాలు జారీ చేసింది. ఎలక్ట్రానిక్ సాధనాల ద్వారానైనా దరఖాస్తు చేసుకునే చట్టబద్ధమైన హక్కు సమాచారాన్ని కోరేవారికి వుంటుందని సమాచార హక్కు చట్టం 2005లోని సెక్షన్ 6(1) పేర్కొంటోంది. కానీ అనేక హైకోర్టులు, జిల్లా కోర్టులు మాత్రం కేవలం భౌతికంగా వచ్చిన ఆర్‌టిఐ దరఖాస్తులను మాత్రమే స్వీకరిస్తున్నాయని అబ్రహాం చెప్పారు. సమాచారం కావాలని కోరే అభ్యర్ధన కోసం సుప్రీం కోర్టు ఇటీవలే ఆన్‌లైన్ పోర్టల్ ఏర్పాటు చేసింది. 2005లో ఈ చట్టాన్ని తీసుకువచ్చిన 17 ఏళ్ల తర్వాత, కొన్ని హైకోర్టులు ఆన్‌లైన్ వెబ్ పోర్టల్స్‌ను అమలు చేస్తున్నాయని సుప్రీం తెలిపింది. మధ్యప్రదేశ్, ఒడిషా, ఢిల్లీ వంటి కొన్ని హైకోర్టులు ఆన్‌లైన్ ఆర్‌టిఐ పోర్టల్స్‌ను ఏర్పాటు చేశాయని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన వెబ్ పోర్టల్‌ను కర్ణాటక హైకోర్టు ఉపయోగిస్తోందని బెంచ్ పేర్కొంది.

మాగుంటపై తీర్పు రిజర్వు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

వైసిపి ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి కుమారుడు మాగుంట రాఘవ్ బెయిల్ పిటిషన్‌పై తీర్పును రౌస్ ఎవెన్యూలోని సిబిఐ ప్రత్యేక కోర్టు రిజర్వు చేసింది. ఈ పిటిషన్‌పై తీర్పు ఏప్రిల్ నెల 6న వెల్లడిస్తామని తెలిపింది. ఢిల్లీ మద్యం కుంభకోణంలో ఫిబ్రవరి 11న ఎన్‌ఫోర్స్‌మెంటు డైరెక్టరేట్ (ఇడి) అధికారులు రాఘవ్‌ను అరెస్టు చేశారు. ప్రస్తుతం రాఘవ్ తీహార్ జైల్లో ఉన్నారు. ఈ కేసులో తనకు బెయిల్ మంజూరు చేయాలని రాఘవ్ సిబిఐ ప్రత్యేక కోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్ శుక్రవారం సిబిఐ స్పెషల్ కోర్టు జడ్జి నాగ్‌పాల్ విచారణ జరిపారు.

విద్యుత్ ప్రాజెక్టులు అదానీకే

• డిపిఆర్‌లు సిద్ధం చేస్తున్న ప్రభుత్వం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

మరోసారి అదానీవైపే రాష్ట్ర ప్రభుత్వం మొగ్గు చూపిస్తోంది. తాజాగా సంప్రదాయేతర ఇంధన వనరులశాఖ.. అదానీ గ్రూపునకు భారీగా ప్రాజెక్టులను అప్పగించింది. ప్రధానంగా మన్యం జిల్లాల్లోని పంప్‌డ్ స్టోరేజీ జల విద్యుత్ పథకాల్లో ఆరు ప్రాజెక్టులను అదానీకి కట్టబెట్టారు. ఈ ప్రాజెక్టుల ద్వారా మొత్తం 5,300 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసేందుకు నిర్ణయించింది. త్వరలోనే ఈ ప్రాజెక్టుల ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచేందుకు కూడా అనుమతి ఇవ్వనున్నట్లు తెలిసింది. గతేడాది ప్రకటించిన ఎపి పంప్‌డ్ స్టోరేజీ పవర్ ప్రమోషన్ పాలసీలో భాగంగా పలు పథకాలకు కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగానే 22 పథకాలను ఐదు దశల్లో నిర్మించేందుకు నిర్ణయించింది. మరో రెండు పథకాలను పూర్తిగా ప్రైవేటు రంగంలో నిర్మించేందుకు నిర్ణయించింది. వీటి మొత్తం సామర్థ్యం 24,100 మెగావాట్లుగా ఖరారు చేశారు. రెండు పథకాలను మినహాయిస్తే మిగిలిన 22 పథకాల సామర్థ్యం 20,620 మెగా వాట్లుగా ఖరారు చేశారు. ఇందులోనే అదానీ సంస్థకు 5,300 మెగావాట్ల ప్రాజెక్టులు ఖరారు చేశారు.అదానీ సంస్థకు అడ్డగోలుగా ప్రాజెక్టులను అప్పగించడంపై దేశ వ్యాప్తంగా విమర్శలు వస్తున్నప్పటికీ.. మరోసారి రాష్ట్రంలో అదానీ సంస్థకు మరిన్ని ప్రాజెక్టులు అప్పగించడం గమనార్హం. కడప జిల్లాలోని గండికోటలో ఏర్పాటుచేయనున్న వెయ్యి మెగావాట్ల విద్యుత్ కేంద్రం, సత్యసాయి జిల్లాలోని చిత్రావతి, పార్వతీపురం మన్యం జిల్లాలోని కురుకుర్తి, కర్రివలస కేంద్రాలు, అల్లూరి సీతారామరాజు జిల్లా పెదకోట, రైవాడల్లో నిర్మించనున్న విద్యుత్ కేంద్రాలను అదానీకి అప్పగించారు. మరికొన్ని ప్రాజెక్టులను ఇంకా ఎవరికీ అప్పగించకపోవడంతో అవి కూడా భవిష్యత్తులో అదానీ గ్రూపునకే దక్కే అవకాశాలున్నట్లు ప్రచారం జరుగుతోంది. అదానీకి కేటాయించిన ప్రాజెక్టుల్లో పెదకోట 1500 మెగావాట్లు సామర్థ్యం కాగా, అదానీకి వెయ్యి మెగావాట్లు కేటాయించారు. రైవాడ కేంద్రం అంచనా సామర్థ్యం 1000 మెగావాట్లు కాగా, ప్రస్తుతం 600 మెగావాట్లు అదానీకి కేటాయించారు. అంటే రానున్న కాలంలో మిగిలిన సామర్థ్యాన్ని కూడా అదానీకే కేటాయించే అవకాశాలు సుస్పష్టంగా కనిపిస్తున్నాయి. మొత్తం అన్ని ప్రాజెక్టులకూ పూర్తిస్థాయి ప్రాజెక్టు రిపోర్ట్ (డిపిఆర్) లు సిద్ధం చేసేందుకు అధికారులు చర్యలు ప్రారంభించారు. ఆ తరువాతే ఆయా ప్రాజెక్టు మొత్తం అంచనా వ్యయం ఎంతన్నది తేలుతుందని అధికారులు చెబుతున్నారు.

అదానీకి దక్కిన ప్రాజెక్టులు ఇవే (మెగావాట్లలో)

కేంద్రం	సామర్థ్యం
గండికోట	1000
చిత్రావతి	500
కురుకుర్తి	1200
కర్రివలస	1000
పెదకోట	1000
రైవాడ	600

న్యాయ వృత్తుల్లో మహిళల ప్రాతినిధ్యం పెరగాలి

• సిజెఐ జస్టిస్ చంద్రచూడ్

మదురై : న్యాయ వృత్తుల్లో మహిళలు, పురుషుల నిష్పత్తి దయనీయంగా వుందని భారత ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం నాడు మదురై జిల్లా కోర్టు ఆవరణలో అదనపు కోర్టు భవనాల శంకుస్థాపన కార్యక్రమంలో చంద్రచూడ్ ప్రసంగించారు. యువతకు, నైపుణ్యాలు, ప్రతిభ కలిగిన మహిళా లాయర్లకు దేశంలో ఎలాంటి కొరత లేదని అంటూ మహిళలకు సమాన అవకాశాలు కల్పించాలని పిలుపిచ్చారు. 'మహిళలను తీసుకునే అవకాశాలపై రిక్రూటింగ్ చాంబర్లు సంశయాత్మకంగా వున్నాయి. మహిళల కుటుంబ బాధ్యతలు వారి వృత్తి మార్గంలో అడ్డు వస్తాయని అవి భావిస్తున్నాయి. ఈ ధోరణి విడనాడాలి. న్యాయ వృత్తుల్లో మహిళల ప్రాతినిధ్యం పెరగాలి' అని ఆయన పిలుపునిచ్చారు. తమిళనాడులో 50 వేల మంది పురుషులు బార్‌లో ఎన్‌రోల్ చేసుకుంటే అందులో కేవలం 5 వేల మందే మహిళలు వున్నారని జస్టిస్ చంద్రచూడ్ చెప్పారు. దేశవ్యాప్తంగా దాదాపు ఇవే గణాంకాలు వున్నాయన్నారు. కానీ నెమ్మదిగా పరిస్థితులు మారుతున్నాయన్నారు. ఇటీవల జిల్లా న్యాయ వ్యవస్థలో జరిగిన రిక్రూట్‌మెంట్‌లో 50 శాతానికి పైగా మహిళలు వున్నారన్నారు. కానీ, జీవితంలో ముందుకు సాగుతున్న కొద్దీ మహిళలు బహుళ రకాలైన బాధ్యతలు మోయాల్సి రావడం వల్ల వారికి మనం సమాన అవకాశాలు సృష్టించాల్సి వుందన్నారు.

ఇంటెల్ సహ వ్యవస్థాపకుడు గోర్డన్ మూర్ మృతి

న్యూయార్క్ : అమెరికన్ మల్టీనేషనల్ కార్పొరేషన్, టెక్నాలజీ కంపెనీ ఇంటెల్ కార్పొరేషన్ సహ వ్యవస్థాపకుడుగోర్డాన్ మూరే (94) మృతి చెందారు. శనివారం హవాయిలోని తన స్వగృహంలో తుది శ్వాస విడిచారు. ఇంటెల్ కార్పొరేషన్ తన సహ వ్యవస్థాపకుడికి నివాళులర్పించింది. ఆయన చిరస్మరణీయం.. గొప్ప విజనరీని కోల్పోయమంటూ ట్వీట్ చేసింది. మూరే దూరదృష్టి హైటెక్ యుగానికి వేదికైంది అంటూ వ్యాపార వర్గాలు నివాళు లర్పించాయి. 1950 దశకంలో ఆయన సెమీకండక్టర్ల వ్యాపారం మొదలుపెట్టారు. ఆ తర్వాత ఆయన ఇంటెల్ కార్పొరేషన్ సంస్థను స్థాపించారు. ప్రతి ఏడాది కంప్యూటర్ ప్రాసెసింగ్ పవర్స్ రెట్టింపు అవుతుందని ఆయన అంచనా వేశారు. కంప్యూటర్ ప్రాసెసర్ ఇండస్ట్రీలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారు. పీసీ రెవల్యూషన్‌లో ఆయన పాత్ర ప్రత్యేకమైంది. మెమోరీ చిప్స్ తయారీలోనూ మూర్ తనదైన ముద్ర వేశారు.

30 రోజులైనా స్పందించని కేంద్రం

• జంతర్‌మంతర్ వద్ద ఉపాధి కార్మికుల ఆందోళన

న్యూఢిల్లీ : దేశ రాజధానిలోని జంతర్‌మంతర్ వద్ద మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ) కార్మికులు చేపట్టిన ఆందోళనకు శనివారంతో 30 రోజులు పూర్తయ్యాయి. నెల రోజుల పాటు ఆందోళన జరిపినా తమ సమస్యల పరిష్కారానికి స్పందించడంలో కేంద్రం విఫలమైందని వారు విమర్శించారు. మంత్రిత్వ శాఖ అధికారులు కార్మికులను కలిసినప్పటికీ, ఎలాంటి పరిష్కార మార్గాలు కానరావడం లేదని స్కీమ్ వర్కర్ల గ్రూపైన ఎన్‌ఆర్‌ఇజిఎ సంఘర్ష్ మోర్చా పేర్కొంది. ఈ పథకంపై ప్రభుత్వం మూడంచెల దాడి జరపడాన్ని తీవ్రంగా నిరసిస్తున్నట్లు మోర్చా నేత రాజ్ శేఖర్ తెలిపారు. 30వ రోజు ఆందోళన సందర్భంగా ఇక్కడ ఒక పత్రికా సమావేశాన్ని వారు నిర్వహించారు. ఈ పథకం బడ్జెట్‌ను మూడో వంతుకు కుదించడం, హాజరు కోసం మొబైల్ యాప్‌ను ప్రవేశపెట్టడం, ఆదార్ ప్రాతిపదికన చెల్లింపులు తప్పనిసరి చేయడం ఈ మూడు నిర్ణయాలను వారు తీవ్రంగా విమర్శిస్తున్నారు. వీటి వల్ల కార్మికులు తీవ్రంగా దెబ్బ తింటున్నారని అన్నారు. వారికి పని దొరకడం కష్టమై పోతోందన్నారు. ఈ ధర్నా వంద రోజులైనా ఇలాగే కొనసాగుతుందని సంఘటిన్ కిసాన్ మజ్దూర్ సంఘటన్ నేత రిచా సింగ్ చెప్పారు. దేశవ్యాప్తంగా మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ కార్మికులు దశలవారీగా ఈ ధర్నాలో పాల్గొంటారని చెప్పారు.

'ఉపాధి' నిధుల నిలిపివేతపై బెంగాల్‌లో 28 నుంచి నిరసనలు

కొల్‌కతా : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ చట్టం (ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ) కేటాయింపుల నిలుపుదలకు వ్యతిరేకంగా పశ్చిమబెంగాల్ రాష్ట్రవ్యాప్తంగా లెఫ్ట్‌ఫ్రంట్ నిరసనలకు పిలుపునిచ్చింది. కోల్‌కతాలోని ముజఫర్ అహ్మద్ భవన్‌లో శనివారం జరిగిన మీడియా సమావేశంలో లెఫ్ట్ ఫ్రంట్ ఛైర్మన్ బిమన్‌బసు మాట్లాడుతూ... 'పశ్చిమబెంగాల్ రాష్ట్రంలో ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ ప్రాజెక్టును ఉద్దేశపూర్వంగా మోడీ ప్రభుత్వం నిలిపివేస్తోంది. కేంద్ర ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా మార్చి 28,29, 30 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలకు పిలుపునిచ్చాం. ఈ మూడు తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు జరగనున్నాయి' అని ఆయన అన్నారు. అలాగే కేంద్ర బడ్జెట్‌లో పశ్చిమబెంగాల్‌కు కేటాయింపులు చేయలేదేని మోడీ ప్రభుత్వాన్ని ఆయన విమర్శించారు. ఎంజిఎన్‌ఆర్‌ఇఎ పథకం కింద పని పొందుతున్న పేద ప్రజలకు పని లేకుండా చేయడానికి, వారిని ఈ పథకానికి దూరం చేయడానికి మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని బసు విమర్శించారు. ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ ఎకౌంట్స్‌లో ఏవైనా అవకతవకలుంటే దోషులను తప్పకుండా శిక్షించాలని ఆయన అన్నారు.

ఎనర్జీ ఇంటెన్సివ్ పరిశ్రమలపై రూ.350 కోట్లు భారం

(మొదటి పేజీ తరువాయి)

నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. గతంలో ఏడాదికి ఒక్కసారే ఉన్న ఆఫ్-సీజన్ ఎంపికను ఏడాదికి రెండుసార్లుగా మార్చినట్టు తెలిపారు. ఇప్పటి వరకూ ఎనర్జీ ఇంటెన్సివ్ ఇండస్ట్రీస్‌లో హెచ్‌టి ఇంటెన్సివ్ ఇండస్ట్రీస్ డిమాండ్ ఛార్జీలను వసూలు చేయడం లేదని, ఇక నుంచి కెవిఎకు రూ.475 చొప్పున చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. సోలార్ పంపుసెట్లను వాడుతున్న రైతులకు సోలార్ విద్యుత్తుకు సంబంధించి ఏవైనా సమస్యలు ఎదురైతే ప్రభుత్వ విధానం ప్రకారం విద్యుత్తు పంపిణీ సంస్థలు వారికి ఉచిత విద్యుత్తును పంపిణీ చేయాలని ఆదేశించారు. సోలార్ రూఫ్ టాప్ ప్లాంట్ల ఏర్పాటుకు 2019 మే 25న ఎపి ఇఆర్‌సి ఆమోదించిన సోలార్ రూఫ్ టాప్ నెట్ మీటరింగ్ మార్గదర్శకాలను డిస్కములు కచ్చితంగా పాటించాలని సూచించారు. విద్యుత్తు బిల్లుల్లో వివరాల అలైన్మెంట్, విజిబిలిటీ తదితర అంశాలపై 30 రోజుల్లోగా పూర్తి స్థాయి నివేదిక సమర్పించాల్సిందిగా విద్యుత్తు పంపిణీ సంస్థలను ఆదేశించినట్లు తెలిపారు. విద్యుత్తు ఆదా అంశానికి సంబంధించి గృహ వినియోగదారులకు ఎల్ఇడి ట్యూబ్ లైట్లు, బిఎల్‌డిసి సీలింగ్ ఫ్యాన్లు, సూపర్ ఎఫిషియెంట్ ఎయిర్ కండిషనర్లు వంటి ఇంధన సమర్థవంతమైన ఉపకరణాల విక్రయానికి సంబంధించి పైలట్ ప్రాజెక్టును 2022 నవంబర్ తొమ్మిది నాటి ప్రొసీడింగ్స్ ద్వారా ఎపి ఇఆర్‌సి ఆమోదించినట్లు చెప్పారు. ఈ అంశాలపై వినియోగదారుల స్పందన ఆధారంగా తదుపరి చర్యలను కమిషన్ నిర్దేశిస్తుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రైతులకు విద్యుత్తు కనెక్షన్ల మంజూరుకు వీలుగా నిర్దేశాలతో కూడిన ఉత్తర్వులను 2021 మార్చి 23న ఎపి ఇఆర్‌సి జారీ చేసిందని తెలిపారు. ఈ ఆదేశాలకు అనుగుణంగా వ్యవసా య విద్యుత్తు సర్వీసులను విడుదల చేయనట్లయితే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకునేందుకు వీలుగా ఈ అంశాన్ని వినియోగదారులు కమిషన్ దృష్టికి తీసుకురావచ్చుని సూచించారు. వ్యవసా యానికి తొమ్మిది గంటల విద్యుత్తు సరఫరాకు సంబంధించి విద్యుత్తు చట్టం-2003లోని సెక్షన్ 166 (5) ప్రకారం విద్యుత్తు సరఫరా నాణ్యత, వినియోగదారుల సంతృప్తిని సమీక్షించేందుకు వీలుగా ఏర్పాటు చేసిన జిల్లా కమిటీల నివేదికలు, మినిట్స్‌ను విద్యుత్తు పంపిణీ సంస్థలు తమ వెబ్‌సైట్‌లో పొందుపరచడంతో పాటు వివరాలను ఎపి ఇఆర్‌సికి సమర్పించాలని ఆదేశించినట్లు జస్టిస్ సివి.నాగార్జున రెడ్డి తెలిపారు.

మహిళా సాధికారతే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

ఎంఎల్‌సి షేక్ సాబ్జీ విమర్శించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సిఎం పాల్గొనే సభలో ప్రోటోకాల్ ప్రకారం 58 మందికి ఆహ్వానం పలికారని, ఆహ్వాన కమిటీ తనపేరును 19వ వరుస నెంబరులో ముద్రించిందని తెలిపారు. సభకు హాజరవ్వాలనుకుంటున్న దశలో గృహనిర్బంధం చేయడం అన్యాయ మన్నారు. సభకు ముందు తాము ఆందోళనలకు ఎలాంటి పిలుపు నివ్వలేదని, ప్రభుత్వం ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ ముఖ్యమంత్రికి ఇచ్చేందుకు వినతిపత్రాలు సిద్ధం చేశామని చెప్పారు. సిపిఎస్ రద్దు చేసి పాత పింఛను అమలు చేస్తామన్న హామీని ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, పిఆర్‌సి బకాయిలు రూ.ఐదు వేల కోట్లు వెంటనే విడుదల చేయాలని, డిఎ బకాయిలు రూ.నాలుగు వేల కోట్లు ఇవ్వాలని, సర్వశిక్షా అభియాన్‌లో 14 విభాగాల్లో పని చేస్తున్న 25 వేల మంది ఉద్యోగులకు వేతనాలు పెంచాలని కోరారు. విద్యాశాఖలో ఖాళీగా ఉన్న 50 వేల పోస్టుల్లో 30 వేల పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చి వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కోవిడ్ సమయంలో మృతి చెందిన ఉద్యోగుల పిల్లలకు కారుణ్య నియామకాలు చేపట్టాలని కోరారు. జిఒ-1ని రద్దు చేయాలని, అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సాబ్జీ డిమాండ్ చేశారు.

ప్రజాస్వామ్యంపై దాడి

(మొదటి పేజీ తరువాయి)

లేకుండా ఎందుకు చేస్తున్నావు? ప్రజల ప్రజాస్వామిక గొంతు వినిపించేందుకు, కాపాడేందుకు నేనిక్కడ ఉన్నాను. ప్రతిపక్షాలు ప్రజల దగ్గరకు వెళ్లడం తప్ప మరో మార్గం లేదు' అని స్పష్టం చేశారు.

దేశమంటే అదానీయేనా?

'ప్రధాని ప్రతిపక్షాలకు ఒక గట్టి ఆయుధాన్ని ఇచ్చారు. ప్రధాని చర్యలతో ఆయన చేసిన తప్పు గురించి చర్చ జరుగుతోంది. అదానీ ఒక అవినీతి, అక్రమార్కుడని ప్రజలందరికీ తెలిసిపోయింది. అదానీ గురించి అడిగితే.. దేశంపై దాడి అంటున్నారు. అంటే అదానీయే దేశమని ప్రధాని చెబుతున్నారా?' అని రాహుల్ గాంధీ విమర్శించారు.

'దేశం నాకు ప్రేమ, ఆప్యాయత సహా అన్నీ ఇచ్చింది. దేశం కోసం పోరాడతాను. నేను దేశ న్యాయ వ్యవస్థను గౌరవిస్తాను. నాకు సంఘీభావం, మద్దతు ప్రకటించిన ప్రతిపక్షాలకు కృతజ్ఞతలు. అందరం కలిసికట్టుగా పనిచేద్దాం. నేను పార్లమెంటు సభ్యుడిగా ఉన్నా, లేకున్నా. పార్లమెంటులో ఉన్నా, బయట ఉన్నా.. నన్ను జైల్లో పెట్టినా.. శాశ్వతంగా అనర్హుడిగా ప్రకటించినా సరే.. నా పని నేను చేసుకుంటూనే పోతాను' అని పేర్కొన్నారు. తన పేరు సావర్కర్ కాదని, గాంధీ అని, బిజెపి ఎంపిల డిమాండ్ మేరకు క్షమాపణలు చెప్పే ప్రసక్తే లేదని రాహుల్ స్పష్టం చేశారు. విలేకరుల సమావేశంలో రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రులు అశోక్ గెహ్లాట్, భూపేష్ బఘేలా, కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శులు కెసి వేణుగోపాల్, జైరాం రమేష్ ఉన్నారు.

దక్షిణమధ్య రైల్వే

మమ్మల్ని SCRailwayindia ద్వారా అనుసరించవచ్చు, ద.మ రైల్వేలోని టెండరు ప్రకటనల వివరాలు మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in లో చూడవచ్చు.

ఇ-టెండరు ఆహ్వాన ప్రకటన (http://ireps.gov.in ద్వారా) PUB/0289

భారత రాష్ట్రపతి తరపున, సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్, ట్రాక్షన్ డిస్ట్రిబ్యూషన్, సికింద్రాబాద్ వారు దిగువ పనుల కొరకు, సింగిల్ ప్యాకెట్ సిస్టమ్‌లో టెండరు కోరుచున్నారు.

క్ర.సం.: 01. **నిట్ నం.:** సి/ఇ.29/టిఆర్‌డి/ఎస్‌సి/29/2022-2023. **పని పేరు:** టెండరు నం. సి/ఇ.29/టిఆర్‌డి/ఎస్‌సి/29/2022-2023 తేది: 24.03.2023. ఎన్‌సి డివిజన్-ఎస్‌ఎన్‌ఎఫ్-ఎంఎల్‌వై సెక్షన్- ఆర్‌విఎన్‌ఎల్ ట్రాక్-టిఆర్‌డి మాడిఫికేషన్స్ పై ప్రస్తుత ట్రాక్ యొక్క తాత్కాలిక డైవెర్షన్ మరియు సైటులో కి.మీ.1/4-5 వద్ద కాస్ట్ ద్వారా ఆర్‌సిసి బాక్స్‌తో ప్రస్తుత బ్రిడ్జి నం.2(ఆర్‌యుబి)(స్కెవ్)ను తిరిగి నిర్మించు ప్రతిపాదన. **అంచనా విలువ:** రూ.43,24,104.47. **పూర్తిచేయు కాలవ్యవధి:** 180 రోజులు. **ముగింపు తేది:** 14.04.2023న 15:00గం.లకు.

1) బిడ్ పత్రం మరియు ఇతర వివరాల కొరకు, దయచేసి వెబ్‌సైట్ http://ireps.gov.in కు లాగిన్ చేయండి.
2) టెండరుదారులు ఇ-టెండరింగ్ ద్వారా మాత్రమే పాల్గొనవలెను మరియు మాన్యువల్ ఆఫర్‌లు పరిగణించబడవు.
3) టెండరు ఫారం ధర & ధరావత్తు చెల్లింపులు ఆన్‌లైన్ చెల్లింపుల ద్వారా మాత్రమే చెల్లించవలసిందిగా కోరబడుచున్నది.
4) రైల్వేలు ఏ కారణం చూపకుండానే టెండరును రద్దుచేయు అధికారాలు కలిగియుంటారు.
5) ఆసక్తిగల టెండరుదారులందరు జిఎస్‌టిన్ గుర్తింపు నం.లు పొంది మరియు వారి ఆఫర్లతోపాటు దాఖలుచేయవలసిందిగా కోరబడుచున్నది.
6) టెండరుదారు ఏవేని సవరణ (ఆన్‌లైన్ ద్వారా మాత్రమే జారీచేయబడుతుంది)లను టెండరు దాఖలుచేయు కాలవ్యవధి ప్రారంభ తేది వరకు వీక్షించవచ్చును.

సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్/ టిఆర్‌డి/ సికింద్రాబాద్,

ఇ-టెండరు ప్రకటన నం. 04-2023 తేది: 24.03.2023 PUB/0291

భారత రాష్ట్రపతి తరపున, సీనియర్ డివిజనల్ ఇంజినీర్/ కొ-ఆర్డినేషన్/గుంతకల్ వారు దిగువ పనుల కొరకు ఇ-టెండర్లను ఆహ్వానిస్తున్నారు.

క్ర.సం.1. టెండరు నం.: ఇంజినీరింగ్-జిటిఎల్-సౌత్-1345. **పని వివరణ:** ఆర్‌యూజివై సెక్షన్‌లో 153/8-9 వద్ద పిఎస్‌సి స్లాబ్స్‌తో 8×6.10మీ. ఆర్‌సిసి టి-బీమ్ యొక్క బ్రిడ్జి నం.231డౌన్‌ను మార్చు ప్రతిపాదన. **ప్రకటిత విలువ:** రూ.1,46,74,051.91పై.లు, **ధరావత్తు:** రూ.2,23,400.00పై.లు.

క్ర.సం.2. టెండరు నం.: ఇంజినీరింగ్-జిటిఎల్-కొ-ఆర్డి-1346. **పని వివరణ: ఎస్‌డబ్ల్యు-1:** నార్త్ కాలనీలో ప్రభాత్ నగర్ స్టాఫ్ క్వార్టర్స్ జిటిఎల్/614-621, 1089 నుండి 1092 & 1009 నుండి 1014 మొ॥నగు వాటిలో ఫ్లోరింగ్స్, రూఫ్స్, టాయిలెట్ డోర్స్, కోర్టు యార్డు డోర్స్, డ్రైన్ ఇనిస్పెక్షన్ చాంబర్స్ మొ॥వాటికి మరమ్మత్తులు. **ఎస్‌డబ్ల్యు-2:** నార్త్ కాలనీలో అధికారుల క్వార్టర్స్ జిటిఎల్/1069, 1132 నుండి 1138, 1158 నుండి 1162 లో ఫ్లోరింగ్స్, రూఫ్స్, టాయిలెట్ డోర్స్, సానిటరీ ఫిట్టింగ్స్‌కు మరమ్మత్తులు. **ప్రకటిత విలువ:** రూ.1,12,96,992.08పై.లు, **ధరావత్తు:** రూ.2,06,500.00పై.లు.

క్ర.సం.3. టెండరు నం.: ఇంజినీరింగ్-జిటిఎల్-నార్త్-1347. **పని వివరణ:** గుంతకల్-వాడి సెక్షన్-యాంత్రిక పద్దతిన (1,20,000 క్యూమ్)(రెండు ప్యాకెట్ల విధానం)ద్వారా హాపర్స్/ట్రాఫిక్ బలాస్ట్ వ్యాగన్స్‌లోకి దానిని లోడింగ్‌చేయుట మరియు రాయిచూర్ డిపో వద్ద 50ఎంఎం గేజ్ హార్డ్& డ్యూరబుల్ మిషన్ క్రష్డ్ స్టోన్ బలాస్ట్ సరఫరా& నిలువచేయుట. **ప్రకటిత విలువ:** రూ.12,64,94,400.00పై.లు, **ధరావత్తు:** రూ.7,82,500.00పై.లు.

క్ర.సం.4. టెండరు నం.: ఇంజినీరింగ్-జిటిఎల్-వెస్ట్-1348. **పని వివరణ:** సిఆర్‌ఎస్/టిపిటివై: మెకానికల్ వర్క్‌షాపుల మానుఫాక్చరింగ్ కృపాసిటీ & మెయింటెనన్స్ యొక్క ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ & ఆగ్మెంటేషన్‌లో అప్‌గ్రేడేషన్/ ఇంప్రూవ్‌మెంట్స్‌తో సంబంధించిన ఫియాట్ బోగీ షాట్ బ్లాసింగ్ ప్లాంట్ కొరకు కవర్డ్ అకామెడేషన్. **ప్రకటిత విలువ:** రూ.62,40,010.67పై.లు, **ధరావత్తు:** రూ.1,24,800.00పై.లు.

క్ర.సం.5. టెండరు నం.: ఇంజినీరింగ్-జిటిఎల్-సౌత్-1349. **పని వివరణ: గుంతకల్: ఎస్‌డబ్ల్యు-1:** వైపాఎన్‌డిఎల్ సెక్షన్‌లో జెఎండిజిపిఆర్‌డిటి మధ్య కి.మీ.95/1-2 వద్ద బ్రిడ్జి నం.414/ఎ వద్ద డ్రైనేజి అరేంజిమెంట్స్‌కు ప్రతిపాదిత అభివృద్ధి. **ఎస్‌డబ్ల్యు-2:** వైపాఎన్‌డిఎల్ సెక్షన్‌లో జెఎండిజిపిఆర్‌డిటి మధ్య కి.మీ.95/6-7 వద్ద బ్రిడ్జి నం.418/ఎ వద్ద డ్రైనేజి అరేంజిమెంట్స్‌కు ప్రతిపాదిత అభివృద్ధి. **ఎస్‌డబ్ల్యు3:** వైపాఎన్‌డిఎల్ సెక్షన్‌లో జెఎండిజిపిఆర్‌డిటి మధ్య కి.మీ.96/8-9 వద్ద బ్రిడ్జి నం.419/ఎ (ఆర్‌యుబి) వద్ద డ్రైనేజి అరేంజిమెంట్స్‌కు ప్రతిపాదిత అభివృద్ధి. **ఎస్‌డబ్ల్యు-4:** వైపాఎన్‌డిఎల్ సెక్షన్‌లో జెఎండిజి-పిఆర్‌డిటి మధ్య కి.మీ.97/5-6 వద్ద బ్రిడ్జి నం.424/ఎ(ఆర్‌యుబి) వద్ద డ్రైనేజి అరేంజిమెంట్స్‌కు ప్రతిపాదిత అభివృద్ధి. **ఎస్‌డబ్ల్యు-5:** వైపాఎన్‌డిఎల్ సెక్షన్‌లో జెఎండిజి-పిఆర్‌డిటి మధ్య కి.మీ.98/6-7 వద్ద బ్రిడ్జి నం.431/ఎ (ఆర్‌యుబి) వద్ద డ్రైనేజి అరేంజిమెంట్స్‌కు ప్రతిపాదిత అభివృద్ధి. **ప్రకటిత విలువ:** రూ.5,30,09,223.14పై.లు, **ధరావత్తు:** రూ.4,15,100.00పై.లు.

క్ర.సం.6. టెండరు నం.: ఇంజినీరింగ్-జిటిఎల్-సౌత్-1350. **పని వివరణ: గుంతకల్: ఎస్‌డబ్ల్యు-1:** వైపాఎన్‌డిఎల్ సెక్షన్‌లో జెఎండిజి-పిఆర్‌డిటి మధ్య కి.మీ.100/5-6 వద్ద బ్రిడ్జి నం.439/ఎ(ఆర్‌యుబి) వద్ద డ్రైనేజి అరేంజిమెంట్స్‌కు ప్రతిపాదిత అభివృద్ధి. **ఎస్‌డబ్ల్యు-2:** వైపాఎన్‌డిఎల్ సెక్షన్‌లో జెఎండిజి-పిఆర్‌డిటి మధ్య కి.మీ.104/4-5 వద్ద బ్రిడ్జి నం.457/ఎ& బి (ఆర్‌యుబి) వద్ద డ్రైనేజి అరేంజిమెంట్స్‌కు ప్రతిపాదిత అభివృద్ధి. **ఎస్‌డబ్ల్యు-3:** వైపాఎన్‌డిఎల్ సెక్షన్‌లో జెఎండిజి-పిఆర్‌డిటి మధ్య కి.మీ.105/5-6 వద్ద బ్రిడ్జి నం.461/ఎ& బి (ఆర్‌యుబి) వద్ద డ్రైనేజి అరేంజిమెంట్స్‌కు ప్రతిపాదిత అభివృద్ధి. **ఎస్‌డబ్ల్యు-4:** వైపాఎన్‌డిఎల్ సెక్షన్‌లో జెఎండిజిపిఆర్‌డిటి మధ్య కి.మీ.106/0-1 వద్ద బ్రిడ్జి నం.464/ఎ& బి(ఆర్‌యుబి) వద్ద డ్రైనేజి అరేంజిమెంట్స్‌కు ప్రతిపాదిత అభివృద్ధి. **ఎస్‌డబ్ల్యు-5:** వైపాఎన్‌డిఎల్ సెక్షన్‌లో జెఎండిజి-పిఆర్‌డిటి మధ్య కి.మీ.106/8-9 వద్ద బ్రిడ్జి నం.467/ఎ& బి (ఆర్‌యుబి) వద్ద డ్రైనేజి అరేంజిమెంట్స్‌కు ప్రతిపాదిత అభివృద్ధి. **ప్రకటిత విలువ:** రూ.5,28,75,893.60పై.లు, **ధరావత్తు:** రూ.4,14,400.00పై.లు.

క్ర.సం.7. టెండరు నం.: ఇంజినీరింగ్-జిటిఎల్-సౌత్-1351. **పని వివరణ: గుంతకల్: ఎస్‌డబ్ల్యు-1:** వైపాఎన్‌డిఎల్ సెక్షన్‌లో జెఎండిజి-పిఆర్‌డిటి మధ్య కి.మీ.107/3-4 వద్ద బ్రిడ్జి నం.468/ఎ (ఆర్‌యుబి) వద్ద డ్రైనేజి అరేంజిమెంట్స్‌కు ప్రతిపాదిత అభివృద్ధి. **ఎస్‌డబ్ల్యు-2:** వైపాఎన్‌డిఎల్ సెక్షన్‌లో వైపాపిఆర్‌డిటి మధ్య కి.మీ.116/1-2 వద్ద బ్రిడ్జి నం.497/ఎ (ఆర్‌యుబి) వద్ద డ్రైనేజి అరేంజిమెంట్స్‌కు ప్రతిపాదిత అభివృద్ధి. **ఎస్‌డబ్ల్యు-3:** వైపాఎన్‌డిఎల్ సెక్షన్‌లో వైపాపిఆర్‌డిటి మధ్య కి.మీ.116/7-8 వద్ద బ్రిడ్జి నం.497-బి (ఆర్‌యుబి) వద్ద డ్రైనేజి అరేంజిమెంట్స్‌కు ప్రతిపాదిత అభివృద్ధి. **ఎస్‌డబ్ల్యు-4:** వైపాఎన్‌డిఎల్ సెక్షన్‌లో వైపాపిఆర్‌డిటి మధ్య కి.మీ.120/4-5 వద్ద బ్రిడ్జి నం.503/ఎ వద్ద డ్రైనేజి అరేంజిమెంట్స్‌కు ప్రతిపాదిత అభివృద్ధి. **ప్రకటిత విలువ:** రూ.4,28,53,178.78పై.లు, **ధరావత్తు:** రూ.3,64,300.00పై.లు.

ముగింపు తేది& సమయం: 18.04.2023న 15:00గం.లు

బిడ్ పత్రం మరియు ఇతర వివరాల కొరకు http://ireps.gov.in ను లాగిన్ చేయండి. ఏవేని సవరణ ఆన్‌లైన్ ద్వారా మాత్రమే జారీచేయబడుతాయి.

డివిజనల్ రైల్వే మేనేజర్ (వర్క్స్), గుంతకల్.

ఇ-టెండరు నం. డిప్యూటీ.సిఇ-జిఎస్-బిజడ్‌పా04-2023 తేది 23.03.2023 నాటి ఆహ్వానపు టెండరు ప్రకటన (ireps.gov.in ద్వారా) PUB/0292

భారత రాష్ట్రపతి తరపున, డిప్యూటీ చీఫ్ ఇంజినీర్ గాటి శక్తి, దక్షిణ మధ్యరైల్వే, విజయవాడ వారు బహిరంగ టెండరు/ సింగిల్ ప్యాకెట్ విధానంలో దిగువ పనుల కొరకు ఇ-టెండరును ఆహ్వానిస్తున్నారు.

క్ర.సం.1. టెండరు నం.: డిప్యూటీ సిఇ-జిఎస్-బిజడ్‌పా04-2023 తేది: 21.03.2023. **పని పేరు:** ఎస్‌డబ్ల్యు-1: బిజడ్‌ఎ డివిజన్- విజయవాడ-ప్రతిపాదిత 3 నం.ల ఎస్కలేటర్స్ ప్లాట్‌ఫారాలు నం.లు 2&3,6&7. ఐఆర్‌పిఎస్‌ఎం. ఐ.డి.నం.11.06.53.22.1.55.002, ఎస్‌డబ్ల్యు2: బిజడ్‌ఎ డివిజన్ గూడూరూ ప్రతిపాదిత 2నం.ల ఎస్కలేటర్స్ ప్లాట్‌ఫారాలు నం.లు 1,2&3 ఐఆర్‌పిఎస్‌ఎం.ఐ.డి.నం.11.06.53.22.3.55.014. **టెండరు విలువ:** రూ.2,07,83,205.94పై.లు, **ధరావత్తు:** రూ.2,53,900/- **పూర్తిచేయు కాలవ్యవధి:** (9) తొమ్మిది నెలలు. **టెండరు ఫారం ధర:** రూ. నిల్. **ముగింపు తేది& సమయం:** 12.04.2023న 15.00గం.లకు.

1. బిడ్ పత్రం మరియు ఇతర వివరాల కొరకు, దయచేసి వెబ్‌సైట్ https://ireps.gov.in ను లాగిన్‌చేయండి.
2. **ధరావత్తు డిపాజిట్ మరియు టెండరు పత్రం ధర చెల్లింపులును ఐఆర్‌ఇపిఎస్ లో అందుబాటులోగల ఆన్‌లైన్ నెట్ బ్యాంకింగ్/గేట్‌వే చెల్లింపు సదుపాయాల ద్వారా మాత్రమే చేయవలెను.**
3. టెండరుదారులు వారి ఆఫర్లను ఆన్‌లైన్ ద్వారా టెండరు దాఖలు/బిడ్డింగ్ కాలవ్యవధిలోగా ఏదైతే టెండరు ముగింపుకు పదిహేను రోజుల కాలవ్యవధికి ముందు దాఖలుచేయవలెను.
4. టెండరుదారులు ఏవేని సవరణ (ఆన్‌లైన్ ద్వారా మాత్రమే జారీచేయబడుతాయి)ను టెండరు దాఖలు/బిడ్డింగ్ కాలవ్యవధి ప్రారంభ తేదీ వరకు వీక్షించవచ్చును.

డిప్యూటీ చీఫ్ ఇంజినీర్, గాటి శక్తి, విజయవాడ.

టెండరు ప్రకటన నం.: జి/ఇ.29/టిఆర్./ టెండరు ప్రకటన/23/2022-23, తేది: 24.03.2023. PUB/0293

భారత రాష్ట్రపతి తరపున, సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్/ట్రాక్షన్/గుంతకల్ వారు దిగువ పనుల కొరకు ఇ-టెండర్లను ఆహ్వానిస్తున్నారు.

క్ర.సం.1. టెండరు నం: జిటిఎల్-టిఆర్‌డి-29-ఇటిఎన్-44-2022-23. **పని పేరు:** గుంతకల్ డివిజన్-ప్రస్తుత ఆంకర్ లూప్స్‌ను ఆధునీకరించుట. **సుమారు విలువ:** రూ.1,03,90,572/- **ధరావత్తు:** రూ.2,02,000/-

క్ర.సం.2. టెండరు నం: జిటిఎల్-టిఆర్‌డి-29-ఇటిఎన్-45-2022-23. **పని పేరు:** గుంతకల్ డివిజన్-స్విచ్చింగ్ స్టేషన్లంటి వద్ద ఎర్తింగ్ సిస్టమ్ యొక్క ఆగ్మెంటేషన్. **సుమారు విలువ:** రూ.67,59,517/- **ధరావత్తు:** రూ.1,35,200/

ముగింపు తేది& సమయం: 17.04.2023న 11:0గం.లకు.

గమనిక: 1. టెండరుదారులు టెండరు పత్రంను ఉచితంగా www.ireps.gov.in నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును.
టెండరు బిడ్డింగ్ మరియు ఇతర వివరాల కొరకు http://www.ireps.gov.in ను లాగిన్ చేయండి. ఏవేని సవరణ ఆన్‌లైన్ ద్వారా మాత్రమే జారీచేయబడుతాయి.

సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్, ట్రాక్షన్, గుంతకల్.

టెండరు ప్రకటన నం. 1/2023/ఎస్‌టిబిఎ/ జిఎన్‌టి తేది: 23.03.2023 గుతంకల్ డివిజన్ పై స్టేషన్ టికెట్ బుకింగ్ ఏజెంట్స్‌ను నియమించుట PUB/0294

భారత రాష్ట్రపతి తరపున, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్, గుంతకల్ డివిజన్, దక్షిణ మధ్య రైల్వే వారు కమీషన్ ప్రాతిపదికన రిజర్వు కాని టికెటింగ్ సిస్టమ్ (యుటిఎస్) ద్వారా రిజర్వు కాని టికెట్స్ జారీచేయుట కొరకు దక్షిణ మధ్య రైల్వే యొక్క గుంటూరు డివిజన్ పై మూడు సంవత్సరాల కాలవ్యవధి కొరకు **"పెరెచర్ల, కురిచెడు, చిట్యాల, గాజులపల్లి, పెదకురపాడు & తార్లుపాడు"** యొక్క ఎన్‌ఎస్‌జి- 6 క్యాటగరీ స్టేషన్ల వద్ద స్టేషన్ టికెట్ బుకింగ్ ఏజెంట్స్ (ఎస్‌టిబిఎ) అవార్డు చేయుట కొరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. వివరాలు దిగువ ఇవ్వబడినవి.

పని వివరణ: కమీషన్ ప్రాతిపదికన స్టేషన్ టికెట్ బుకింగ్ ఏజెంట్స్ (ఎస్‌టిబిఎస్‌లు)ల నియామకం. **స్టేషన్ పేరు& క్యాటగరీ:** 1. పెరెచెర్ల (ఎన్‌ఎస్‌జి-6) 2. కూరిచేడు (ఎన్‌ఎస్‌జి-6) 3. చిట్యాల (ఎన్‌ఎస్‌జి-6) 4. గాజులపల్లి (ఎన్‌ఎస్‌జి-6) 5. పెద్దకురపాడు (ఎన్‌ఎస్‌జి-6) & 6. తర్లూపాడు (ఎన్‌ఎస్‌జి-6). **టెండరు కాలవ్యవధి:** మూడు సంవత్సరాలు. **ధరావత్తు డిపాజిట్:** రూ.2,000/- **టెండరు ఫారం ధర: 27.04.2023**న 15.00గం.ల వరకు.

ముఖ్యమైన తేదీలు:
టెండరు పెట్టెలో టెండరు ఫారాలు దాఖలుచేయు తేది& సమయం: 27.03.2023న 10.00గం.ల నుండి.
టెండరు పెట్టె ముగించు తేది& సమయం: 27.04.2023న 15.00గం.లు
టెండరు పెట్టె తెరుచు తేది& సమయం: 27.04.2023న 15.30గం.లా **టెండరు ఫారాల దాఖలు:** టెండరుదారులు టెండరు ఫారంను పైన పెద్ద అక్షరాలలో " టెండర్స్ ఫర్ అపాయింట్‌మెంట్ ఆఫ్ స్టేషన్ టికెట్ బుకింగ్ ఏజెంట్" అని వ్రాసి స్టేషన్ వద్ద దాఖలుచేయవచ్చును.

సీల్డు టెండరు ఫారాలను ధరావత్తుతోపాటు సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్, రైల్‌వికాస్ భవన్, 2వ అంతస్తు, పట్టాభిపురం, గుంటూరు వారి కార్యాయలంలో ఉంచబడిన సీల్డు టెండరు పెట్టెలో వేయవలెను.

పై విధంగా లేని టెండర్లు ఏ కారణంచూపకుండానే ఏదేని లేదా ప్రతి టెండరును తిరస్కరించు అధికారాలు రైల్వే పరిపాలనా విభాగం కలిగియుంటుంది. వారిదే తుది నిర్ణయం.

తదుపరి వివరాల కొరకు, దయచేసి ఏదేని పనిదినమున క్రింది సంతకందారు కార్యాయలంను సంప్రదించవచ్చును.

దరఖాస్తు ఫారం, అర్హతా నియమావళి మరియు ఇతర వివరాలను వెబ్‌సైట్ www.scrailway.tenders.gov.in నుండి డౌన్‌లోడ్‌చేసుకోవచ్చును.

A0406 **సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్/ గుంటూరు**

తదుపరి టెండరు నిబంధనలు/ వివరాల కొరకు మరియు టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్ కొరకు వెబ్‌సైటు https://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in వద్ద దర్శించండి

IN THE COURT OF THE V ADDL., DISTRICT JUDGE AT VIJAYAWADA.
EP No.: 2674/2019
In
AC No. 669/2013

Between:
M/s. Shriram City Union Finance Ltd., Machilipatnam Branch ... DHR
And
Savaram Rama Krishna & 2 Others ..JDR's

JDR No:2: Savaram Ramanjaneyulu, S/o. Koteswara Rao, D.No.40-9/4-16, Municipal Employee Colony, Vijayawada.
JDR No.3 Simhachalam Reddy, S/o. Bhimaiah, D.No.7-68-1, Katuru Road, Vuyyuru, Krishna Dist.

పై నెంబరు E.P.లో 2 మరియు 3వ JDR's నకు Order 21 Rule 22 Notice పేపరు ద్వారా నోటీసులు జారీ చేయవలసిందిగా పై కోర్టువారు ఆర్డరు వేస్తూ ది.03.04.2023వ తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు 2వ మరియు 3వ JDR's కి స్వయంగా గానీ, అడ్వకేటు ద్వారా గానీ హాజరై ఆక్షేపణలు వున్న యెడల తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
కొటారి శ్రీనివాసరావు
DHR తరపు అడ్వకేటు
విజయవాడ

విజయవాడ
25-03-2023

HDB FINANCIAL SERVICES
హెచ్‌డిబి ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్
నమోదిత కార్యాలయం: రాధిక, 2వ అంతస్తు, లా గార్డెన్ రోడ్, నవ్‌రంగ్‌పుర, అహ్మదాబాద్-09.
శాఖ కార్యాలయం: #76-8-10/1, ఫ్లాట్ నెం.4, భవానీ టవర్స్, స్వాతి ట్రైట్రీ రోడ్డు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెనుక, భవానీపురం, విజయవాడ-520012.

అనుబంధం IV స్వాధీనత నోటీసు
(రూల్ 8(1) చూచుట) (స్థిరాస్తి కొరకు)

ఏదైతే, మెస్సర్స్ హెచ్‌డిబి ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ యొక్క ఆధీకృత అధికారైన దిగువసంతకందారుడు, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ యాక్ట్, 2002 క్రింద మరియు యొక్క సెక్షన్ 13(12) (3) & ఆర్/డబ్ల్యూ రూల్ 8 & 9 సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 నిబంధనల ప్రకారం, 16.01.2023 తేదీన డిమాండ్ నోటీసు జారీ చేయబడింది. లోను ఎ/సి నంలు.7392238, పిలువబడిన దరఖాస్తుదారుడు/సహ-దరఖాస్తుదారులు/హామీదారులు, 1. నాగ సింధు స్పిన్నింగ్ అండ్ గిన్నింగ్ మిల్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఎస్.నం.1079/2, మెయిన్ రోడ్డు, కృష్ణారావుపాలెం, మైలవరం, విజయవాడ-52122, ఆంధ్రప్రదేశ్, మరియు ఇక్కడ కూడా: డో.నం.234, 235, 236 (డాక్యుమెంట్ ప్రకారం) 234, 235, 236-1-63-68ఎ, రెండు రామ మందిరాల వీధి, రెవెన్యూ వార్డు నం.8, మంగళగిరి, గుంటూరు-522503. 2. కంద్రు ప్రమీళ, 8-68ఎ, కంద్రు వారి వీధి, రెండు రామ మందిరాల వీధి, చర్చి వద్ద, గుంటూరు-522503. ఆంధ్రప్రదేశ్. 3. కంద్రు లక్ష్మి, 8-68ఎ, కంద్రు వారి వీధి, రెండు రామ మందిరాల వీధి, మంగళగిరి, గుంటూరు-522503, ఆంధ్రప్రదేశ్. 4. వెంకట నాగ మల్లేశ్వరరావు కంద్రు, 8-68ఎ, కంద్రు వారి వీధి, రెండు రామ మందిరాల వీధి, మంగళగిరి, గుంటూరు-522503. ఆంధ్రప్రదేశ్. 5. కంద్రు సత్యనారాయణ, 8-68ఎ, కంద్రు వారి వీధి, రెండు రామ మందిరాల వీధి, మంగళగిరి, గుంటూరు-522503. ఆంధ్రప్రదేశ్. 6. కంద్రు నాగమల్లేశ్వరమ్మ, డో.నం.8-68ఎ, కంద్రు వారి వీధి, రెండు రామ మందిరాల వీధి, మంగళగిరి, గుంటూరు-522503. ఆంధ్రప్రదేశ్. 7. కంద్రు శంకరరావు, డో.నం.8-68ఎ, కంద్రు వారి వీధి, రెండు రామ మందిరాల వీధి, మంగళగిరి, గుంటూరు-522503. ఆంధ్రప్రదేశ్, నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని చెల్లించడానికి రూ॥ 5,12,93,411/- (ఐదు కోట్ల పన్నెండు లక్షల తొంభై మూడు వేల నాలుగు వందల పదకొండు రూపాయలు మాత్రమే) 16.01.2023 నాటికి పేర్కొన్న నోటీసు అందిన తేదీ నుండి 60 రోజులలోపు చెల్లించాలని సదరు నోటీసులో పేర్కొనడం జరిగింది.

దరఖాస్తుదారుడు/సహ-దరఖాస్తుదారులు/హామీదారుడు, మొత్తాన్ని తిరిగిచెల్లించుటలో విఫలమైనారు, దరఖాస్తుదారుడు/సహ-దరఖాస్తుదారులు/హామీదారుడు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమేమనగా ఆర్/డబ్ల్యూ రూల్ 8 మరియు 9 చదువుతూ సదరు చట్టం సెక్షన్ 13(4) క్రింద అతని అధికారాలను నిర్ణయించి అధ్యాయనం చేస్తూ దిగువ వివరించిన ఆస్థిని 24 మార్చి, 2023 వ తేదీన దిగువసంతకందారుడు స్వాధీనపరుచుకున్నాడు.

ముఖ్యంగా దరఖాస్తుదారుడు/సహ-దరఖాస్తుదారులు/హామీదారుడు మరియు సాధారణ ప్రజానీకాన్ని హెచ్చరించడమేమనగా సదరు ఆస్థితో ఎలాంటి లావాదేవీలు జరుపరాదు మరియు ఏవైనా లావాదేవీలు మెస్సర్స్ హెచ్‌డిబి ఫైనాన్సియల్స్ లిమిటెడ్‌కు 16.01.2023 నాటికి రూ. 5,12,93,411/- (ఐదు కోట్ల పన్నెండు లక్షల తొంభై మూడు వేల నాలుగు వందల పదకొండు రూపాయలు మాత్రమే) మరియు దానిపిమ్మట వడ్డీ చెల్లించి జరుపవచ్చు.

దరఖాస్తుదారుడు/సహ-దరఖాస్తుదారులు/హామీదారుడు జాగ్రత్త వహించవల్సింది ఏమనగా సెక్యూర్డ్ అస్సెట్స్‌ను విడిపించుకొనుటకు మీకు లభించిన సమయం మేరకు చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) నిబంధనలను అహ్వానించడమైనది.

సెక్యూరిటీల యొక్క షెడ్యూల్:1

అంశం నం.1 : డాక్ నం.7484/2011-గుంటూరు జిల్లా, మంగళగిరి సబ్ రిజిస్ట్రీ, మంగళగిరి మున్సిపల్ ఏరియా, మంగళగిరి వద్ద ఉన్న ఆస్తి సైట్ డో.నం.234, 235, 236 లో కొలిచే 57.66 చ.గ.లు.,మున్సిపల్ వార్డు నం.8, బేరింగ్ డో.నం.8-69 ఉన్న హద్దులు: ఉత్తరం: వెనిగళ్ల వీర రాఘవులు యొక్క ఆస్తి, దక్షిణం: కంద్రు శంకరరావు యొక్క ఆస్తి, తూర్పు: మున్సిపల్ రోడ్డు, పడమర: జొన్నడుల భాస్కరరావు యొక్క ఆస్తి.

సెక్యూరిటీల యొక్క షెడ్యూల్: 2

అంశం నం.2: డాక్.నం.786/1996 : గుంటూరు జిల్లా, మంగళగిరి సబ్ రిజిస్ట్రీ, మంగళగిరి మున్సిపల్ ఏరియా, మంగళగిరి వద్ద ఉన్న ఆస్తి సైట్ డో.నం.234, 3235, 236-1 (తేది: 24.04.2019న మండల సర్వేయర్, మంగళగిరి ద్వారా జారీ చేయబడిన ఆమోదం ప్రకారం) కొలిచే 294.3 చ.గ.లు. మున్సిపల్ వార్డు నం.8, బేరింగ్ డో.నం.8-69 ఉన్న హద్దులు: ఉత్తరం: విక్రేత యొక్క ఆస్తి కొంత మేరకు మరియు కె. వీరాంజమ్మ యొక్క ఆస్తి కొంత మేరకు 78.0 అడుగులు., దక్షిణం: కంద్రు శంకర యొక్క ఆస్తి దామర్ల వెంకట సుబ్బమ్మ యొక్క ఆస్తి 79.0 అడుగులు., తూర్పు: మున్సిపల్ బజార్ 31.0 అడుగులు., పడమర: దామర్ల వెంకట సుబ్బమ్మ యొక్క ఆస్తి 36.6 అడుగులు.

తేది: 24.03.2023,
ప్రదేశం : మంగళగిరి

సం/- ఆధీకృత అధికారి
హెచ్‌డిబి ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్.

మీకోసం

నాన్‌స్టిక్ పాన్ బాగా నల్లగా మారినప్పుడు గుడ్డు పెంకులను మిక్సీ జార్‌లో పొడి చేసుకుని దానిపై పూయాలి. ఈ పొడి మీద డిటర్జెంట్ నీళ్లు పోసి పదినిమిషాల తరువాత రుద్దితే పాన్ తెల్లగా మారుతుంది.

జీవన సౌరభం

ప్రపంచంలో అసహ్యమైన విషయం ఏమిటంటే జ్ఞానం పట్ల విముఖత చూపే అవివేకం.

బుజ్జి కుందేలు



అడవిలో ఒక బుజ్జి కుందేలు ఉంది. అది అన్ని జంతువులతోనూ స్నేహంగా ఉండేది. వాటిని చూసుకుని ఎంతో గర్వపడేది. ఒక రోజు కొన్ని వేటకుక్కలు కుందేలును తరమసాగాయి. అది చాలా భయపడింది. వెంటనే తన స్నేహితులైన ఇతర జంతువులను సాయం అడిగి ఆపద నుంచి బయటపడాలనుకుంది.

మొదట ఎదురైన దుప్పి దగ్గరకు పరుగెత్తి 'మిత్రమా, కొన్ని వేటకుక్కలు నాపై దాడికి ఇటు వైపే వస్తున్నాయి. నీ వాడి కొమ్ములతో అవి వెనక్కి పారిపోయేలా చెయ్యి' అని అడిగింది కుందేలు.

అందుకు దుప్పి 'నిజమే! నేను చేయగలను. కానీ ఇప్పుడు పనిలో ఉన్నాను. తీరిక లేదు' అని అంది. బుజ్జి కుందేలు మెల్లగా అక్కడి నుంచి బయలుదేరి ఎలుగుబంటి దగ్గరకు పరిగెత్తింది. ' నేస్తమా..! నువ్వు అందరిలోకి బలశాలివి. నా వెనక వస్తున్న వేటకుక్కలను తరిమేసి నన్ను కాపాడు' అని ప్రాధేయపడింది.

'నన్ను క్షమించు. నేనిప్పుడు చాలా అలసిపోయాను. పైగా ఆకలి కూడా వేస్తోంది. ఆహారం వెతుక్కోవాలి. నీకు సహాయం చేయలేను" అంటూ ముందుకు వెళ్ళిపోయింది ఎలుగుబంటి. చేసేది లేక బుజ్జి కుందేలు దిగులుతో కోతి దగ్గరకు వెళ్ళింది. కాపాడమని అడిగింది. 'అమ్మో ...! నేనా? ఆ కుక్కలు నీతో పాటు నన్ను కూడా పీకేస్తాయి. నా వల్ల కాదు' అని పరిగెత్తింది కోతి.

వరసగా ఎదురైన ఏనుగు, జింకల సహాయమూ కోరింది. కానీ ఏ ఒక్కటి కుందేలును కాపాడే ప్రయత్నం చేయలేదు. దాంతో ప్రాణ భయంతో మరింత కంగారు పడింది కుందేలు. వేటకుక్కల బారి నుండి ఎలా తప్పించుకోవాలో ఆలోచిస్తూ దట్టమైన పొదలోకి దూరింది.

కాసేపటికి వేటకుక్కలు వెతికి వెళ్ళిపోయాయి. ఆ సంఘటనతో కుందేలు ఒక గుణపాఠం నేర్చుకుంది. 'తనను తాను రక్షించుకోవడానికి తన వంతు ప్రయత్నం చేయకుండా ఇతరులపై ఆధారపడకూడదని తెలుసుకుంది.

- కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి
94415 61655



లెక్క తేల్చండి

చిన్నారులూ... ఇక్కడున్న పట్టికలో రకరకాల బొమ్మలున్నాయి. వాటిని నెంబర్లు గా గుర్తించి గణించాము. చివరి లైన్లో ఉన్న బొమ్మల అంకెల ఆధారంగా మీరు జవాబు రాబట్టండి.

జవాబు : 46

నేను గీసిన బొమ్మ

- సి.ధరణి,
3వ తరగతి,
పెన్నలపాడు ప్రాథమిక పాఠశాల,
తొట్టంబేడు మండలం,
తిరుపతి జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఆమె సంఘర్షణ ఎంతోమందికి బతుకునిస్తోంది..

'నాతో పాటు ఆడుకుంటున్న నా ఈడు పిల్లలంతా ఒక్కొక్కరిగా అదృశ్యమైపోతున్నారు. కారణం తెలియడం లేదు.. ఎవరిని అడిగినా సమాధానం చెప్పడం లేదు. వారంతా ఎక్కడికి వెళుతున్నారు? ఎందుకు వెళుతున్నారు? ఈ ప్రశ్నలు నన్ను 15 ఏళ్ల క్రితం బాగా వేధించాయి అంటున్న పల్లవి ఘోష్ (32) తన జీవితంలో ఎదురైన ప్రశ్నలకు సమాధానాలు కనుగొనే ప్రయత్నంలో ఆ పిల్లల ఆచూకీ కనిపెట్టడం, వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేయడంలో తీరిక లేకుండా శ్రమిస్తున్నారు. ఇప్పటివరకు అదృశ్యమైపోయిన 10 వేల మంది పిల్లలను స్వస్థలాలకు చేర్చడం బట్టే ఆమె కృషి ఎంతుందో అర్థం చేసుకోవచ్చు. తోటి పిల్లల ఆచూకీ కోసం మొదలుపెట్టిన ఆమె ప్రయాణంలో విజయాలే కాక ఎన్నో అవరోధాలూ ఉన్నాయి. అందుకే 'నా ప్రయాణంలో ముళ్లున్నాయి.. పువ్వులున్నాయి' అంటారు నవ్వుతూ..

పల్లవి పుట్టి పెరిగింది అస్సాం లుండింగ్ ప్రాంతం. కలకత్తాలో వుండే మేనమామ ఇంటికి తరచూ వెళ్లి వస్తుండేది. అప్పుడే ఆ ప్రాంతంలో ఆడపిల్లల అదృశ్యమవ్వడం ఆమె గమనించింది. 'మొదట్లో అంతగా పట్టించుకోని నన్ను ఒక సంఘటన బాగా ప్రభావితం చేసింది. ఒకరోజు కలకత్తా 24 పరగణా ప్రాంతంలో ఓ మధ్య వయస్సు వ్యక్తి బిగ్గరగా అరుస్తూ రోడ్డు వెంబడి పరుగెడుతున్నాడు. తన కూతురు కనిపించడం లేదని అతను చెప్పాడు. నాకు చాలా ఆశ్చర్యం వేసింది. ఆమె ఎలా అదృశ్యమైంది? ఎవరు తీసుకెళ్లారు? అని అతణ్ణి అడిగా.. అతను సమాధానం చెప్పలేదు. ఏడుస్తూ వెళ్లిపోయాడు. ఆ సంఘటన జరిగినప్పుడు నా వయస్సు 12 ఏళ్లు.. 20 ఏళ్లయినా ఆ దృశ్యం ఇప్పటికీ నా కళ్ల ముందు కదలాడుతూనే ఉంది' అంటూ ఆనాటి సంఘటన గుర్తుచేసుకున్నారు.

'కళ్లు మూసి తెరిసే లోపే మాయమై పోయేవారు. కూతురు పోగొట్టుకున్న ఆ వ్యక్తి నా ముందు నుండి వెళ్లిపోతున్నప్పుడు ఆ వీధిలో చాలామంది ఉన్నారు. కానీ అదేదో మామూలు విషయమైనట్లు అసలు పట్టించుకోకుండా ఉన్నారు. పైగా 'ఒక వ్యక్తి యమహా బైక్‌పై వస్తాడు.. ఆ అమ్మాయిలను తనతో తీసుకెళతాడు.. ఇదంతా మామూలే కదా. ఎందుకంత గోల పెడుతున్నాడు' అంటూ నా ముందున్న వ్యక్తి మాట్లాడడం నాకు చాలా ఆశ్చర్యం వేసింది. పైగా ఆ పిల్లల ఆచూకీ కోసం వారి తల్లిదండ్రులు ఎందుకు వెతకడం లేదు? ఏడుస్తూ కూర్చుంటే తప్పిపోయిన పిల్ల ఎలా వస్తుంది? అసలైనా ఈ పిల్లలను ఎక్కడికి తీసుకెళు న్నారు? అలా వెళ్లిన వారు ఇంటికి తిరిగివచ్చారా? వంటి ప్రశ్నలు నేను తిరిగి ఇంటికి వచ్చాక కూడా నన్ను వెంటాడాయి.

నేను 11వ క్లాసు చదివేటప్పుడు మళ్లీ కలకత్తా వెళ్లాను. అప్పుడు కూడా ఇదే పరిస్థితి. ఈసారి ధైర్యం చేసి ఆ పిల్లల కుటుంబాలను కలిశాను. ఎవ్వరూ నోరు విప్పలేదు. అయినా నేను వెనుకడుగు వేయలేదు. పిల్లల ఆచూకీ కోసం రైల్వే స్టేషనుకు వెళ్లాను. అక్కడ.. బెంగాలీ మాట్లాడే వారే కాక హిందీ, రాజస్థానీ, మరాఠీ మాట్లాడుతున్న పిల్లలను చూశాను. వారంతా మానవ అక్రమ రవాణాకు గురై ఇంటిపనివారిగా, సెక్స్ వర్కర్లుగా మారబోతున్న చిన్నారులని తెలిసినప్పుడు ఎంతో బాధేసింది. ఎందుకు మీరంతా ఇలా వచ్చేస్తున్నారని వాళ్లని అడిగాను. 'మా భవిష్యత్తు బాగుంటుందని చెప్పి ఇక్కడకి తీసుకువచ్చారని చెప్పారు. ఆ భవిష్యత్తు ఎంత అంధ:కారంగా ఉంటుందో వారికి ఎవరు చెబుతారు? అప్పుడే నేనొక నిర్ణయం తీసుకున్నాను. మానవ అక్రమ

రవాణాకు వ్యతిరేకంగా పనిచేస్తున్న ఓ స్వచ్ఛంద సంస్థలో ఈ అంశంపై పనిచేసేందుకు సిద్ధమయ్యాను. రెస్క్యూ ఆపరేషన్‌లో పాల్గొనేదాన్ని. వాటిని విజయవంతంగా నడిపించేదాన్ని. అయితే పిల్లలను రక్షించి ఇళ్లకు చేర్చడంతోనే ఆ సంస్థ పని అయిపోయేది. కాని వారికి సరైన మార్గదర్శకం చేయాలి. అప్పుడే వారు ఆ కూపంలోకి నెట్టబడరు. ఎందుకంటే వారికి ఆశలు చూపి మళ్లీ ట్రాఫికింగ్ చేసేందుకు ఎన్నో ముఠాలు కాచుక్కూర్చొంటాయి. ఈ సమస్య నుండి వారిని బయటపడేయాలని నేనే సొంతంగా 2020లో 'డైలగ్ ఫౌండేషన్'ను స్థాపించాను.

సంస్థ స్థాపించినప్పటి నుండి పశ్చిమ బెంగాల్, అస్సాం, భూటాన్, మయన్మార్ వంటి రాష్ట్రాల నుండి ఎంతోమంది అమ్మాయిలను ట్రాఫికింగ్ నుండి రక్షించాం. కోవిడ్ కాలంలో ఐదుసార్లు నాకు వైరస్ సోకింది. వైరస్ నుండి బయటపడిన తరువాత ప్రాంతాల వారీగా తిరిగాను. మొదట్లో చాలా వ్యతిరేకత వచ్చేది. నేను చెప్పే విషయాలు వినేందుకు ఎవరూ సిద్ధపడేవారు కాదు. నా ముఖం మీదే తలుపులు వేసిన సందర్భాలున్నాయి. అయినా నేను వదిలేదాన్ని కాదు. ఆడపిల్లలను ట్రాఫికింగ్ చేయొద్దని వాళ్లని చదివించమని, వృత్తివిద్య నేర్పించమని, మా సంస్థ వారికి తగిన ప్రోత్సాహం ఇస్తుందని చెప్పేదాన్ని. చెప్పగా, చెప్పగా ఇప్పుడువాళ్లు నా మాటలను నమ్ముతున్నారు. నేను చెప్పే విషయాలు ఆసక్తిగా వింటున్నారు' అంటూ చెబుతున్న పల్లవి సంస్థ స్థాపించిన ఈ తక్కువ సమయంలోనే 75 వేల మంది మహిళలతో మాట్లాడారు. అనేక వర్క్ షాపులు, వివిధ కార్యక్రమాల ద్వారా సామాజిక రుగ్మతలపై వారిని చైతన్యం చేస్తున్నారు.

ఈ ప్రయాణంలో నేను బాగా సంతోషించిన విషయం ఒకటి జరిగింది. నేను గ్రామాలను సందర్శిస్తూ తిరుగుతున్నప్పుడు సంస్థ నిర్వహించే కార్యక్రమాల ద్వారా చైతన్యం పొందిన ఓ మహిళ తన ఇంటి పక్కన జరుగుతున్న ఓ బాల్య వివాహాన్ని అడ్డుకున్నానని, తన బంధువుల అమ్మాయిని వేరే రాష్ట్రంలో పనికి పంపిస్తుంటే వద్దని వారించానని చెబుతూ కన్నీళ్ల పర్యంతమైంది. ఆమెకే కాదు.. నాక్కూడా కన్నీళ్లు వచ్చాయి. ఈ తెగువ, సాహసమే నేను కోరుకుంది. ఇంకా ఎంతోమంది మహిళలు ఇలాగే ముందుకురావాలి' అంటున్న పల్లవి..

అమ్మాయిలకు లభించిన ఈ ఆర్థిక స్వాతంత్ర్యం వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపుతుంది. గృహహింస నుండి విముక్తులను చేస్తుంది. తన జీవితాన్ని నిర్ణయించుకోగల స్వేచ్ఛ ఇస్తుంది. అప్పుడు ఈ ట్రాఫికింగ్‌కు గురయ్యే అవకాశం వుండదు' అంటారు.

రెస్క్యూ ఆపరేషన్‌లో 2019లో గుజరాత్ నుండి రక్షించబడిన ఓ బాలిక ఇప్పుడు సంస్థ ద్వారా డాక్టరు చదువుతోంది. మరొక బాలిక సంస్థ కార్యకలాపాల్లో కీలక భాగస్వామిగా ఉంటోంది. ఇలా ఎంతోమంది బాలికలు రక్షించబడిన వారిలో ఉన్నారు. 'నాకు 16 ఏళ్లప్పుడు పల్లవి అక్క ద్వారా రక్షించబడ్డాను. నేను పోగొట్టుకున్న జీవితం అప్పటి నుండి మళ్లీ కొత్తగా మొదలైంది. నేను స్వేచ్ఛగా బయటకి వస్తానని ఎప్పుడూ అనుకోలేదు. కాని అది జరిగింది. ఇక నుండి నాలా మరొకరు ట్రాఫికింగ్‌కు గురవ్వకుండా కాపాడేందుకే కృషిచేస్తాను' అంటోంది సీత అనే యువతి.

నా ఆనందం మాటల్లో వర్ణించలేకున్నాను ..

ఎన్టీఆర్, కొరటాల శివ కాంబినేషన్లో వస్తున్న తాజా చిత్రం ద్వారా తెలుగు చిత్ర సీమకి హీరోయిన్‌గా ఎంట్రీ ఇస్తున్న జాన్వీ కపూర్ ఈ మూవీ గురించి పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. 'నా అభిమాన కథానాయకుడు ఎన్టీఆర్‌తో కలిసి చేస్తున్న ఈ మూవీ ద్వారా తెలుగులోకి పరిచయమవ్వడం చాలా సంతోషంగా ఉంది. షూటింగ్ అతి త్వరలో మొదలు కానుండడంతో నా ఆనందాన్ని మాటల్లో వర్ణించలేకున్నాను. కొరటాల శివ అద్భుతమైన స్టోరీ చెప్పారు. ఈ పాన్ ఇండియన్ మూవీ హీరోయిన్‌గా నాకు పెద్ద బ్రేక్ ఇస్తుందని ఆశిస్తున్నాను'. అనిరుధ్ సంగీతం అందించనున్న ఈ మూవీని యువ సుధా ఆర్ట్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంస్థలు భారీ వ్యయంతో నిర్మిస్తుండగా రత్నవేలు ఫొటోగ్రఫి అందించనున్నారు. ఏప్రిల్ నుండి సెట్స్ మీదకు వెళ్లనుంది.

ఫస్టాఫ్ 20.. సెకండాఫ్ 16.. కట్స్‌తో యు/ఎ

నాని హీరోగా నటిస్తోన్న తాజా చిత్రం 'దసరా' సెన్సార్ పూర్తి చేసుకుంది. సెన్సార్ సభ్యులు యు/ఏ సర్టిఫికేట్‌ను జారీచేశారు. అయితే ఈ మధ్య కాలంలో ఎప్పుడూ లేని విధంగా ఫస్టాఫ్‌లో 20, సెకండాఫ్‌లో 16 మొత్తం 36 కట్స్ విధించినట్లు తెలుస్తోంది. కట్స్‌తో పాటు కొన్ని పదాలను మ్యూట్ చేయాలని, ధూమపానం, మద్యపానానికి సంబంధించి వచ్చే డిస్‌క్లైమర్ ఫాంట్‌ను పెద్ద సైజ్‌లో చూపించాలని సూచించినట్లుగా తెలుస్తోంది. అంతేకాదు, హింసాత్మక సన్నివేశాలను సీజీతో కవర్ చేయాలని సూచిస్తూ.. సర్టిఫికేట్ జారీ చేసినట్లుగా సమాచారం. సెన్సార్ బోర్డు సూచించిన కటింగ్ సన్నివేశాలన్నీ పోగా.. చిత్ర నిడివి 2 గంటల 39 నిమిషాలు ఉండబోతోంది. అయితే సినిమాపై, నాని నటనపై మాత్రం సెన్సార్ సభ్యులు ప్రశంసలు కురిపించారని తెలుస్తోంది. ఈ సినిమాలో కీర్తి సురేష్ హీరోయిన్‌గా నటిస్తుండగా.. శ్రీకాంత్ ఒదెల దర్శకత్వంలో శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి భారీ స్థాయిలో నిర్మించారు. మార్చి 30న తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ఈ చిత్రం విడుదల కాబోతోంది.

31న 'సత్యం వధ ధర్మం చెర'

'కథలు చిన్న పిల్లలకి నిద్రపుచ్చడానికి చెప్తు ఉంటాం, కానీ పెద్ద మనుషులను మేలు కొలపటానికి కూడా కొని కథలు చెప్పాలి. 'సత్యం వధ ధర్మం చెర' చిత్ర కథ మన నిజజీవితంలో ప్రతిరోజూ జరిగే సంఘటనలే. మనం ప్రతి రోజు ఇలాంటి వార్తలు పేపర్‌లో చదువుతూ ఉంటాం లేదా న్యూస్ చానెల్స్‌లో చూస్తూ ఉంటాం. మన రాజ్యాంగం చాలా గొప్పది, మన చట్టం చాలా గట్టిది, కానీ బాధితుడు చిన్నవాడు కారకుడు పెద్దవాడు అయితే ఈ చట్టం రకరకాలుగా పని చేస్తుంది. మరి నిజంగా చట్టం ఎలా పనిచేయాలో మా చిత్రంలో చూపించాము. సమాజంలో జరిగిన కొన్ని నిజ సంఘటనల ఆధారంగా మా చిత్ర కథని తయారు చేసుకున్నాము. సినిమా చాలా బాగా వచ్చింది. మార్చి 31న విడుదల కానుంది' అని చిత్ర నిర్మాత కొండయ్య తెలిపారు. వి శ్రీనివాస్ ఆర్ట్ క్రియేషన్స్, త్రిదేవ్ క్రియేషన్స్ పతాకంపై ఎదుబాటి కొండయ్య నిర్మిస్తున్న ఈ చిత్రం అని కార్యక్రమాలు పూర్తి చేసుకుని మార్చి 31న విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో నిర్మాత చిత్ర విశేషాలు పంచుకున్నారు. బాబు నిమ్మగడ్డ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. యువ కథానాయికలు పూజ, మధుబాల కీలకపాత్రల్లో నటిస్తున్నారు.

కోలుకుంటూ ధైర్యంగా ఉన్నా..

'మయోసైటిస్' నిర్ధారణ అయిన తొలి రోజుల్లో చాలా బలహీనంగా అనిపించేది. 'యశోద' చిత్ర సమయంలో ఆరోగ్యం ఇంకా వీక్ అయింది. అలాగే ప్రచార కార్యక్రమాల్లోనూ పాల్గొన్నా. ఇంటర్వ్యూలు ఇవ్వడానికి కూడా ఓపిక ఉండేది కాదు. ఎన్నో మందులు తీసుకోవాల్సి వచ్చేది. సినిమా నా భుజాలపై ఉండటంతో బాధ్యతగా భావించి అతి కష్టంగానే ఒక ఇంటర్వ్యూ అయినా చేయాలనుకున్నా. ఆ తర్వాత క్రమంలో నా ఆరోగ్యం మెరుగుపడుతూ వచ్చింది. గుణశేఖర్ శాకుంతలం కథ చెప్పగానే వెంటనే తిరస్కరించాను. 'ఫ్యామిలీ మ్యాన్' వెబ్‌సిరీస్ తర్వాతే ఈ కథ విన్నాను. అందుకే ఒప్పుకోలేదు. మూడేళ్లుగా నాలో పేరుకుపోయిన భయమే దీనికి కారణం. కానీ గుణశేఖర్ ఒప్పించి ఈ చిత్రంలో చేయించారు. ఇప్పుడు 'శాకుంతలం' కోసం ఆరోగ్యం సహకరిస్తోంది. మయోసైటిస్ నుంచి కోలుకుంటూ ధైర్యంగా ఉన్నా" అని సమంత తెలిపారు. ఆమె కీలక పాత్రలో నటించిన 'శాకుంతలం' చిత్రం ప్రమోషన్ కార్యక్రమాల్లో భాగంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఆమె పైవిధంగా స్పందించారు. గుణశేఖర్ దర్శకత్వంలో రాబోతున్న ఈ చిత్రం అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని ఐదు భాషల్లో ఏప్రిల్ 14న విడుదలకు సిద్ధంగా ఉంది. దేవ్ మోహన్, సచిన్ ఖేడ్కర్, మోహన్‌బాబు, అదితి బాలన్, అనన్య కీలక పాత్రల్లో నటిస్తున్నారు. మణిశర్మ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని నీలిమ గుణ నిర్మిస్తున్నారు.

ఫైనల్‌కు సినీ హీరోలు

టైటిల్‌కు చేరువలో తెలుగు వారియర్స్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

విశాఖలో సెలబ్రిటీ క్రికెట్ లీగ్ (సిసిఎల్ - 2023) ఉత్సాహభరితంగా సాగింది. శనివారం పి.ఎం.పాలెంలోని డాక్టర్ వైఎస్.రాజశేఖర్‌రెడ్డి అంతర్జాతీయ మైదానంలో జరుగుతున్న ఫైనల్ పోటీ అందరిలో సందడి నింపింది. కడపటివార్తలందేసరికి తెలుగు వారియర్స్ విజయం దిశగా సాగుతోంది. ఫైనల్ మ్యాచ్‌లో టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన భోజ్‌పురి దబాంగ్స్ జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో బ్యాటర్లు ఆశించిన స్థాయిలో రాణించకపోవడంతో నిర్ణీత 10 ఓవర్లకు 6 వికెట్లు కోల్పోయి 72 పరుగులు మాత్రమే చేయగలిగింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన తెలుగు వారియర్స్ జట్టు కెప్టెన్ అఖిల్ అక్కినేని 32 బంతుల్లో 6 సిక్సుల సాయంతో 67 పరుగులు చేసి శభాష్ అనిపించుకున్నాడు. ఈ క్రమంలోనే తెలుగు వారియర్స్ తన మొదటి ఇన్నింగ్స్‌లో 4 వికెట్లు మాత్రమే కోల్పోయి 104 పరుగులు చేసి ప్రత్యర్థి జట్టు ముందు 27 పరుగుల ఆధిక్యాన్ని ఉంచింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన భోజ్‌పురి దబాంగ్స్ 4 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 38 పరుగులు మాత్రమే చేసి ఓటమి దిశగా పయనిస్తోంది.

సందడి చేసిన అగ్ర హీరోలు

ఫైనల్ మ్యాచ్‌లో తెలుగు, కన్నడ అగ్ర కథానాయకులు విక్టరీ వెంకటేష్, శ్రీకాంత్, సుదీప్ సందడి చేశారు. మ్యాచ్ జరుగుతున్నంత సేపూ వారు తెలుగు వారియర్స్ జట్టును ప్రోత్సహిస్తూ నృత్యాలు చేస్తూ ప్రేక్షకులను అలరించారు.

తొలి టైటిల్ కొట్టేదెవరో..?

డబ్ల్యుపిఎల్ ఫైనల్ నేడు



రాత్రి 7.30గం॥ల నుంచి

ముంబయి: బిసిసిఐ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోన్న మహిళల ప్రిమియర్ లీగ్(డబ్ల్యుపిఎల్) చివరి దశకు చేరుకుంది. లీగ్ దశ ముగిసిన అనంతరం ఢిల్లీ క్యాపిటల్స్ అగ్రస్థానంలో నిలిచి నేరుగా ఫైనల్‌కు చేరగా.. ముంబయి-యుపి జట్ల మధ్య 21న జరిగిన ఎలిమినేటర్‌లో ముంబయి జట్టు 72పరుగుల తేడాతో గెలిచి ఫైనల్లోకి ప్రవేశించింది. లీగ్ దశలో ఇరుజట్లు భాగంగా ఇరుజట్లు ఒక్కోసారి తలపడగా.. తొలి మ్యాచ్‌లో ముంబయి 8వికెట్ల తేడాతో ఢిల్లీపై గెలుపొందగా.. రెండోసారి ఢిల్లీ జట్టు 9వికెట్ల తేడాతో ముంబయిని చిత్తుచేసింది. ఈ క్రమంలో టైటిల్ ఏ జట్టు కైవసం చేసుకుంటుందో! ముంబయి ఇండియన్స్‌కు టీమిండియా జట్టు కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ కెప్టెన్‌గా ఉండగా.. ఢిల్లీ జట్టుకు ఆస్ట్రేలియా జట్టు కెప్టెన్ మెగ్ లానింగ్ వ్యవహరిస్తున్నారు. ఇరుజట్లలోనూ స్టార్ ఆటగాళ్లు ఉన్న నేపథ్యంలో ఫైనల్ పోటీపై ఉత్కంఠ నెలకొంది.

మను బకర్‌కు కాంస్యం

ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచకప్

భోపాల్: ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచకప్ షూటింగ్ పోటీల్లో భారత్‌కు మరో పతకం దక్కింది. రెండేళ్ల తర్వాత మను బకర్ షూటింగ్ పోటీల్లో ఓ పతకం సాధించింది. శనివారం జరిగిన 25మీ. స్పోర్ట్స్ పిస్టల్ విభాగంలో 21ఏళ్ల మను 584పాయింట్లతో మూడోస్థానంలో నిలిచింది. ఇక 10మీ.ఎయిర్ పిస్టల్ క్వాలిఫికేషన్ రౌండ్‌లో మను 568-19పాయింట్లతో 16వ స్థానంలో నిలిచి నిరాశపరిచింది. ఆ తర్వాత మూడో సిరీస్‌లో వరుసగా నాలుగు 8పాయింట్లు, మూడు 9పాయింట్లతో 89పాయింట్లతో ఫైనల్ పోటీకి అర్హత సాధించింది. ఫైనల్లో ప్రెసిషన్‌లో 290, ర్యాపిడ్‌లో 294పాయింట్లు సాధించి పతకం కైవసం చేసుకుంది. మను చివరిసారిగా 2021 ప్రపంచకప్ పోటీల్లో రజిత పతకం సాధించింది. ఈ విభాగంలో జర్మనీకి స్వర్ణం, చైనాకు రజిత పతకాలు దక్కాయి. దీంతో పతకాల పట్టికలో చైనా 6స్వర్ణ, 2రజిత, 2కాంస్యాలతో అగ్రస్థానంలో ఉండగా.. భారత్ 1స్వర్ణ, 1 రజిత, 4కాంస్యాలతో రెండో స్థానంలో, జర్మనీ ఒక్కో స్వర్ణ, రజిత పతకాలతో మూడోస్థానానికి చేరింది.

సెమీస్‌కు సాత్విక్-చిరాగ్

స్విస్ ఓపెన్ సూపర్-300

బస్సెల్(స్విట్జర్లాండ్): స్విస్ ఓపెన్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నీ సెమీఫైనల్లోకి భారత పురుషుల డబుల్స్ జోడీ ప్రవేశించింది. శుక్రవారం రాత్రి జరిగిన క్వార్టర్‌ఫైనల్లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి జోడీ 15-21, 21-11, 21-14తో డెన్మార్క్‌కు చెందిన జప్పే బే-లస్సె మొథెడేలపై పోరాడి నెగ్గారు. తొలి గేమ్‌ను కోల్పోయిన భారత జంట.. రెండు, మూడు గేమ్‌లలో అద్భుతంగా పుంజుకొని మ్యాచ్‌ను గెలుపొం దడం విశేషం. ఈ మ్యాచ్ సుమారు 54నిమిషాలసేపు సాగింది. ఈ టోర్నమెంట్‌లో పురుషుల, మహిళల సింగిల్స్ విభాగాల్లో భారత షట్లర్ల పోరాటం ముగిసిన సంగతి తెలిసిందే.

తొలి వన్డే న్యూజిలాండ్‌దే!

శ్రీలంకపై 198పరుగుల తేడాతో గెలుపు

ఆక్లాండ్: శ్రీలంకతో జరిగిన తొలి వన్డేలో న్యూజిలాండ్ జట్టు 198పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. టాస్ ఓడి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ 49.3ఓవర్లలో 274పరుగులకు ఆలౌటైంది. ఫిన్ అలెన్(51), రవీంద్ర(49), మిఛెల్(47), ఫిలిప్స్(39) బ్యాటింగ్‌లో రాణించారు. కరుణరత్నేకు నాలుగు, రజిత, కుమారకు రెండేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో శ్రీలంక జట్టు కివీస్ బౌలర్ల ధాటికి 19.5ఓవర్లలో 76పరుగులకే కుప్ప కూలింది. మాథ్యూస్(18), కరుణరత్నే(11), కుమార(10) మాత్రమే రెండంకెల స్కోర్ చేశారు. షిప్లేకు ఐదు, మిఛెల్, టిక్నెర్‌కు రెండేసి వికెట్లు దక్కాయి. రెండో వన్డే క్రైస్ట్‌చర్చ్ వేదికగా మంగళవారం జరగనుంది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ షిప్లేకు దక్కింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68